telugusaahityam-telugubooks

# శ్రీ వేంకటేశ్వర దర్శనము

## ఇరవైనాలుగు కేశవ నామాల శ్రీ వేంకటేశ్వర దివ్య దర్శనం



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks

# శ్రీ వేంకటేశ్వర దర్శనము

**(ఇరవై నాలుగు కేశవ నామాల శ్రీ వేంకటేశ్వర దివ్య దర్శనం)**


రచన

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**
(T.V.R.K. Murthy, M.Tech)



श्री

**శ్రీ డిజైన్స్**

**Vedic Business Consultants**
**www.shridesigns.net**
**Phone : 040- 65885750.**
**హైదరాబాదు**
**2007**



**శ్రీ వేంకటేశ్వర దర్శనము**

**(ఇరవై నాలుగు కేశవ నామాల శ్రీ వేంకటేశ్వర దివ్య దర్శనం)**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**



© సర్వహక్కులు రచయితవి.



ప్రథమ ముద్రణ

ఫిబ్రవరి, 2007

వెల :

**Rs. 50/-**



**కాపీలకు**

**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No.204, 'Vijaya Towers'
Kalyan Nagar Phase-III,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, A.P., India.

Email : viswapathi@yahoo.com &
tvrkmurthy@yahoo.com
Ph (O) : 040 - 65885750,
Mobile : 98494 43752



Designed & Printed at :
**SRI VASAVI GRAPHICS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9247797342.


courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks

# శ్రీ వేంకటేశ్వర దర్శనము

## విషయసూచిక


| | | పేజీ నెంబర్ |
|---|---|---|
| 1. | ఓం కేశవాయ నమః | 1 |
| 2. | ఓం నారాయణాయ నమః | 6 |
| 3. | ఓం మాధవాయ నమః | 10 |
| 4. | ఓం గోవిందాయ నమః | 15 |
| 5. | ఓం విష్ణవే నమః | 18 |
| 6. | ఓం మధుసూదనాయ నమః | 22 |
| 7. | ఓం త్రివిక్రమాయ నమః | 27 |
| 8. | ఓం వామనాయ నమః | 31 |
| 9. | ఓం శ్రీధరాయ నమః | 36 |
| 10. | ఓం హృషీకేశాయ నమః | 41 |
| 11. | ఓం పద్మనాభాయ నమః | 46 |
| 12. | ఓం దామోదరాయ నమః | 49 |
| 13. | ఓం సంకర్షణాయ నమః | 53 |
| 14. | ఓం వాసుదేవాయ నమః | 57 |
| 15. | ఓం ప్రద్యుమ్నాయ నమః | 61 |
| 16. | ఓం అనిరుద్ధాయ నమః | 65 |
| 17. | ఓం పురుషోత్తమాయ నమః | 69 |
| 18. | ఓం అధోక్షజాయ నమః | 73 |
| 19. | ఓం నారసింహాయ నమః | 77 |
| 20. | ఓం అచ్యుతాయ నమః | 81 |
| 21. | ఓం జనార్దనాయనమః | 85 |
| 22. | ఓం ఉపేంద్రాయ నమః | 88 |
| 23. | ఓం హరయే నమః | 91 |
| 24. | ఓం శ్రీ కృష్ణాయనమః | 95 |


★ ★ ★

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks

# నివేదన

వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన

వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి

ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రితో సమానమైన పవిత్ర ప్రదేశం మరొకటి లేదు, శ్రీనివాసునితో సమానమైన దేవుడు ఇంతకు ముందు కాలంలో లేడు, ఇకముందు ఎన్నడూ కూడా ఉండబోడు, సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే మనలందరిని కలియుగ బాధల నుండి కాపాడి అనుగ్రహించడానికై తిరుమలలో శ్రీ వేంకటేశ్వరునిగా స్వయంవ్యక్త అర్చారూపంలో ఆవిర్భవించాడు. ఆ స్వామి అత్యంత కరుణామయుడు, నమ్మినవారికి కొంగు బంగారం, ఆపదమొక్కులవాడు. ఆ స్వామిని నమ్మినవారికి ఎటువంటి బాధలు ఉండవు. అత్యంత దయామయమూర్తి ఆ శ్రీనివాసుడు.

నా తల్లితండ్రులైన కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు గారు, తల్లి శ్రీమతి నాగరత్నాంబ గారలు శ్రీనివాసుని ఎన్నో విధాలుగా సేవించి తరించారు. నా తల్లితండ్రులు ఇరువురికీ శ్రీనివాసునిపై అపార భక్తి. చిన్నతనం నుంచీ మా తండ్రిగారు రోజూ ఉదయమే చదివే శ్రీ వేంకటేశ్వరస్వామివారి సుప్రభాతం నాలో శ్రీనివాసుని యెడల భక్తి భావాన్ని కలిగించింది. అప్పట్నుంచి శ్రీనివాసుడే నాకు గురువు, దైవం, తల్లి తండ్రి. అతడే యజమాని కూడాను.

1983లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుండి ఎం.టెక్. చదివిన నేను 1984 దాకా ఆల్విన్‌లోనూ, 1989 దాకా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజిలోనూ ఉద్యోగం చేశాను. 1983లో చి॥సౌ॥ రుక్మిణి వైదేహితో వివాహం. ముగ్గురు పిల్లలు, ఆనంది, ఆముక్త, ఆదిత్యలు.

1998 నుంచి బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించటం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 2,500 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయవలన ఇంతకుమునుపు నేను శ్రీ శ్రీనివాస మాహాత్మ్యము, శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పము అనే రెండు పుస్తకాలు రచించడం జరిగింది. ఈ రెండూ శ్రీవారి భక్తులకు అత్యంత ఆప్త గ్రంథాలు అవటం నాకెంతో సంతోషం. వ్రతకల్పం ఆచరించినవారు ఎన్నో అద్భుతమైన శ్రీనివాసుని లీలలకు లోనవుతున్నారు. ఈ రెండు పుస్తకాలు, మూడవదైన ఈ శ్రీ వేంకటేశ్వర దర్శనం వ్రాయడం కేవలం ఆ అమృతమూర్తి అనుగ్రహంతోనే సాధ్యపడింది. ఈ మూడింటిని శ్రీవారి మహా ప్రసాదంగా భావిస్తున్నాను. కలం పట్టుకున్నది మాత్రమే నేను, అంతా ఆ స్వామి అనుగ్రహమే! ప్రతి అక్షరం శ్రీవారి ప్రేరణే!

ప్రతీ సంవత్సరంలోనూ మనం పన్నెండు పౌర్ణిమలు, పన్నెండు అమావాస్యలు ఏర్పడడం గమనిస్తాము. ఈ రెండూ కలిసి కాలమూర్తులుగా ఏర్పడుతున్నాయి. వీరే కేశవాది ఇరవైనాలుగు నామాలతో మనం ప్రతీ పూజలోనూ ముందుగా జపించే కాలపురుషుడైన శ్రీమన్నారాయణుని రూపాలు. ఈ ఇరవై నాలుగు కేశవనామాలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది.

శ్రీమన్నారాయణుని ఈ ఇరవైనాలుగు రూపాలలో శ్రీ స్వామివారు తన నాలుగు చేతులలోను ఆయుధాలు వేర్వేరు క్రమాలలో ధరించి

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks

ఉంటారు. కేశవుని రూపంలో రెండు కుడిచేతులలో పద్మము, శంఖము ధరించి ఎడమ చేతులలో గద, చక్రము ధరించి ఉంటారు. మాధవుని రూపంలో కుడిచేతులలో గద, చక్రము, ఎడమచేతులలో పద్మము, శంఖము ధరించి ఉంటారు. మధుసూదన రూపంలో కుడిచేతులలో చక్రము, శంఖము ధరించినవాడై ఎడమ చేతులలో గద, పద్మము ధరించినవాడై ఉంటాడు. ఇలా ఇరవైనాలుగు నామాల శ్రీమన్నారాయణుని మూర్తులు ఆయుధాలు ధరించటంలో విభిన్నంగా ఉంటారు.

శ్రీనివాసుని ఈ ఇరవైనాలుగు నామాలతో పూజించినవారికి సర్వసౌభాగ్యాలు లభిస్తాయి. సర్వ ఐశ్వర్యాలూ కలుగుతాయి. శ్రీ వేంకటేశ్వరుని అమృత తత్వమైన శ్రీ వేంకటతత్వం అర్థం చేసుకున్నవారికి ఏ బాధలూ ఉండవు. ఆ తత్వం అర్థం చేసుకుంటే సర్వ వేదాల సారమూ బోధ పడుతుంది. సంపూర్ణ జ్ఞానం, దానితో బ్రహ్మానందము లభిస్తాయి. శ్రీ స్వామివారి అనుగ్రహంచేత ఒకరోజు తెల్లవారురఝామున కేశవనామాలతో శ్రీ స్వామి దర్శనం రాయాలనే తలంపు కలిగింది. ఇది శ్రీ స్వామి వారి అనుగ్రహంగా, ఆజ్ఞగా భావించి ఈ పుస్తక రచన గావించాను. ప్రతీ అధ్యాయము ఎలా రాశానో నాకే తెలియదు. ఆ స్వామినే ప్రార్థించి రాయడానికి ఉపక్రమించేవాడిని. ఆ స్వామి అనుగ్రహంతో త్వరలోనే పూర్తి చేయగలిగాను.

ఒక్కొక్కనామం చదువుతూ ఉంటే శ్రీ స్వామివారి దివ్యరూపం మనకంటి ఎదురుగానే గోచరిస్తుంది. పూర్తిగా ఇరవైనాలుగు నామాల అధ్యాయాలు చదివేటప్పటికి శ్రీ వేంకటేశ్వరుని దివ్యదర్శనం, దివ్య అనుగ్రహం తప్పక కలుగుతుంది. మనస్సులో ఆ స్వామినే తలుస్తూ ఏ నామం తీసుకుని చదివినా మనస్సు ప్రశాంతతో నిండిపోతుంది. అన్ని శరీర, మానసిక బాధలు మాయమవుతాయి. సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి.

ఈ పుస్తకం రచిస్తున్నప్పుడు ఎందరో మహానుభావుల గ్రంథాలు, ఎంతగానో నాకు తోడ్పడ్డాయి. వారందరికీ పేరుపేరున నా నమస్కారాలు. అలాగే ఈ గ్రంథ రచన సాదాంతం నా సహధర్మచారిణి చి॥ల॥సౌ॥ శ్రీమతి వేంకట రుక్మిణీ వైదేహి, చిరంజీవులు ఆనంది, ఆముక్త, ఆదిత్య శ్రీనివాస్‌లు ఎంతో సహకరించారు. ఈ పుస్తకాన్ని, కవర్ చిత్రాలను ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ వాసవీ గ్రాఫిక్స్, శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు శ్రీలక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక ప్రచురణలో ఎంతోమంది శ్రీవారి ప్రియ భక్తులు ఎన్నో విధాలుగా సహకరించారు. వీరికీ, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ శ్రీనివాసుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఇంతటి మహా భాగ్యాన్ని ప్రసాదించిన ఆ శ్రీవారి సేవలోనే ఎల్లప్పుడూ గడుపుతానని, శ్రీ వేంకట తత్వాన్ని ప్రజలందరి హృదయాలకు చేరువగా తీసుకెళ్ళడమే నా జీవిత గమ్యమని ఆ స్వామివారికి విన్నవించుకుంటున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు :

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం

హైదరాబాద్. తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
05-02-2007

courtesy-www.vdesignhome.se

# ఈ పుస్తకం ఎలా చదవాలి

భగవంతుడికి సంబంధించిన ఏ పుస్తకమైనా చదవడానికి ఎటువంటి నియమ నిబంధనలు వుండవని నా విశ్వాసం. వయస్సుతోగానీ, కులంతో గానీ, ఏ నిమిత్తమూ లేదు. మనస్సు నిర్మలంగానూ, శరీరం శుభ్రంగానూ ఉంటేచాలు. ఎవరైనా, ఏరీతిలోనైనా, ఏరోజైనా, ఏప్రదేశంలోనైనా చదువుకొనవచ్చును. ఆ శ్రీమన్నారాయణుని గురించిన పుస్తకం చదవడానికి కావలసినది నిర్మల భక్తి తప్ప మరొకటి కాదు. ఎటువంటి కఠోర నిష్ఠలు, ఉపవాసాలు అవసరం లేదు.

ఇకపోతే భగవంతునికి సంబంధించిన స్తోత్రాలకు, పారాయణ గ్రంథాలకి కొన్ని కొన్ని ప్రత్యేక పర్వ దినాలలోను, వైకుంఠ ఏకాదశి లాంటి పవిత్ర దినాలలోనూ చదివితే తప్పకుండా ఫలితం రెట్టింపుగా ఉంటుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు.

ఏకాదశి శ్రీనివాసునికి అత్యంత ప్రీతికరమైనది. ప్రతీ ఏకాదశి తిథినాడు కనీసం ఏ మూడు నామాలైనా చదివినవారికి సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. అలాగే ప్రతీనెలా శ్రవణా నక్షత్రం నాడు కనీసం ఒక్క నామమైనా చదివినవారికి సర్వ ఐశ్వర్యాలూ కలుగుతాయి. శరీరము, వయస్సు సహకరిస్తే కనీసం సంవత్సరంలో ఏ ఒక్క ఏకాదశినాడైనా పుస్తకంలోని ఇరవైనాలుగు నామాలు ఒకేసారి చదివితే మరు జన్మ ఉండదు. జీవించినంతకాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందుతారు. వైకుంఠ ఏకాదశినాడు ఈ పుస్తకం పూర్తిగానూ, లేదా కనీసం మూడు నామాలైనా చదివితే చాలా విశేషం. అలాగే శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన ఏ పర్వదినాలలో చదివినా విశేష ఫలం లభిస్తుంది.

అలాగే ప్రతీరోజు ఉదయము లేచి స్నానాదులు పూర్తి చేసిన తరువాత కనీసం ఒక్కనామమైనా చదివితే ఆరోజంతా ఎంతో జయప్రదంగా గడుస్తుంది. ఆ రోజు తలపెట్టిన పనులన్నీ నిర్విఘ్నంగా, జయప్రదంగా పూర్తవుతాయి.

అనారోగ్యంతో ఉన్నవారు పద్మనాభ, దామోదర, సంకర్షణ నామాలను వారంరోజులపాటు రోజూ చదివితే తప్పక సంపూర్ణ ఆరోగ్యవంతులౌతారు. మనస్సు ఏ కారణం చేతనైనా ప్రశాంతంగా లేనపుడు గోవిందాయ నమః అనే నామ అధ్యాయాన్ని చదివితే పూర్తి ప్రశాంతత వెంటనే లభిస్తుంది.

ఎటువంటి కష్టాలలో వున్న వారైనా మొదటి మూడు నామాలైన కేశవ, నారాయణ, మాధవ నామాలు రోజూ చదివితే త్వరలోనే అన్ని కష్టాలూ తొలగిపోయి సర్వసౌభాగ్యాలనూ పొందుతారు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఏ దేవాలయంలోనైనా కూర్చుని కనీసం ఏ మూడు నామాలనైనా వీలున్నప్పుడల్లా చదువుకుంటే చాలా పుణ్యప్రదం. తిరుమలలో ఉన్నప్పుడు కనీసం ఒక్కనామమైనా చదివిన వారికి వేయి అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది.

ముందు చెప్పినట్లుగా ఈ నామాలు చదివేటప్పుడు ఎటువంటి కఠోర నియమ నిష్ఠలు అవసరం లేదు. మీరున్నచోటనే, మీకు వీలున్నట్లుగా కూర్చుని నిర్మల మనసుతో చదివితే చాలు. ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా చదవవచ్చును. ఈ పుస్తకం సర్వవేళలా మీతోనే ఉంచుకుని మనస్సుకు ఎప్పుడు తోచితే అప్పుడు ఏ నామాన్నైనా తీసుకుని చదువుకొనవచ్చును.

ఈవిధంగా మీకు వీలున్న ఏ రోజైనా, ఏ రీతిలోనైనా చదివి శ్రీనివాసుని అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యంతో, సర్వ సంపదలతో కలకాలం సుఖముగా జీవించవచ్చును.

**శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !**

– తిమ్మరాజు విశ్వపతిరామకృష్ణమూర్తి.

telugusaahityam-telugubooks



# ఓం కేశవాయ నమః

కలియుగ వైకుంఠమైన వేంకటాద్రిపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన ఆ శ్రీమన్నారాయణుడు అత్యంత కరుణామయుడు. ఈ జగత్తులోని సమస్త ప్రాణికోటి అతని స్వరూపమే. సకల జరాచర జీవరాశులందు అంతర్గతంగా ఉన్నది ఆ శ్రీనివాసుడే.

కేశి అని రాక్షసుని సంహరించిన శ్రీమన్నారాయణుడు కేశవునిగా పిలవబడుతున్నాడు. కేశవుడు సహస్ర శీర్షుడు. ఈ విశ్వానికి అతనే ప్రభువు. ఎవర్ని ధ్యానించడంచే మనలోని తమస్సు, మోహము నశిస్తాయో అతడే శ్రీమన్నారాయణుడు. పూజనీయులచేత పూజింప బడేవాడు శ్రీనివాసుడే. అతడే పరబ్రహ్మమూర్తి.

అనేక వేల శిరస్సులు, కన్నులు, అనేక వేల చేతులు, పాదాలు కలిగి ఈ విశ్వమంతా ఆక్రమించి వున్నది ఆ శ్రీమన్నారాయణుడే. బ్రహ్మాండంలోని 84లక్షల జీవరాశులలోను ఉన్నది ఆ పరబ్రహ్మమూర్తియే.



అన్ని ప్రాణులయందు ఉండి ఈ విశ్వం మొత్తాన్ని కంటికి రెప్పలా కాపడుతున్నది ఆ శ్రీనివాసుడే. నిత్యం శ్రీ మహాలక్ష్మిని తన హృదయంలో వుంచుకునే ఆ శ్రీమన్నారాయణుడు తన భక్తులందరికి అనేక భోగ భాగ్యాలను, సిరిసంపదలను అనుగ్రహిస్తున్నాడు.

కృతయుగంలో ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞ యాగాదులు, ద్వాపర యుగంలో అర్చనకిచ్చే సమాన ఫలాన్ని కలియుగంలో కేవలం నా నామ స్మరణకే ఇస్తానంటాడు శ్రీమన్నారాయణుడు. ఒక్కసారి ఆ స్వామిని తలిస్తే చాలు. జన్మ జన్మల సంసార బంధం తొలగిపోతుంది. ఒక్కసారి ఆర్ద్రతతో పిలిస్తే చాలు, వెంటనే పలికే అత్యంత దయామయుడు ఆ శ్రీనివాసుడు.

ఏ కొండపై కాలుపెడితే జన్మ జన్మల పాపాలు తొలగిపోతాయో అదే వేంకటాద్రి.... ఏ కొండపై కాలు పెడితే సర్వసౌభాగ్యాలు, సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయో అదే వేంకటాద్రి... ఏ కొండపై కాలు మోపగానే వేయి అశ్వమేధ యాగఫలం లభిస్తుందో అదే వేంకటాద్రి... ఏ కొండపై కాలు పెడితే కోటి బ్రాహ్మణ అన్నదాన సంతర్పణ ఫలం లభిస్తుందో అదే వేంకటాద్రి... ఏ కొండపై కాలు పెడితే కోటి గోదాన ఫలం లభిస్తుందో అదే వేంకటాద్రి... అదే శ్రీనివాసునిగా వెలసిన శ్రీమన్నారాయణుని దివ్య ధామము.

మనకు ఆకాశంలో కనిపిస్తున్న సూర్యభగవానుడు ప్రత్యక్ష నారాయణుడే. అతడే సమస్త జీవులకు ప్రాణాధారం, ప్రాణదాత. సర్వకాల సర్వావస్థలయందు సూర్యుడు ఉన్నాడు. సూర్యునికి ఉదయాస్తమానాలు లేవు. సూర్యుడు కనిపించటం, కనపించకపోవటం బట్టి మాత్రమే పగలు, రాత్రి చెప్పబడ్డాయి. ఎవరికి, ఎక్కడ సూర్యుడు ఉదయిస్తున్నట్లు కనబడితే అది వారికి తూర్పు దిక్కు. అస్తమించేది పడమర దిక్కు. ఈ ఆదిత్యుడు శ్రీనివాసుడే.

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అగ్ని స్వరూపుడవు, సమస్త లోకాలకు ఆధార భూతుడవు, అజ్ఞానాన్ని నశింపజేయువాడవు, అత్యంత తేజోమయ ప్రకాశమూర్తివి. ఈ సమస్త ప్రాణకోటి కర్మాచరణలను నియంత్రించే ఓ శ్రీనివాసా, నీవు అండగా నుండగా నాకింక భయమేల తండ్రీ!

గృహాలలో గృహలక్ష్మిగాను, గోవులలో కామధేనువుగాను, యజ్ఞంలో దక్షిణాదేవిగాను, చంద్రుడిలో శోభాలక్ష్మిగాను, పాతాళంలో నాగలక్ష్మి గాను, సూర్యునిలో తేజోలక్ష్మిగాను, పృథ్విలో మహాలక్ష్మిగాను ప్రకాశిస్తున్న ఆ తల్లి శ్రీమన్నారాయణుని హృదయలక్ష్మిగా మనందరిని తరింపజేస్తోంది. తిరుమలలో ప్రతీ శుక్రవారం శ్రీనివాసునికి జరిగే అభిషేకం ఆ తల్లి అభిషేకమే!

పూర్వకాలంలో దేవదానవ సంగ్రామం మహాభీకరంగా జరిగింది. అతి భయంకరంగా జరిగిన ఆ సంగ్రామంలో చివరికి దేవతలు గెలిచారు. ఇదంతా కూడా తమ గొప్పతనమేనని దేవతలు అహంకారంతో విర్రవీగారు. వారిలో వారు ఎవరి గొప్పలు వారు చెప్పుకుంటున్నారు. అగ్ని దేవుడు తన ధాటికి తట్టుకోలేకపోవటంచేతనే రాక్షసులు మసైపోయారని వాయుదేవుడు తన పరాక్రమం వల్లనే రాక్షసులు కొట్టుకుపోయారని ఇలా ఎవరికి తోచింది వారు అహంకారపూరితంగా చెబుతున్నారు.

పరబ్రహ్మమూర్తి అయిన శ్రీమన్నారాయణుడు ఇదంతా గమనిస్తున్నాడు. వీళ్ళకి తగిన గుణపాఠం నేర్పాలనుకున్నాడు. అలా నారాయణుడు సంకల్పించినంతనే ఒక పెద్ద భూతాకారం ఆ దేవతలందరి యెదుట ప్రత్యక్షమైంది. ఆ ఆకారాన్ని చూసి దేవతలందరు భయపడ్డారు. అది ఎవరో, ఎక్కడినుండి వచ్చిందో, ఆ తత్వమేమిటో ఎవరికీ అర్థం కాలేదు. వారందరు అగ్నిదేవుని వద్దకు వెళ్ళి ఆ భూతం బారినుంచి తమను రక్షించవలసిందిగా కోరారు. అప్పుడు అగ్నిదేవుడు ఆ భూతాన్ని సమీపించి ఎవరు నువ్వు, నేను తలిస్తే ఒక్కక్షణంలో ఈ సృష్టినంతటినీ



భస్మీపటలం చేయగలను అన్నాడు, అప్పుడు ఆ భూతాకారం చిరునవ్వుతో అయితే ఈ గడ్డిపోచను భస్మం చేయి అని ఒక గడ్డిపోచను అగ్నిదేవుని ముందు ఉంచింది.

అగ్ని అతి భీకరంగా, బ్రహ్మాండమైన మంటలను సృష్టించాడు, కానీ ఆ గడ్డిపోచ భస్మం అవలేదు సరికదా, కనీసం మసి బారలేదు కూడా! అగ్నికి ఆశ్చర్యం వేసి వెనక్కు మరిలాడు.

అప్పుడు దేవతలు వాయుదేవుని శరణు పొందారు, వాయుదేవా నువ్వు అత్యంత పరాక్రమవంతుడివి కదా, నువ్వే మమ్మల్ని రక్షింపగల వాడవు అని మిక్కిలి ప్రాధేయపడ్డారు, అప్పుడు వాయుదేవుడు అత్యంత గర్వంతో ఆ భూతాకారాన్ని సమీపించి నేను వాయువును, ప్రచండమైన గాలులతో ఈ భూమండలంలో దేన్నైనా ఎగరగొట్టగలను అన్నాడు. అప్పుడు ఆ భూతం అది సరే, ముందు ఈ గడ్డిపోచని ఎగర గొట్టమని అన్నది, అప్పుడు వాయువు బిగ్గరగా నవ్వుతూ ప్రచండరూపంతో వీచాడు. కాని ఆ గడ్డిపోచ ఇసుమంత కూడా కదలలేదు, అంతట పరాభవంతో తల వంచుకుని వెనతిరిగి దేవతల వద్దకు పోయాడు వాయుదేవుడు.

అప్పుడాదేవతలందరు ఇంద్రుడి వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పి ఆ భూతం బారినుండి తమను రక్షింపవలసినదిగా వేడుకున్నారు. ఇంద్రుడు వారికి అభయమిచ్చి ఆ భూతాకారాన్ని చూడటానికి బయలుదేరాడు. ఇంద్రుడు వెళ్ళేసరికి ఆ భూతాకారం కాస్త మాయమైంది. అక్కడ ఆ ఆకారం స్థానంలో ఉమాదేవి ప్రత్యక్షమైంది. అప్పుడు ఇంద్రుడు రెండు చేతులు జోడించి, నమస్కరించి, "తల్లీ ఇప్పటిదాకా వున్న ఆ ఆకారమేమిటి? ఆ తత్వమేమిటి? అత్యంత పరాక్రమవంతులైన అగ్ని, వాయు దేవులకు కూడా అంతు పట్టని ఆ మహాతత్వమేమిటి తల్లీ!" అని అడిగారు. అప్పుడు ఉమాదేవి నాయనా దేవేంద్రా, ఆ తత్వము ఎవరనుకున్నావు, మీ అందరిలోగల శక్తికి కారణభూతుడైన పరబ్రహ్మ తత్వమే. ఆ పరబ్రహ్మ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



తత్వము వలననే మీ మీ శక్తులు మీకు లభించాయి, అంతే కాని మీ విజయాలు మీ గొప్ప తనం అనుకోవద్దు అన్నది.

ఆ పరబ్రహ్మ తత్వమే శ్రీమన్నారాయణుడు. ఈ సమస్త లోకాలను పరిపాలించే ఆ శ్రీనివాసుడు. అంతటి పరబ్రహ్మమూర్తి తిరుమలపై మనకి అత్యంత చేరువలో శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన తరువాత మనకింక భయమేల. ఆ పరబ్రహ్మమూర్తికివే మనందరి నమస్కారాలు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*



# ఓం నారాయణాయ నమః

నారాయణుడంటే సర్వ వ్యాపకుడు అని అర్థము, సమస్త వస్తువులకు లోపల, బయట వ్యాపించి యున్నది శ్రీమన్నారాయణుడే, అతడే శ్రీ వేంకటేశ్వరుడు, వేంకటాచలపతి, వేంకటాధీశుడు.

ఆదిబ్రహ్మ కల్పమున జంబూ ద్వీప భాగమైన భరతవర్షమందు గంగానదికి రెండువందల యోజనముల దక్షిణమునను, పూర్వ సముద్ర మునకు ఐదు యోజనముల పశ్చిమమునను, నారాయణపర్వతమందు స్వామి పుష్కరిణికి పశ్చిమ తీరమున భాద్రపద శుక్ల ద్వాదశీ తిథినాడు శ్రవణా నక్షత్రము కూడిన సోమవార శుభదినమునాడు సిద్ధయోగ శుభసమయమున బృందారక బృందములచే ప్రార్థింపబడి పరమపురుషుడైన శ్రీనివాసుడు వేంకటాచలము నందు ఆవిర్భవించినట్టుగా శ్రీ పద్మ పురాణమున శ్రీ వేంకటాచల మాహాత్మ్యమునందు కలదు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే ఆవిర్భవించిన ఈ తిరుమల కొండ అత్యంత మహిమ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



కలది. ఈ పవిత్ర ప్రదేశమును వర్ణించుటకు ఎవరి శక్తియు చాలదు.

త్రిగుణాత్మకుడు, త్రికాలరూపి, చతుర్మూర్తిధరుడు, పాపహరుడు, చరాచర గురుడు, నిరాకారుడు, నిరామయుడు, అతీంద్రుడు అయిన ఆ శ్రీమన్నారాయణ మూర్తి తిరుమలపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలసి భక్తులందరి మనోభీష్టాలను తీరుస్తున్నాడు.

ఈ శ్రీమన్నారాయణుని నామస్మరణ ఎంతో గొప్పది. ఎవరి నామ స్మరణచే మహాపాపములన్ని ఒక్క క్షణంలోనే నశించునో, ఎవరి నామస్మరణచే మనస్సు, శరీరములు శుద్ధి చెందునో, ఎవరి నామ స్మరణ వలన కోటి యజ్ఞ సమాన ఫలము లభించునో అతడే శ్రీమన్నారాయణుడు. ఒక్కసారియైన ఎవ్వని మనస్సు ఈ శ్రీనివాసుని స్మరించునో అతనికి సమస్త సౌభాగ్యములు కలుగగలవు. ఎన్ని పాపాలు చేసినా, అన్నియు క్షణంలోనే నశించును.

శ్రీమన్నారాయణుడు సత్వగుణ ప్రధానుడు. ఈ సర్వసృష్టి ప్రారంభంలో శ్రీమన్నారాయణ స్వరూపము ఒక్కటే ఉన్నది. ఈ పరబ్రహ్మ స్వరూపం నుంచే బ్రహ్మాది దేవతలు, అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలు, అష్ట వసువులు, ఆదిగా గల సృష్టి మొత్తం ఆవిర్భవించింది. ఈ సమస్త విశ్వానికి మూల పురుషుడు అతడే. అతడే శ్రీ వేంకటేశ్వరుడు. అతడే వేంకటా చలపతి. అతడు త్రికాలాతీతుడు. అతడు నిత్యుడు. బ్రహ్మము అతడే. సర్వేంద్రియాలు, సర్వ దిశలు, సర్వ దేవతలు అతడే. సర్వ గాయత్రులు, సర్వ చంథస్సులు కూడా అతడే. చతుర్వేదాలు అతడే. ప్రణవ రూపం అతడే. అతడే జ్యేష్ఠుడు. అతడే శ్రేష్ఠుడు. అంతటి మహోన్నత పరబ్రహ్మ మూర్తియైన శ్రీ వేంకటేశ్వరునికి ఇవే మన నమస్కారాలు.

నాలుగు వేదాలకు కలిపి 108 ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో వైష్ణవ సంబంధమైన ఉపనిషత్తులు 14 ఉన్నాయి. అవే నారాయణోపనిషత్తు,



మహానారాయణోపనిషత్తు, నృసింహతాపిని ఉపనిషత్తు, రామరహస్యోపనిషత్తు, వాసుదేవోపనిషత్తు, అవ్యక్తోపనిషత్తు, తారసారోపనిషత్తు, గోపాలతాపిని ఉపనిషత్తు, కృష్ణోపనిషత్తు, హయగ్రీవోపనిషత్తు, దత్తాత్రేయోపనిషత్తు, గరుడోపనిషత్తు, కలి సంతరణోపనిషత్తు. ఈ ఉపనిషత్తులన్నీ ప్రతిపాదించినది ఆ పరబ్రహ్మ స్వరూపాన్నే. ఈ సృష్టి ప్రారంభంలో సర్వేశ్వరుడైన ఆ శ్రీమన్నారాయణుడు ఒక్కడే ఉన్నాడు. అతడే ఆత్మ. ఆ ఆత్మయే పంచ భూతాలను సృష్టించింది. ఇంద్రియాలను, ఇంద్రాది దేవతలను సృష్టించింది ఆ శ్రీమన్నారాయణుడే.

ఈ జగత్తులో పిపీలికాది బ్రహ్మ పర్యంతము, నేల, నీరు, ఆకాశము, నదులు, సముద్రాలు, కొండలు, లోయలు, ఎడారులు, క్రిమి కీటకాలు, పశువులు, పక్షులు, సర్వ జంతు జాలము, మానవులు... ఇలా ఒక్కటేమిటి సర్వం పరబ్రహ్మమయమే, అదే శ్రీమన్నారాయణుడు, అదే శ్రీ వేంకటేశ్వరుడు. ఆ స్వామిని వీటన్నిటిలోను దర్శించిన వారికి మరు జన్మ ఉండదు. సర్వ సంపదలు, సర్వ సౌభాగ్యాలు లభిస్తాయి. జీవితాంతం సుఖప్రదంగా జీవించి చివరన ముక్తిని పొందుతారు.

ఈ సృష్టి మొత్తంలో కేవలం మానవునికి మాత్రమే యుక్తాయుక్త విచక్షణా జ్ఞానమున్నది. పాప పుణ్యాలను గ్రహించగలిగే శక్తి యున్నది. కాబట్టి ఎల్లప్పుడూ ఆ శ్రీమన్నారాయణుని మీదే మనస్సు లగ్నం చేయాలి. సర్వకాల సర్వావస్థలయందు ఆ హరినే స్మరించే వారి దగ్గరకు మృత్యువు దరి చేరదు.

బృహదారణ్యోపనిషత్తులో ఒక సందర్భంలో ఉద్దాలకుడు యాజ్ఞవల్కునితో 'యాజ్ఞవల్కా', అంతర్యామి యొక్క స్వరూపం వివరించ వలసినది అని కోరాడు. అప్పుడు యాజ్ఞవల్కుడు ఈవిధంగా సమాధానం చెబుతున్నాడు. అంతర్యామి నీటిలో నివసించేవాడు, కాని నీరు అతన్ని ఎరుగదు. ఆ నీరే అతని శరీరము. అలాగే అగ్నిలో ఉంటాడు. కానీ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అగ్ని అతనిని ఎరుగదు, అగ్నిలో ఉంటూ అగ్నిని నియంత్రించేది అతడే. ఆ పరమపురుషుడు అంతరిక్షంలో ఉంటాడు, అంతరిక్షం అతన్ని ఎరుగదు, అతని శరీరమే అంతరిక్షం, అంతరిక్షంలో ఉంటూ అంతరిక్షాన్నే నియంత్రిస్తాడు.

వాయువులో ఉండి వాయువును నియంత్రిస్తాడు, కానీ వాయువు అతనిని ఎరుగదు. అందరిలో ఉండే ఆత్మయే అంతర్యామి. దిక్కులకు అతనెవరో తెలియదు, కానీ దిగాంతరాళాల్లో ఉంటూ దిక్కులను శాసిస్తాడు. అతడే అంతర్యామి అయిన ఆత్మ. ఆకాశమే ఆ మహాపురుషుని శరీరము, ఆకాశంలో ఉంటూ ఆకాశాన్ని శాసిస్తాడు.

ఎవడు భూమిపైన, భూమిలోపల ఉంటాడో, తనలో ఉన్నప్పటికీ, ఎవనిని భూమి ఎరుగదో, ఎవని శరీరమే భూమియో అతడే ఆత్మ, అతడే అంతర్యామి. మానవుల శరీరాన్ని, అవయవాలను నియంత్రించేది లోపల ఉన్న ఆత్మయే. జగత్తులోపల ఉంటూనే జగత్తును నియంత్రించేది అంతర్యామియే అని యాజ్ఞవల్క్యుడు వివరించాడు.

ఆ అంతర్యామి పరబ్రహ్మస్వరూపమే. అదే శ్రీమన్నారాయణుడు. అదే మన శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీ వేంకటాధీశుడు, శ్రీ వేంకట నాయకుడు.

*“ శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ”*



# ఓం మాధవాయ నమః

శ్రీమన్నారాయణుడే పరంజ్యోతి. అతడే పరమాత్మ, అతడే పరబ్రహ్మము. అతడే సచ్చిదానంద స్వరూపుడు, అతడే ఈ విశ్వానికంతటికీ మంగళకారుడు, అతడే మాధవుడు.

పరమేశ్వరునికి సంబంధమైన విద్య పరావిద్య, దీనినే ‘మా’ విద్య అని అంటారు. దీనికి స్వామియైన నారాయణుడు మాధవుడు అనబడుతున్నాడు.

బ్రహ్మాండపురాణంలో ఒక సందర్భంలో భృగుమహర్షి నారదులవారిని ఈవిధంగా ప్రశ్నిస్తున్నాడు. ‘ఓ నారద మునీంద్రా! శ్రీ వేంకటాద్రికి విజయం చేసిన తరువాత శ్రీమన్నారాయణులవారు ఏమి చేసెనో దయచేసి వివరముగా సెలవియ్యవలసినది. అప్పుడు నారద మహర్షి ఈవిధంగా చెబుతున్నారు. మహానుభావా! ఓ భృగూ, శ్రీమన్నారాయణుని పరమభక్తుడవైన నీవు ఈ భగవత్కథను వినుటకు మిక్కిలి అర్హుడవు,

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



భగవంతుడు అవతరించిన ప్రదేశము అతని అంతస్తుకి తగినదై వుండెను. ఆ ప్రదేశమునందు వివిధములగు ధాతువులు, నదులు, సెలయేళ్ళు, పుణ్య తీర్థములు, వివిధ రకములైన మహావృక్షములు, అద్భుతమైన పుష్ప వృక్షములు, ఏనుగులు, వానరులు, అనేక రకాలైన పక్షులు సంచరించుచు ఎంతో నయనానందకరముగా ఉండెను. అంతటి అద్భుత ప్రదేశమునందు శ్రీమన్నా రాయణులవారు పరమానందముతో విహరించుచుండెను. ఒకానొకప్పుడు చతుర్ముఖునిచేత పంపబడిన నారాయణుడను బ్రాహ్మణోత్తముడు ఈ పర్వతమునకు వచ్చి మహా మహిమాన్వితమైన శ్రీ స్వామి పుష్కరిణియందు స్నానమాచరించి ఇంద్రియ నిగ్రహం చేసుకుని యాగమునునుష్ఠించి భగవానుని ధ్యానించుచు తపస్సు చేసెను.

ఆ తపశ్శక్తి వలన ఆ ప్రదేశములో తిరుగాడే క్రూరమృగములన్ని సాధు స్వభావముతో ఉండెడివి. అంతట ఒకనాడు ఆ బ్రాహ్మణోత్తముని తపస్సుకు మెచ్చి భగవానుడు గరుత్మంతుని అధిరోహించి శ్రీమహాలక్ష్మీ సమేతముగా సాక్షాత్కరించెను. అద్భుతముగా ప్రకాశిస్తున్న బంగారు హారములతోను, అనేక కోట్ల విద్యుత్తులవలె ప్రకాశించుచు, పద్మహస్తము, పద్మ ప్రియము, పద్మాలయము అయిన శ్రీ భగవానుని ధర్మచారిణి అగు శ్రీ మహాలక్ష్మీదేవి ఆ బ్రాహ్మణునికి గోచరించెను. ఇంక ఆ శ్రీమన్నారాయణుని రూపము వర్ణించ తరమా? నల్లని మేఘము వంటి దేహ కాంతి తోడను, అత్యంత ప్రకాశమగు పీతాంబరముతోడను, శ్రీవత్స లక్షణమును, కౌస్తుభమణిని వక్షస్థలమున ధరించి, ఉదర బంధము బ్రహ్మను సృజియించిన గంభీరా వర్తమగు నాభికమలము, కదళీ స్థంభముల వంటి ఊరువులు, అద్భుతమైన ప్రసన్న వదనంతో దివ్య మంగళ రూపుడగు శ్రీమన్నారాయణుడు దర్శనమిచ్చెను.

అంతటి అద్భుత మూర్తిని చూసిన బ్రాహ్మణోత్తముడు ఎంతో ఆనందముతో శ్రీ స్వామి వారికి ప్రదక్షిణ నమస్కారములు చేసి ఏమి



మాట్లాడవలెనో కూడా తోచక ముహూర్త కాలము మౌనంగా ఉండిపోయెను. వెంటనే తేరుకుని శ్రీ స్వామివారితో ఈవిధంగా చెప్పసాగాడు. ఓ జగన్నాథా, దేవ దేవా, పురుషోత్తమా మీ శరణుజొచ్చిన నన్ను రక్షింపుము. నీవే సర్వలోకముల సృష్టి కర్తవు. నీవే పాలకుడవు, సంహారకుడవు కూడా. సమస్తమూ నీవే, నీకు వేరైన వస్తువు లేదు, సమస్త లోకములకు తండ్రివి, అట్లే శ్రీమహాలక్ష్మియే మా తల్లి. బ్రహ్మాది దేవతలు, సనక సనందాది మహామునులు కూడా నిన్ను పూర్తిగా తెలుసుకొనలేకపోయిరి. వేదాధ్యయనము, యజ్ఞము, తపస్సులు కూడా నిన్ను తెలుసుకొనుటకు సాధనములు కాజాలవు.

భక్తులకు నీవు అత్యంత సులభుడవు. నన్ను కరుణించి నీ ఆత్మ స్వరూపమును చూపవలసినది. ఓ శ్రీమన్నారాయణా! మీ దర్శనముచే నా జన్మ కృతార్థమైనది. నా నేత్రముల తపస్సు ఫలించినది. నిన్ను చూడని మానవజన్మ వ్యర్థము, నిన్ను దర్శించినంతటనే నా మనస్సు ఉన్మత్తావస్థను చెందినది అని స్తుతించగా శ్రీ భగవానుడు ఓ బ్రాహ్మణోత్తమా నీవేల ఇచ్చట తపస్సు చేయుచుంటివి? నీ తపస్సు సిద్ధించినది. నీకేమి వరము కావలెనో కోరుకొనుము అనెను.

అప్పుడు నారాయణుడను ఆ బ్రాహ్మణోత్తముడు ఓ దేవ దేవా నీ అనుగ్రహముచేత నా జన్మ ధన్యమైనది. నన్ను నారాయణుడందురు. నేను నీ దర్శనమునకై ఈ భూమండలము మొత్తము వెతికితిని. అనంతరము ఆ చతుర్ముఖ బ్రహ్మను గురించి తపస్సు చేసి ఆయన అనుగ్రహముచే శ్రీ స్వామి పుష్కరిణీ తీర్థ తీరమందు తపస్సు చేయుటయే మీ దర్శనమునకు మార్గమని తెలుసుకునిన వాడనై చాలా కాలమునుండి ఇచటనే తపస్సు ఆచరిస్తున్నవాడను. ఓ తండ్రీ, శ్రీమన్నారాయణా, నీ దర్శన భాగ్యము కోరు సామాన్య జనులు నావలె ఇంతటి ఘోర తపస్సునాచరించుట దుర్లభము. అందువలన వారినందరినీ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అనుగ్రహించుటకై నీవు ఇచటనే స్వామి పుష్కరిణీ తీర్థతీరమున శ్రీ మహాలక్ష్మితోడను, అనంత, గరుడ, విష్వక్సేన పరివారముతోడను ఇదే దివ్య మంగళ రూపముతో ఇచటనే నిరంతరముగా నివసింపవలసినది. మరియును నా తపస్సిద్ధికి జ్ఞాపకముగా ఈ పర్వత రాజము నా పేరుతో "నారాయణగిరి" అని వ్యవహరింపబడునట్లుగా అనుగ్రహింపుము అని వేడుకొనెను.

అంతట శ్రీమన్నారాయణులవారు అతనిని అనుగ్రహించి ఇప్పటినుండి ఈ పుణ్య పర్వతము "నారాయణాచలము" అని కూడా వ్యవహరింపగలదు. అని సెలవచ్చి ఆనంద నిలయ దివ్య విమానమున ప్రవేశించెను.

అప్పటినుండి శ్రీమన్నారాయణులవారు వేంకటాద్రిపై ఆనంద నిలయము నుండి మనలందరిని శ్రీనివాసుడు, శ్రీ వేంకటేశ్వరుడు, వేంకటాచలపతి, వేంకటరమణుడు, వేంకటనాథుడు, మొదలైన దివ్య నామములచేత పిలవబడుతు భక్తులందరిని అనుగ్రహిస్తున్నాడు.

కో అంటే పలికే కొండలరాయుడు ఈ వేంకటేశుడు. నమ్మినవారికి కొంగు బంగారం. శరణన్నవారికి ఆప్త బంధువు. ఆశ్రిత జన రక్షకుడు, ఎంతటి పాపాత్ముడినైనా ఒక్క పిలుపుతోనే అనుగ్రహించే అమృతహృదయుడు. భక్త సులభుడు ఈ వేంకటేశుడు.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీనివాసునిగా ఆవిర్భవించిన తిరుమలకు మించిన దివ్య ప్రదేశం ఈ భూమండలంలో వేరే లేనేలేదు. వయోభారంచేత కాని, అనారోగ్యంచేతకాని, తిరుమలను దర్శించలేనివారు, మనస్సులో ఒక్కసారి ఆ పేరు తలచినా చాలు, సర్వ పాపాలూ హరిస్తాయి, సర్వ రోగాలూ నశిస్తాయి. సర్వ భాగ్యాలకూ, సర్వ ఐశ్వర్యాలకూ, ఇంతకు మించిన మంత్రం లేదు, సర్వాంతర్యామి అయిన ఆ శ్రీనివాసుని దివ్య ధామమైన వేంకటాద్రిని ఒక్కసారి తలిస్తే సర్వ సంపదలు కలుగుతాయి.



ఈ జగత్తంతా వ్యాపించినవాడు ఆ శ్రీనివాసుడు, అతడు త్రికాలములయందు ఉన్నాడు. త్రికాలాతీతుడు కూడా.

ఓ శ్రీనివాసా భక్తసులభుడవైన నీవు మా వెంట నుండగా మాకిక భయ మేలనయ్యా, నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం గోవిందాయ నమః

గోవింద అంటే స్తుతించబడినవాడు అని అర్థము. ఈ జగత్తులో శ్రీమన్నారాయణుని కంటే స్తుతించదగినవాడు ఎవరుంటారు? అందుకే ముక్కోటి దేవతలు, సమస్త ప్రాణికోటి ఆ పరబ్రహ్మమూర్తినే ఎల్లవేళలా కీర్తిస్తూ ఉంటారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలూ అన్నీ కూడా ఈ స్వామిని స్తుతిస్తే కలిగే దివ్యానుభూతుల్ని, దివ్య భోగ భాగ్యాలను సర్వ జ్ఞానాలను, సర్వ ఐశ్వర్యాలను వివరిస్తున్నాయి.

తిరుమల కొండలలో ఈ గోవిందనామమే నిత్యమూ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. వేంకటాచల వాసుని దివ్య దర్శనం కోసం వచ్చే భక్తుల గోవింద నామ సంకీర్తనలతో తిరుమల కొండలన్నీ మారుమ్రోగుతున్నాయి. తండ్రీ వేంకటేశ్వరా త్వరగా మమ్మాదరించి దర్శనమీయవయ్యా!

మహోపనిషత్తులో శ్రీమన్నారాయణుని గురించి ఈ విధంగా చెప్పబడినది. ఈ సృష్టికి ముందు పరబ్రహ్మ తత్వము ఒక్కటే వున్నది.



బ్రహ్మ, రుద్రులు లేరు, నీరు లేదు, వాయువు లేదు, అగ్ని లేదు, భూమ్యాకాశాలు లేవు, నక్షత్రాలు లేవు, సూర్యచంద్రులు కూడా లేరు, అప్పుడు ఉన్నది పరమేశ్వరుడొక్కడే. అప్పుడు ఆ పరబ్రహ్మమూర్తి 'స్తోమము' అనే మహా యజ్ఞంతో ఈ సృష్టిని చేశాడు. అప్పుడు ఆ పరమపురుషుని నుండి పధ్నాలుగు మంది పురుషులు, ఒక కన్య జన్మించారు. అలాగే పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ తన్మాత్రలు, పంచ భూతాలు, మనస్సు, అహంకారము, ప్రాణము, దేహము, బుద్ధి, కలిసిన ఇరవై అయిదు తత్వాలతో కూడిన విరాట్పురుషుడు జన్మించాడు. అతని నుండి కాలస్వరూపంలో సంవత్సరాలు ఆవిర్భవించాయి.

అప్పుడు శ్రీమన్నారాయణుడు మరొక సంకల్పంతో ధ్యానం చేశాడు. అప్పుడు ఆ పరమపురుషుని లలాటము నుండి రుద్రుడు జన్మించాడు. అతడు అత్యంత తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. అటు పిమ్మట నారాయణుడు ఇంకొక సంకల్పంతో ధ్యానం చేశాడు. ఈ సారి లలాటము నుండి స్వేదము పుట్టింది. ఆ స్వేదమే జలంగా మారి సర్వత్రా వ్యాపించింది. ఆ జలం నుండి బంగారు కాంతితో ఒక అండము, అందు నుండి చతుర్ముఖ బ్రహ్మ జన్మించాడు. అప్పుడు ఆ చతుర్ముఖ బ్రహ్మ నాలుగు దిక్కులూ తిరిగి ధ్యానించగా అద్భుత తేజస్సుతో నాలుగు వేదాలు ఉద్భవించాయి. బ్రహ్మ మరలా ధ్యానం చేసి క్షీర సముద్రంలో ఒక మహాపురుషుని దర్శించాడు. ఆ మహాపురుషుడు వేయి శిరస్సులతో అనేక బాహువులతో అనంతమైన రూపంతో విశ్వమంతా వ్యాపించి ప్రకాశిస్తున్నాడు. అతడే విష్ణువు, అతడే పరబ్రహ్మము, ఆ శ్రీమన్నారాయణుడే విశ్వపతి, విశ్వేశ్వరుడు, విశ్వాత్మకుడు, విశ్వ రక్షకుడు, విశ్వ పూజ్యుడు. అతడే బ్రహ్మ, అతడే రుద్రుడు, అతడే ఇంద్రుడు, అతడే పరబ్రహ్మ స్వరూపము. ఇన్ని రూపాలతో పరమేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు పూర్ణ పురుషుడు. పురుషోత్తముడు.

ఇంతటి అద్భుత మూర్తి ఈ భూలోకంలో వేంకటాద్రియందు

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



వేంకటేశ్వరునిగా ఆవిర్భవించుటచేత తిరుమల కేవలం నామం తలచినంతనే సర్వ పాపములు తొలగిపోగల అద్భుత పుణ్య ప్రదేశమై విరాజిల్లుతున్నది.

ఓ శ్రీ వేంకటేశ్వరా నీ పాద పద్మముల మహిమ ఎంతని వర్ణించగలము? ఎల్లప్పుడూ నీకు శయ్యగా ఉండే భాగ్యము కలిగిన ఆ ఆదిశేషుడు ఎంతటి అదృష్టవంతుడో కదా, వేయి శిరస్సులు గల ఆ ఆదిశేషుడు తన రెండు వేల కన్నులతో నీ పాద దర్శన భాగ్యమును అమితముగా పొందుతున్నాడు. అతని అదృష్టమెంతని వర్ణించెదము. రెండు కన్నులతో దర్శిస్తున్న నాకే ఇంత ఆనందముగా నున్నది. ఇక రెండువేల కన్నుల ఆ ఆదిశేషుని ఆనందము వర్ణనాతీతము కదా! ఆహా అతని అదృష్టమెంతటిది?

ఆ బ్రహ్మ కడిగిన పాద దర్శనమును సహస్ర నేత్రాలతో వీక్షించినవాడై దేవేంద్రుడు అమితానందమునకు లోనవుతున్నాడు. ఆ చతుర్ముఖ బ్రహ్మ తన నాలుగు ముఖములయొక్క ఎనిమిది కనులచే నీ పాద పద్మములను గాంచి ఆనందముతో మాటలే లేనివాడాయెను. ఆ త్రిలోక సుందరియైన శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ, భూ, నీలాంశలతో ఎల్లప్పుడూ నీ పాదాలనే దర్శిస్తూ ఎంతటి ఆనందమునకు లోనవుతున్నదో కదా.

తండ్రీ కేవలము నీ పాద పద్మములను మనస్సున తలచినంతనే సర్వ పాపములును తొలగిపోవును, సర్వ భాగ్యములును కలుగును, ఎల్లవేళల యందు నీ పాద పద్మములే నా మనస్సులో స్థిరముగా నుండునటుల అనుగ్రహించు తండ్రీ ! శ్రీమన్నారాయణా !

ఓ వేంకటేశ్వరా ! పురుషోత్తముడవు, సర్వేశ్వరుడవు అయిన నీకు ఇవే నా నమస్కారములు.

*“ శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ”*



# ఓం విష్ణవే నమః

విష్ణువు అంటే సర్వ వ్యాపకుడు అని అర్థం. విశ్వమంతా ఆవరించినవాడు విష్ణువు, అతడే సర్వజ్ఞుడు. అతడే సర్వశక్తి. అతడే సర్వ స్వరూపుడు. అతడే సర్వాధారుడు. సర్వకారణభూతుడు. సర్వ ప్రాణి రూపుడు, సర్వ ఆగముల సారము అతడే. అతడే శ్రీ వేంకటేశ్వరునిగా తిరుమల కొండపై అవతరించాడు.

పూర్వకాలంలో పవిత్ర గోదావరీ తీరంలో నారాయణ శర్మ అనే పేద బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడు అధిక సంతానం కలవాడై మిక్కిలి పేదరికంతో బాధ పడుతుండేవాడు. అయినా ఎల్లప్పుడూ హరినామ స్మరణ కావించేవాడు. ఒకరోజు ఆ గ్రామానికి వచ్చిన ఒక సాధువును నారాయణ శర్మ కలిసి తన గోడు విన్నవించుకున్నాడు. అప్పుడు ఆ సాధువు కనికరించి, నాయనా వేంకటాద్రిపై వెలసిన స్వామిని దర్శిస్తే అన్ని బాధలూ తొలగి సర్వ సౌభాగ్యాలూ కలగగలవని చెప్పాడు. ఇది

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అద్భుత మహామంత్రమని నారాయణ శర్మకు తోచింది. ఇంత పేదరికంతో ఎప్పుడు వెళ్ళి ఆ స్వామిని దర్శించగలనా అని బాధ పడ్డాడు. ఎలాగైనా ఆ వేంకటాద్రి నాధుని దర్శించవలసిందేనని ఇంట్లో తన భార్యకు చెప్పి యాత్రకు బయలుదేరాడు. దయామయుడైన ఆ శ్రీనివాసుని దయవలన నారాయణ శర్మకు కొద్ది పైకము కూడా దొరికినది.

కాలినడకన తిరుమలయాత్రకు బయలుదేరాడు నారాయణ శర్మ. దారి మధ్యంతా కీకారణ్యాలు. రాత్రి కాగానే ఏదైనా చెట్టుకిందగాని, సమీప గ్రామంలో గాని విశ్రమించేవాడు. ఎల్లవేళలా హరినామ స్మరణం చేస్తుండటం చేత ఏ క్రూర మృగాలు, నారాయణ శర్మ దరిదాపులకు కూడా వచ్చేడివి కావు. ఆ స్వామి అంతటి దయామయుడు, ఎవరైతే పూర్తి భారాన్ని తనపై వదిలి ఎల్లవేళలా తననే స్మరిస్తూ వుంటారో, వారి పూర్తి బాధ్యత తానే వహిస్తాడు.

నారాయణ శర్మకి ఎప్పుడెప్పుడు వేంకటాద్రి చేరుతానా, ఆ స్వామిని దివ్యరూపం దర్శిస్తానా అని మనసు తహ తహలాడుతోంది. ఆ విధంగా దాదాపు నెల రోజుల ప్రయాణం తరువాత వేంకటాద్రి చేరుకున్నాడు. ఆహా ! ఏమి ఈ అద్భుత గిరులు, ఎంత రమణీయంగా ఉన్నాయి అనుకుంటూ తిరుమల చేరి స్వామి పుష్కరిణిలో స్నానం చేసి వరాహ స్వామిని దర్శించి శ్రీవారి ఆనంద నిలయంలో ప్రవేశించాడు. ఆ స్వామి అద్భుత మూర్తిని చూసిన నారాయణ శర్మ ఆనందానికి అవధులు లేవు. ఆ సర్వ మంగళ మనోహర రూపాన్ని చూసిన నారాయణ శర్మ నోట మాట లేదు. స్వామిని పరి పరి విధాల స్తుతించి ఆలయం బయటకు వచ్చి ప్రక్కనే వున్న చింతచెట్టు కింద విశ్రమించాడు. చుట్టూ ప్రకృతి ఎంతో అద్భుతంగా వున్నది. చెట్లపై పక్షుల కిల కిలా రావాలు, నెమళ్ళ నృత్యాలు, తూనీగల జోరు, నారాయణ శర్మకు ఎంతో అద్భుతంగా కనిపించింది భూలోక వైకుంఠమైన ఈ వేంకటాద్రి. ఇంతలో ఒక్కసారిగా



నారాయణ శర్మకు కంటి ఎదురూ ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఏమిటా వెలుగని తేరుకునేటంతలో ఆ వెలుగులో దివ్య తేజస్సుతో శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. స్వామిని చూసిన నారాయణ శర్మకు నోట మాట రాలేదు. తండ్రీ! శ్రీమన్నారాయణా! నీకిదే నా ప్రణామములు. నీ దర్శనభాగ్యంచే నా జీవితం ధన్యమైనది. ఎంతో ఘోర తపస్సులకు కూడా అందని నీ అద్భుత దర్శనం నాకు అనుగ్రహించావు తండ్రీ అంటూ ఆ స్వామిని పరిపరి విధాల కీర్తించాడు.

అప్పుడు కరుణామయయముడైన ఆ స్వామి'' ఓ ద్విజోత్తమా, అచంచలమైన నీ భక్తికి సంతోషించాను, నీకు సర్వ ఐశ్వర్యాలను అనుగ్రహిస్తున్నాను. ఈ క్షణం నుంచి నీకు సర్వ సౌభాగ్యాలూ సమకూరుతాయి. ఈ తిరుమల కొండ నాకు ఈ భూమండలంపై అత్యంత ప్రీతికర ప్రదేశము. ఎవరైతే నన్నే స్మరిస్తూ పాపరహిత జీవితం కొనసాగిస్తుంటారో వారికి నా దర్శనం అతి సులభం. ఈ వేంకటాద్రిపై కాలు పెట్టిన తక్షణమే వారి పాపాలన్నీ తొలగిపోతాయి... ఓ బ్రాహ్మణోత్తమా నీ భక్తికి మెచ్చి నీకు దివ్య దృష్టి అనుగ్రహిస్తున్నాను. ఈ తిరుమల నిజరూపాన్ని నువ్వు చూడగలుగుతావు. ఈ దివ్య దృష్టి నీకు ఒక ఘడియ కాలం మాత్రమే ఉంటుంది. ఆ తరువాత నీవు ఈ ఘడియ కాలం పూర్తికాగానే నీ ఇంటిలో ఉండునట్లుగా అనుగ్రహిస్తున్నాను, నీ ఇల్లంతా బంగారు మయంగా ఉంటుంది అని సెలవిచ్చి భక్తవత్సలుడైన శ్రీమన్నారాయాణుడు అంతర్ధానమైనాడు.

దివ్య దృష్టి లభించిన నారాయణ శర్మ కంటికి అన్నీ అద్భుతాలే కనిపిస్తున్నాయి, తిరుమల కొండ ఎంతో దివ్యంగా అత్యంత తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఇప్పటిదాకా తన చుట్టూ కనబడిన వృక్షాలన్నీ మాయమైనాయి. వాటి స్థానంలో తపస్సు చేసుకుంటున్న మహామునులు కనిపిస్తున్నారు... అంటే సామాన్య దృష్టితో వున్నప్పుడే కేవలం వృక్షాల్లాగా

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



కనిపించినది ఈ మహామునులే నన్నమాట. ఆకాశంలో సర్వ దేవతలూ కనిపిస్తున్నారు. ఆనంద నిలయం ఉన్న ప్రదేశంలో దివ్య రూపంతో వేయి కన్నులతో, వేయి శిరస్సులతో, వేయి చేతులతో ఆకాశం వరకూ వ్యాపించి వున్న శ్రీమన్నారాయణుడు దర్శనమిస్తున్నాడు. నారాయణ శర్మ ఆనందానికి అంతు లేదు.

తిరుమల నిజరూపం ఇంతటి అద్భుతమైనదా అని అమిత ఆశ్చర్యంలో ఉన్నాడు... ఆ ప్రదేశం అంతా ఓంకారం ప్రతిధ్వనిస్తోంది. ఒక్కసారి ప్రదక్షిణ నమస్కారం చేద్దామనే తలంపుతో తిరిగిన నారాయణ శర్మకు అన్ని దిక్కులా ఆ స్వామే కనిపిస్తున్నాడు. అన్ని దిక్కుల నుంచి ఓంకారం స్పష్టంగా వినిపిస్తున్నది. శరీరం తేలిపోతున్నట్లుంది. ఎక్కడినుంచో దివ్య సుగంధ వాసనలు వస్తున్నాయి. చల్లటి చిరుగాలి వీస్తోంది, ఇలా అద్భుత ఆశ్చర్యాలకు లోనైనంతలోనే ఘడియ కాలం పూర్తయినది. కళ్ళు తెరిచే సరికి తన ఇంట్లో ఉన్నాడు... ఇల్లంతా స్వర్ణమయంగా కనపడింది... ఇదంతా శ్రీనివాసుని కరుణే కదా అని తలచి ఆ స్వామిని పరిపరి విధాల మనస్సులో ప్రార్థిస్థూ జరిగిన విశేషాలన్నీ తన భార్యకూ, పిల్లలకూ వివరించాడు. వివరంగా వర్ణించాడు. త్వరిత కాలంలోనే నారాయణ శర్మ పిల్లలందరూ వివాహాలు జరిగి శుభప్రదంగా శేషజీవితం వెళ్ళబుచ్చాడు.

శ్రీమన్నారాయణుడు భక్త సులభుడు. వేంకటాద్రి అద్భుత మహిమగల పర్వతం. సాక్షాత్తూ ఆదిశేషుడే వేంకటాద్రి. ఎవరైతే ఒక్కరాత్రైనా ఈ పవిత్ర వేంకటాద్రిపై ఆ స్వామినే స్మరిస్తూ గడుపుతారో వారికి సకల బాధలూ తొలగి సర్వ సౌభాగ్యాలూ లభిస్తాయి.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*



# ఓం మధుసూదనాయ నమః

ఈ పవిత్ర తిరుమలలో శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన శ్రీమన్నారాయణా, నీకు జయమగుగాక. నీకివే మా నమస్కారములు. మా సర్వస్వమూ నీవే తండ్రీ! నీవే నిత్యుడవు, నీవే విశ్వేశ్వరుడవు, నీవే విశ్వాత్మకుడవు. నీవే విశ్వ పరాయణుడవు.

మధువు అనే రాక్షసుని సంహరించిన శ్రీమన్నారాయణుడు మాధవుడు అనబడుతున్నాడు, అతడే శ్రీనివాసుడు, శ్రీ వేంకటాచలపతి, శ్రీ వేంకటాధీశుడు.

ఓ స్వామీ! నిన్ను యింద్రియములతోడగాని, శాస్త్ర పాండిత్యము వలన గానీ తెలుసుకొనలేము, ఏ ప్రమాణమునకు అందని వాడవు నీవే. ఓ శ్రీనివాసా! సమస్త జీవరాశుల ఇంద్రియ నియంత్రకునివి నీవే. ఊర్ధ్వ, అధో, మధ్య అనబడే మూడు దిక్కులకూ ఆశ్రయమైనవాడివి నీవే. కేవలం నీ నామ స్మరణచేతనే సర్వ పాపాలు నశిస్తాయి.

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



ఆనందము, తృప్తి, దుఃఖ రాహిత్యము, సౌలభ్యము, క్షేమము, స్వర్గము, ఇవన్నీ నీ నామ స్మరణ వలననే తప్ప, మరే యజ్ఞ యాగాదుల వలననూ సాధ్యము కావు. భక్త సులభుడవు నీవే.

అందరి యోగక్షేమాలు వహించేది ఆ శ్రీమన్నారాయణుడే. సోమకాసురుడు వేదాలను దొంగలించి, సముద్రంలో దాక్కున్నప్పుడు మత్స్యావతారమెత్తి వానిని సంహరించి వేదాలను రక్షించాడు. క్షీరసాగర మధనం సమయంలో కూర్మావతారమెత్తి మందర పర్వతం మునిగిపోకుండా కాపాడాడు. నరసింహావతారమెత్తి హిరణ్యకశిపుని సంహరించాడు. వామనావతారమెత్తి బలిచక్రవర్తిని పాతాళానికి పంపినాడు. ఇలా అనేక అవతారాలెత్తి దేవతలను, సాధు సజ్జనులను సర్వ వేళలా రక్షిస్తున్నది శ్రీమన్నారాయణుడే. ఈ కలియుగంలో మానవుల బాధలను తొలగించడానికి వేంకటాద్రిపై శ్రీనివాసునిగా వెలసిన పరబ్రహ్మమూర్తి ఇతడే.

శ్రీమన్నారాయణుడు అత్యంత తేజోమూర్తి. అంతటి దివ్య ప్రకాశమూర్తి నివసిస్తున్నందువలననే వేంకటాద్రి అత్యంత తేజోమయంగా కనిపిస్తుంది. వేంకటాద్రిపై ఉన్నంతకాలము భక్తుల మనసులు ఏదో తెలియని ఆనందంతో నిండి ఉంటాయి.

కొన్నివేల కోట్ల సూర్యులయొక్క కాంతితో శ్రీమన్నారాయాణుడు ప్రకాశిస్తుంటాడు. ఈ ప్రచండ కిరణాల నుండి అగ్ని దేవుడు 108, సూర్య భగవానుడు 116, చంద్రుడు 132 కిరణాలను మాత్రమే గ్రహించగలిగారు. ఈ కిరణములచేతనే ఈ జగత్తంతా ప్రకాశిస్తున్నది. సర్వ ప్రాణులకు జీవశక్తి, అత్యంత తేజోమయమైన ఈ కిరణాల వలననే కలుగుతున్నది. పగటియందు సూర్యకాంతిచేతను, రాత్రియందు చంద్రకాంతిచేతను, సంధ్యవేళలయందు అగ్నియొక్క కాంతుల చేతను ఈ విశ్వమంతా ప్రకాశిస్తున్నది.



ఒకసారి యాజ్ఞవల్కుడు విదేహ దేశాధిపతి అయిన జనక మహారాజు వద్దకు వచ్చాడు, గురువు రాకకు ఆ మహారాజు ఎంతో సంతోషపడి, ఎన్నో సత్కారాలు కావించాడు, అనేక నమస్కారాలు చేశాడు. కాస్త విశ్రమించిన తరువాత జనకుడు యాజ్ఞవల్కునితో గురుదేవా! మీరు అత్యంత విజ్ఞావంతులు. సర్వమూ తెలిసినవారు. ఎంతో కాలముగా నాకొక సందేహము కలదు. నా యందు దయవుంచి ఈ సందేహమును తీర్చవలసింది అని వినయంగా వేడుకున్నాడు.

యాజ్ఞవల్కుడు అందుకు సంతోషించి తప్పక చెప్పమని అన్నాడు. అప్పుడు జనకుడు "స్వామీ ఈ లోకంలో జీవులందరూ ఏ వెలుగుచేత తమ నిత్య కర్మలు కొనసాగిస్తున్నారు అన్నాడు. అప్పుడు యాజ్ఞవల్కుడు సూర్యుని వెలుగు వలనే ఈ జగత్తంతా సాగుతున్నది అని అంటాడు". గురుదేవా, మరి రాత్రివేళ ఈ సూర్యుడు ఉండడు కదా, అప్పటి పరిస్థితి ఏమిటి అన్నాడు. అందుకు యాజ్ఞవల్కుడు, నాయనా రాత్రి చంద్రుని కాంతితో ఈ పనులన్నీ జరుగుతాయి అంటాడు. "మహర్షీ! మరి సూర్యచంద్రులిద్దరూ లేనప్పటి పరిస్థితి ఏమిటీ?' అన్నాడు జనకుడు. 'నాయనా సూర్యచంద్రులిద్దరూ లేనప్పుడు అగ్ని దేవుని వలన, అంటే దీపపు కాంతివలన సమస్త జీవకోటి తనకర్మలను ఆచరిస్తున్నది' అన్నాడు యాజ్ఞవల్కుడు.

జనకుడు ఈ సమాధానాలను విని మిక్కిలి సంతోషించి, గురువర్యా! సూర్యచంద్రులు, అగ్ని ఈ ముగ్గురూ లేనప్పుడు వెలుగు ఎక్కడనుంచీ వస్తుంది అన్నాడు. అప్పుడు యాజ్ఞవల్కుడు', మంచి ప్రశ్న వేశావు మహారాజా! ఈ ముగ్గురూ లేని సమయంలో వాని స్థానంలో వాక్కు సహకరిస్తుంది. చీకటిలో మనం ధ్వనిని బట్టి ఏ దిక్కు నుంచి ఏమి రానున్నదో గ్రహిస్తాము కదా! శబ్దం సహాయంతో మానవుడు తన కర్మలను చేసుకోగలుగుతాడు అంటాడు, అప్పుడు జనకమహారాజు ఓ మహానుభావా!

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



మరి ఈ వాక్కు కూడా లేనట్లయితే ఏ వెలుగు మనల్ని నడిపిస్తుంది అని అడిగాడు.

అప్పుడు యాజ్ఞవల్కుడు నాయనా! ఓ జనకమహారాజా ఈ వెలుగులన్నింటికీ ఆవల వైపున ఆత్మ జ్యోతి వున్నది. అది స్వయంప్రకాశం, ఈ సర్వ జగత్తూ కూడా ఆ తేజస్సు వలననే ప్రకాశిస్తున్నది. సర్వ ప్రాణకోటి మనుగడకు ఆధారం ఈ ఆత్మజ్యోతియే. అదే పరమేశ్వరుడు, అదే శ్రీమన్నారాయణుడు, దివ్య కాంతులతో ప్రకాశించే ఆ మహా జ్యోతియే శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీనివాసుడు. ఈ దివ్య జ్ఞానజ్యోతిని ఎంతో సాధనతో మాత్రమే గ్రహించగలము. సామాన్యులకు ఇది ఎంత మాత్రము సాధ్యము కాదు. ఈ జ్యోతిని దర్శించినవారికి బ్రహ్మానందము, అనిర్వచనీయమైన అద్భుత అనుభూతులు కలుగుతాయి.

అందుకే శ్రీ వేంకటేశ్వరుని దర్శించినవారి ఆనందానికి హద్దు లేదు. వేంకట తత్వము అద్భుతమై ప్రకాశిస్తున్నది. అమితానందకరమై వెలుగుతున్నది. ఏ స్వామిని తలచినదే తడవుగా శరీరమంతా ఆనందంతో ఉప్పొంగుతుందో అతడే శ్రీనివాసుడు. ఈ సృష్టిలోని సర్వ రూపాలు ఆయనవే. త్రిమూర్తులయందు ఉన్నది అతడే. సమస్త మునులయందు ఉన్నది కూడా అతడే. మనం ఏ దేవతను పూజించినా, ఆ పూజలు చేరేది ఆ పరబ్రహ్మ మూర్తికే.

ఒకే కాంతిరేఖనుండి వెలువడే వెన్నెల, వేడి, వేరు వేరు గుణాలను వెల్లడించినట్టే వేంకట తత్వం అనేక రూపాలతో, అనేక గుణాలతో భాసిస్తున్నది.

కాల పురుషుడైన ఆ శ్రీమన్నారాయణుని అడుగుల్లో యుగాలు, యుగాంతరాలు ఒదిగి ఉంటాయి. అతడు మనకంటికి కనపడడు, కానీ మన చుట్టూ ఉండే ప్రతీ జీవరాశిలోను, ప్రతీ సంఘటనలోను అతని ఉనికి కనిపిస్తుంది.



అన్ని విషయాలు తెలిసినవాడు, అందరూ తెలుసుకొనదగినవాడు, కేవలం తన దర్శనంచేతనే సర్వ దర్శన సారాన్ని అందించగలిగే పరబ్రహ్మ మూర్తి ఆ శ్రీ వేంకటేశ్వరుడు. స్వామీ నీవుండ మాకింక భయమేల? నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం త్రివిక్రమాయ నమః

త్రికాలములయందు, త్రిమూర్తులయందు, త్రిలోకములయందు వ్యాపించి యున్నది పరబ్రహ్మమూర్తి శ్రీమన్నారాయణుడే. అందుకనే శ్రీమన్నారాయణుడు త్రివిక్రముడు అనబడుచున్నాడు, సర్వకాల సర్వావస్థలయందు ఉన్నది అతడే. అతని సంకల్పమే ఒక క్రతువు, అతడి చేష్టలే మహా యజ్ఞాలు. అంతటి అమృతమూర్తిని ప్రసన్నం చేసుకొనడానికి భక్తి తప్ప సులభమైన మార్గం వేరొకటి లేదు.

శ్రీమన్నారాయణుడు ఎక్కడ వుంటాడు అనే ప్రశ్న అవసరం లేదు, అతను లేని ప్రదేశం లేదు. సకల భూతాలలో, సమస్త జీవకోటిలో, సమస్త ప్రాణికోటి హృదయాంతరాలలో ఉన్నది ఆ శక్తి స్వరూపమే. అతడే శ్రీమన్నారాయణుడు, అతడే శ్రీ వేంకటేశ్వరుడు.

ఓ శ్రీనివాసా! నీవు యజ్ఞ స్వరూపుడవు. విశ్వ రూపుడవు. మంగళ



ప్రదుడవు. దివ్య మంగళ రూపుడవు. సమస్త జీవకోటిచే ఆరాధింపతగినవాడవు. అవ్యక్తుడవు నీవే, పరాత్పరుడవు నీవే, పురుషోత్తముడవు, ప్రణవ స్వరూపుడవు అయిన నీకిదే మా నమస్కారములు.

వేంకటాద్రిపై ఉన్న శ్రీ వేంకటేశ్వరుడు అమృతమూర్తి. వైకుంఠంలోని కోటి సూర్య ప్రకాశవంతమైన దివ్య తేజస్సు, భువికి దిగి వచ్చి ఈ వేంకటాద్రిపై ఆనందనిలయంలో కొలువుండటంచేత ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో బ్రహ్మాది దేవతలందరూ వచ్చి స్వామిని దర్శించుకుంటారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని గర్భాలయమే ఆనంద నిలయము. సమస్త భక్త కోటికి అమిత ఆనందాన్ని, అద్భుత అనుభూతుల్ని కలిగిస్తున్న ఆ స్వామిని ఒక్కసారి దర్శించండి! ఆహా! ఎంతటి రమణీయ రూపం! బంగారు పద్మ పీఠంపై ఠీవిగా వెలసిన ఆ దివ్య మంగళరూపుని చూడటానికి వేయి కనులున్నా చాలవు కదా. సహస్రనామ మాలలు, నందక ఖడ్గం, నడుమున వడ్డాణం... ఎంతటి మనోహర రూపం... ఈ సృష్టిలోని సర్వ అందాలూ ఆయనవే... బంగారు మొలతాడు... వజ్ర ఖచిత వరదహస్తం... తన పాదాలను వేడినవారికి ఎటువంటి ఆపదలు కలగవని చెప్తున్న వైకుంఠ హస్తం... తనను శరణువేడిన వారికి సంసారం మోకాలిలోతేనని అనుగ్రహిస్తున్న కటి హస్తం... బంగారు యజ్ఞోపవీతం... చేతులకు నాగాభరణాలు... శంఖ చక్రాలు... పవిత్ర సాలగ్రామ మాలలు... ఎంతటి అద్భుత దివ్య మనోహర రూపం ఆ శ్రీనివాసునిది !

మనసా, వాచా, కర్మణా ఆ స్వామినే సేవిస్తే మన భారం సర్వం ఆయనే వహిస్తాడు, వేంకటాద్రి ఆలయంలో శ్రీనివాసుడు 'ఏకమూర్తిగా' వెలిశాడు. మిగిలిన దైవమూర్తులన్నీ తరువాత చేర్చబడినవి. ఆనంద నిలయం మధ్యలో బ్రహ్మస్థానంలో శ్రీమన్నారాయణుడు చతుర్భుజాలతో, పై కుడిచేతిలో సుదర్శన చక్రాన్నీ, పై ఎడమ చేతిలో పాంచజన్య శంఖాన్నీ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



ధరించి, సమదృష్టితో తన దర్శనం కోసం వచ్చిన భక్తులందరినీ తన దివ్య మనోహర రూప దర్శనమిస్తూ అనుగ్రహిస్తున్నాడు.

ఆ స్వామిని ఒక్కసారి దర్శిస్తే చాలు, జన్మ ధన్యమవుతుంది. ఆ స్వామి భక్తవత్సలుడు. ఆశ్రిత పక్షపాతి. భక్తాధీనుడు ఈ శ్రీనివాసుడు, భక్తులంటే వల్లమాలిన ప్రేమ. ఎంత దూరం నుంచి పిలిచిన ఇట్లే పలికే అమృతమూర్తి. కొండంత అండ ఈ కొండలరాయుడు. వైకుంఠాన్నయినా విడిచి ఉంటాను గానీ, నన్ను ఆశ్రయించిన భక్తులను మాత్రం క్షణం కూడా విడువనంటాడు శ్రీనివాసుడు, అంతటి కరుణామూర్తి శ్రీనివాసుడు, తిరుమలేశుడు.

ఒకసారి శ్రీమద్రామానుజులవారు శ్రీరంగం నుంచి తిరుపతి వచ్చి సంవత్సరం పాటు నివసించారు. సాక్షాత్తూ శ్రీ స్వామివారిచే 'తాతా' అని పిలిపించుకున్న స్వామివారి ప్రియభక్తుడు తిరుమలనంబి రోజూ తిరుమలలో స్వామి కైంకర్యం పూర్తి కానిచ్చి కొండ దిగి వచ్చి శ్రీరామానుజులవారికి అలిపిరి వద్ద శ్రీమద్రాయణ రహస్యాలను ఉపదేశించారు. మళ్ళీ సాయంత్రానికల్లా తిరిగి కొండ ఎక్కి శ్రీ స్వామివారి సాయంత్రం నైవేద్యానికి చేరుకునేవారు, రోజూ ఇలా క్రిందకు దిగడం వలన మధ్యాహ్నపు వేళలో శ్రీనివాసునికి సేవ కుదురుట లేదని బాధ పడేవారు తిరుమలనంబి. ఈ పాఠ్యప్రవచనాల వలన మధ్యాహ్నపు నివేదన స్వామివారికి చేయలేకపోతున్నానని తన మనసులోనే బాధ పడేవారు. ఆ స్వామిని తన తప్పిదం మన్నించమని వేడుకునేవారు. భక్తులు బాధ పడితే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆదుకునే దయామయమూర్తి శ్రీనివాసుడు తిరుమలనంబి ఆవేదన గమనించాడు.

ఒక రోజు రాత్రి కలలో కనపడి ఓయీ తిరుమల నంబీ, నువ్వు నాకు అత్యంత ప్రియ భక్తుడవు, మధ్యాహ్నపు వేళ నన్ను సేవించుకోలేక పోతున్నందుకు విచారించవద్దు. నీ కోసం నేను అలిపిరిలో నీవుండేచోటనే



నా పాద దర్శన భాగ్యం కలిగిస్తాను, ఈ నాటి నుండి మధ్యాహ్నం కూడా నా పాద దర్శనం చేసుకొనవచ్చు అని సెలవిచ్చాడు. అంతట తిరుమలనంబి మరుసటి రోజు అత్యంత సంతోషంతో, రెట్టింపు ఉత్సాహంతో రామాయణ ప్రవచనాలు కావిస్తుండగా ఆ చెంతనే 'శ్రీవారి అద్భుత పాదాలు' ప్రత్యక్ష మయ్యాయి. అది చూసినవారందరూ స్వామి దయా హృదయానికి అత్యంత సంతోషపడి నమస్కారాలు కావించారు. ఆ దివ్య పాదాలే ఇప్పుడు మనం అలిపిరిలో కాలిబాటలో ముందుగా దర్శించే శ్రీవారి పాదాలు.

సమస్త వేదాలను పారాయణం చేయడం వలన ఎంతటి ఫలం వస్తుందో, అనేక అశ్వమేధాధి యజ్ఞాలన్నీ చేసిన ఫలం ఎంతటిదో, సహస్రకోటి బ్రాహ్మణ, అన్నదాన సంతర్పణ వలన ఎంతటి పుణ్యఫలం వస్తుందో అంతకుమించిన పుణ్య ఫలం కేవలం శ్రీనివాసుని దర్శనం మాత్రాన్నే లభిస్తుంది.

అంతటి అద్భుత పరబ్రహ్మమూర్తిని ప్రతీ మానవుడు తన జీవితంలో వీలున్నన్ని సార్లు దర్శించుకుని జీవితం ధన్యం చేసుకోవాలి.

" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం వామనాయ నమః

వేంకటాద్రిపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన శ్రీమన్నారాయణుని తేజస్సు అత్యంత శక్తివంతమైనది. సర్వ వ్యాపకమై, నాశరహితమై, సర్వకాల సర్వావస్థలయందు ఉన్నది ఈ తేజస్సే. అందువలననే తిరుమలలో ఉన్నంతకాలము మన శరీరములు అద్భుత, అనిర్వచనీయ ఆనందానికి లోనవుతుంటాయి. సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు ఈ పవిత్ర కొండపై వెలసి వుండుటచేత ఈ ప్రదేశమంతా దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నది.

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు గొప్ప విష్ణు భక్తుడు. అతని కుమారుడు విరోచనుడు, విరోచనుని కుమారుడు బలి చక్రవర్తి. బలి చక్రవర్తి వేద వేదాంగాలలో ఆరితేరినవాడు. అపారమైన పరాక్రమం కలవాడు, గొప్ప పాండిత్యం కలవాడు, అయితే జాతి వైరముచేత ఇంద్రుడిమీద యుద్ధం చేసి ఓడించాడు. అప్పుడు దేవతలందరూ



శ్రీమన్నారాయణుని చేరి తమను బలినుంచి రక్షింపవలసిందిగా ప్రార్థించారు.

అప్పుడు ఆ స్వామి వారికి అభయమిచ్చి భాద్రపద శుద్ధ ద్వాదశి శ్రవణా నక్షత్ర మొదటిపాదంలో అభిజిత్ ముహూర్తంలో అదితికశ్యపులకు వామనునిగా జన్మించారు. అదే శ్రీమన్నారాయణుని వామనావతారం.

పుట్టినవెంటనే వామనుడు బ్రహ్మచారిగా మారిపోయి నర్మదాతీరానికి బయలుదేరాడు. ఆ నదీ తీరంలోనే బలి చక్రవర్తి అశ్వమేధ యాగం చేస్తున్నాడు. అత్యంత తేజస్సుతో బాల భానుడిలాగా వెలిగిపోతూ వస్తున్న వామనుని చూసి యజ్ఞశాలలో ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు... ఎవరీ మహానుభావుడు? సాక్షాత్తూ అగ్ని దేవుడే కాదు కదా, అని తలచారు. అప్పుడు బలిచక్రవర్తి 'స్వామీ! మీరెవరో మహానుభావులలాగా ఉన్నారు, మీరాక వలన ఈ యజ్ఞశాల పరమపావనమైనది. మీకేమి కావాలో కోరుకొనండి. తప్పక ఇచ్చెదను అన్నాడు. అప్పుడు వామనుడు చాలా సంతోషము. నాకు కేవలము మూడడుగుల నేల చాలునన్నాడు. వచ్చింది సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువేనని ప్రక్కనే వున్న శుక్రాచార్యులవారికి అర్థమైంది. బలిచక్రవర్తిని ఎటువంటి పరిస్థితులలోను దానమియ్యవద్దని వారించాడు. అయినా బలిచక్రవర్తి వినలేదు. దానం గ్రహించిన వామనుడు రెండు అడుగులతో భూమ్యా కాశాలను ఆక్రమించి మూడవ అడుగు ఎక్కడ వుంచవలసినదని అడిగాడు. అందుకు బలి తన శిరస్సుపై వుంచవలసినదిగా చెప్పాడు. ఆవిధంగా బలిచక్రవర్తిని సుతలలోకానికి పంపాడు వామనరూపంలో వున్న శ్రీమన్నా రాయణుడు. ఆ విధంగా దేవతలందరూ బలి బారినుండి రక్షింపబడ్డారు.

పూర్వకాలంలో అవంతీ దేశంలో సుదాముడు అనే సద్బ్రాహ్మణుడు నివసించేవాడు. సకల వేదాలు చదివిన మహానుభావుడు. నిత్యం దేవతార్చనలోనే మునిగి తేలుతుండేవాడు. కానీ ఎంతటివారికైనా పూర్వ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



జన్మ కర్మ అనుభవించక తప్పదు కదా. ఇంతటి మహనీయుని బుద్ధి ఒక్కసారిగా వక్రించింది. మోహావేశాలు ఎక్కువైనాయి. ఎప్పుడూ విసుగు, చిరాకులతో సామాన్యులు కూడా పలకని చెడు మాటలు బిగ్గరగా అరుస్తుండేవాడు. అతనిని ఎరిగిన వారికి ఇదంతా ఆశ్చర్యంగా తోచింది. మునుపటి సుధాముడు ఇతడేనా అని తలచేవారు. అతని ప్రవర్తనకు భయపడి స్త్రీలెవ్వరూ కంటపడటానికి సాహసించేవారు కారు. కొద్ది కాలానికే పూర్తిగా అధ్వాన్న స్థితికి వచ్చి చివరికి వేశ్యావాటికలలో పగలు, రాత్రి గడిపేవాడు.

కొన్నాళ్ళకు చెడు అలవాట్ల ఫలితంగా సుధాముడు అనారోగ్యం పాలయి కుష్టువాడైనాడు. వూరివారందరూ కలిసి అతనిని తరిమివేశారు. అంతట ఊరి నుండి బయలుదేరి రోజుతూ, రొప్పుతూ సాయంత్రానికి మరొక ఊరు చేరుకున్నాడు. కానీ అక్కడివారు ఎవరూ కూడా సుధాముని సంగతి తెలిసినవారై ఆ ఊరిలోనికి రావడానికి ససేమిరా వీల్లేదన్నారు. అప్పుడు సుధామునికి జీవితం ఎంత విలువైనదో గ్రహింపు కలిగినది. ఎవరికైనా గడ్డు కాలం వస్తే కాని జీవితం విలువ, భగవంతుని ఉనికి తెలియవు కదా. కానీ ఏం లాభం, ఏ ఊరి ప్రజలూ కూడా అతని వికృత రూపం చూసి అతనిని ఏ ఊరిలోనికీ రానియ్యని వారైరి. దిక్కుతోచక తన విధిని నిందించుకుంటూ సుధాముడు చెట్ల వెంబడి, పుట్ల వెంబడి ప్రయాణమై కొద్దిరోజులకు ఒక దట్టమైన కీకారణ్యం చేరుకున్నాడు. దూరంలో సెలయేరు కనపడితే వెళ్ళి కాసింత నీళ్ళు తాగాడు. దాహం తీరింది. పక్కన దొరికిన దుంపలు తిన్నాడు.

మళ్ళీ లేచి నడక సాగించాడు, ఎన్నో అరణ్యాలను దాటుకుంటూ ఎటు పోతున్నాడో కూడా తెలియక కొన్ని నెలలపాటు అలాగే ప్రయాణం సాగించాడు, ఒకరోజున ఇలా నడుస్తూ, నడుస్తూ దూరంగానున్న కొండల్ని చూశాడు, అక్కడెవరైనా ఆటవికులో, గిరిజనులో ఉంటారేమో, కనీసం



వారైనా నన్ను ఆదరించ కపోతారా అని తలుస్తూ ఆ కొండలవైపుగా తన నడక సాగించాడు... కొండ సమీపానికి వచ్చాడు... కాలికి ఒక రాయి తగిలింది... అంతే ఒక అద్భుతం జరిగింది, సుధాముడి వికృతరూపం అంతా మాయమై పూర్వపు కంటే దివ్య రూపం వచ్చింది. ఒక్క క్షణంలో జరిగిన ఈ అద్భుతానికి సుధాముని నోట మాటలు లేవు, ఎందుకిలా జరిగింది అని పరి పరి విధాల తలుస్తున్నాడు.

సుధామునికి కాలికి తగిలిన రాయి మరెక్కడిదో కాదు... తిరుమల కొండమీదనుంచి జారిపడిన రాయి... ఆ పక్కన వున్నవన్నీ తిరుమల కొండలే... అప్పుడే వీచిన బలమైన గాలికి చిన్న రాయి వచ్చి జారి సుధాముని కాలికి తగిలింది, ఆ ప్రదేశంనుంచే వేంకటాద్రి ప్రారంభమౌతుంది. ఆ తిరుమల పవిత్ర మహిమచేతనే ఆ అద్భుతం సుధామునికి జరిగింది. ఎంతటి పాపాలైనా ఈ కొండపై కాలిడిన తక్షణమే నశిస్తాయి. ఇవన్నీ తెలియని సుధామునికి ఇంతలో దూరం నుంచి కొందరు ఆటవికులు ఏదో అరుస్తూ రావడం కనిపించింది, వారి భాషలో ఏదో అరుస్తూ చెబుతున్నారు. సుధామునికి వారి మాటలలో స్వామీ అనే మాట మాత్రమే అర్థమౌతోంది. ఇంతలో వాళ్ళు సుధాముని దగ్గరికి వచ్చి కొండపైకి వేలు చూపి ఏదో చెబుతున్నారు.. బహుశా ఎవరో మహర్షి అక్కడ ఉంటాడని తలంచి వారి వెనుకనే కొండ ఎక్కి వెళ్ళాడు. ఒకటా రెండా అలా ఏడు కొండలు... అంతా అక్కడకు రాగానే దూరంగా దివ్య మంగళ మనోహరమైన శ్రీనివాసుని అద్భుతరూపం దర్శనమిచ్చింది.

ఆ మనోహర రూపాన్ని శ్రీమన్నారాయణునిగా గ్రహించాడు. ఈ స్వామి వలననే తన పాపాలన్నీ తొలగిపోయి ఇంతటి అద్భుతరూపం వచ్చిందని తెలుసుకున్నాడు. ఆ దివ్య మంగళ విగ్రహం ఏకాంతంగా ఉంది... ఏ ఆలయమూ లేదు, స్వామికి ఆకాశమే గొడుగులా ఉంది... చుట్టూ పెద్ద చెట్లు పెరిగి వున్నాయి... పక్కనే సంపంగి వృక్షాలు... పెద్ద

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



చింత చెట్టు... ఎంత పెద్దదీ చింతచెట్టు... ఎటు చూసినా దానికొమ్మలే కనిపిస్తున్నాయి... ఈ శ్రీమన్నారాయణునికి పడగ పట్టిన ఆదిశేషుడే ఈ చింతచెట్టు కాదు కదా అనిపిస్తున్నది. అప్పట్నించి ఆ సుధాముడు ఆ స్వామినే సేవిస్తూ తన శేష జీవితాన్నంతా అక్కడే గడిపి చివరకు ఆ స్వామిలోనే ఐక్యమైనాడు.

ఏ కొండపై కాలుపెడితే జన్మ జన్మల పాపాలు క్షణంలోనే తొలగి పోతాయో అదే వేంకటాద్రి. ఏ కొండపై కాలుపెడితే సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయో అదే వేంకటాద్రి, అదే శ్రీనివాసునిగా వెలసిన శ్రీమన్నారాయణుని దివ్య ధామము. ఓ శ్రీనివాసా! శ్రీ వేంకటేశ్వరా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*



# ఓం శ్రీధరాయ నమః

శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన శ్రీమన్నారాయణుడు దివ్య మంగళ స్వరూపుడు. అత్యంత సుందరుడు. పరమ పావనుడు. సర్వ శుభములు కలిగించువాడు, దేవదానములు అమృతముకోసమై క్షీరసాగర మధనం గావించినప్పుడు ముందుగా హాలాహలం పుట్టింది. దానిని శివుడు తన కంఠంలో ధరించాడు. తరువాత వచ్చిన కామధేనువును బ్రహ్మ తన వెంట తీసుకువెళ్ళాడు. అటు తర్వాత ఉద్భవించిన ఉచ్ఛైశ్రవమును బలి చక్రవర్తి తీసుకున్నాడు. ఐరావతాన్ని ఇంద్రుడు కోరుకున్నాడు. అటు పిమ్మట వచ్చిన కౌస్తుభమణిని విష్ణుమూర్తి తీసుకున్నాడు. ఇలా పారిజాతం, కల్పవృక్షం, అప్సరసలు ఉద్భవించారు.

అటు తర్వాత అత్యంత తేజస్సుతోను, అద్భుత సౌందర్యంతోను శ్రీ మహాలక్ష్మీదేవి ఆ క్షీర సాగరం నుంచి ఉద్భవించింది. ఆమె సౌందర్యాన్ని చూసిన దేవదానవులందరూ నోట మాట రానివారయ్యారు, అందరూ అనేక

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



విధాల సేవలు చేశారు. సముద్రుడు అద్భుత వస్త్రాలను ఇచ్చాడు. వరుణుడు వైజయంతీమాలను సమర్పించాడు. బ్రహ్మ దేవుడు పద్మాన్ని అర్పించాడు. ఇలా అందరు దేవతలు తలొకటి సంతోషంగా సమర్పించారు. అప్పుడు లక్ష్మీదేవి అద్భుతమైన వరమాలను శ్రీమన్నారాయణుని మెడలో అలంకరించింది. శ్రీ మహావిష్ణువు లక్ష్మికి తన హృదయంలో స్థానం కల్పించాడు. 'శ్రీ'ని హృదయంలో ధరించిన శ్రీమన్నారాయణుడు శ్రీధరునిగా కీర్తించబడుతున్నాడు.

ఆ శ్రీధరుడే శ్రీవేంకటేశ్వరుడు. శ్రీ స్వామికి శ్రీ మహాలక్ష్మి అంటే అత్యంత ప్రేమానురాగాలు. అందుకే ఎల్లప్పుడూ ఆ మహాలక్ష్మిని తన హృదయంలోనే ధరిస్తున్నాడు. లక్ష్మీనారాయణులను పూజించినవారికి సర్వ సౌభాగ్యాలు లభిస్తాయి.

పూర్వకాలంలో కాంచీ పట్టణంలో సుమతి అనే వేశ్య నివసించేది. వేశ్య వృత్తిలో ఉన్న ఆమెనందరూ చిన్న చూపు చూసేవారు. తర తరాలుగా వస్తున్న వృత్తి పూర్వకంగా వేశ్య అయినప్పటికి సుమతి సద్గుణరాశి. భగవంతుని యందు ఎంతో భక్తి కలది. ఎల్లప్పుడూ శ్రీమన్నారాయణునినే మనస్సులో స్మరిస్తూ వుండేది. శ్రీనివాసునికి అత్యంత ప్రియమైన తులసి మొక్కను ఇంటి ఆవరణలో పెంచుకుని ప్రతిరోజు నీళ్ళు పోసి ప్రార్థిస్తుండేది.

జీవితంలో ఒక్కసారైనా వేంకటాచల యాత్ర చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఎంతో తహ తహలాడేది. ఆ రోజుల్లో తిరుమల యాత్ర చాలా కష్టభరితమై ఉండేది. కనీసం 40-50 మంది భక్తులు బృందంగా ఏర్పడి కాలినడకన బయలుదేరి నెలకో, రెండు నెలలకో తిరుమల చేరేవారు. సుమతికి ఏదైనా బృందంతో కలిసి తాను కూడా స్వామి దర్శనానికి వెళ్ళాలని ఎంతో కోరికగా ఉండేది. కానీ వేశ్యావృత్తిలో తనని ఎవ్వరూ తమతోటి రానించేవారు కాదు. ఈ విషయమై సుమతి ఎంతో బాధ పడుతుండేది. ఆ స్వామిని ఏవిధంగా దర్శించగలనా అని మధన పడుతుండేది.



ఆశ్రిత జన పక్షపాతి అయిన శ్రీమన్నారాయణుడు ఇవన్నీ గమనిస్తున్నాడు. భక్తికి మనస్సు ప్రధానం కానీ, పుట్టిన జాతి కానీ, వృత్తి కానీ కాదు కదా! జింక వలన జన్మించిన బ్రహ్మ శృంగుడు కానీ, కుంభము నుండి జన్మించిన అగస్త్యుడు కానీ, జంబుకము నుండి జన్మించిన జంబుకుడు కానీ, కుందేటి వీపు నుండి జన్మించిన గౌతముడు కానీ, దర్భల వలన జన్మించిన కౌశికుడు కానీ మహర్షులు కాలేదా?... శ్రీమన్నారాయణుని సేవించటానికి జాతి, కుల, వయో బేధము లేదు. ఎవరైతే తనను మనస్ఫూర్తిగా వేడుకుంటారో వారిని తప్పక కరుణిస్తాడు శ్రీనివాసుడు.

సుమతి ఈవిధంగా బాధ పడుతుండగా కొంతకాలానికి తన ఇంటికి నాలుగు వీధుల చివరన కొంతమంది వ్యాపారులు కుటుంబ సమేతంగా వేంకటాద్రికి పయనమవు తున్నట్లుగా తెలిసింది. తనకు తెలిసినవారి ద్వారా తాను కూడా రాదలచుకున్నానని దయచేసి అనుమతించమని పరి పరి విధాల ప్రాధేయపడింది. కానీ వారెవరూ కనికరించలేదు. ఒకవేశ్య తమతో రావడమా? నెలలతరబడి మాతో నడచి, మాతో కలసి తింటూ ప్రయాణించడమా? అంటూ ఆమెను శాపనార్థాలు పెట్టారు. ఇవన్నీ తెలిసిన సుమతి ఎంతో బాధ పడింది.

ఇంతలో ఆ భజన సమాజం వారందరూ వేంకటాద్రి వెళ్ళే రోజు రానే వచ్చింది. పిల్లా పెద్దలందరూ ఎంతో సంతోషంతో మునిగి తేలుతున్నారు. ఆరు నెలలకు సరిపడా వంట సరుకులన్నీ సర్దుకున్నారు. మరునాడు ఉదయమే ప్రయాణం... అంతే ఒక్కసారిగా రాత్రి కుంభవృష్టి ప్రారంభమైంది... పెద్ద తుఫాను... ప్రళయం లాగా ఉన్నది, ఆ వర్షం రెండు రోజులైనా కూడా తగ్గలేదు... ఆరు నెలలకోసం కట్టిన వంట సామాను మూటలన్నీ నీటమయమైనాయి... వారందరూ ఎంతో బాధ పడ్డారు. ఎందుకిలా జరిగింది, ఏమిటీ అకాల వర్షం... వంట సామానంతా

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



పాడైపోయింది కదా! అని ఎంతో దుఃఖించారు.

తరువాత మూడు నెలలకు తేరుకుని తిరిగి వేంకటాచల యాత్ర తలపెట్టారు. మళ్ళీ మరో అవాంతరం, యాత్ర సాగలేదు, ఇలా తలపెట్టిన ప్రతీసారి అవాంతరాలు ఎదురవసాగాయి... వారికి ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావటంలేదు, వారిలో కొందరు ఈ సారి ప్రయాణానికి ముందు రోజు శ్రీనివాసునికి ప్రత్యేకంగా పూజ నిర్వహించి బయలుదేరాలని సంకల్పించారు, భారీ ఎత్తున పూజా సామాగ్రీ తెచ్చి పూజ మొదలుపెట్టారు. అందరూ గోవింద నామ స్మరణ చేస్తున్నారు. ఇంతలో ఒక భక్తునిపై శ్రీమన్నారాయణులవారు ఆవహించి ఓ మూర్ఖులారా 'ప్రతీసారి మీ తిరుమల యాత్రకు అవాంతరం ఎందుకు ఏర్పడుతున్నదో తెలుసా?... అజ్ఞానులైన మీరు నాకు అత్యంత ప్రియభక్తురాలైన సుమతిని కేవలం వేశ్య అనే నెపంతో మీతో వేంకటాద్రి యాత్రకు రానివ్వటం లేదు, అందుకే మీకిన్ని అవాంతరాలు. రేపటి యాత్రలో మీరు ఆమెని కూడా మీతో కలుపుకుని తీసుకు రావలసింది. లేనియెడల ప్రళయసమానమైన వర్షం వచ్చి మీ ఊరంతా నేలమట్టమైపోగలదని హెచ్చరించాడు. అక్కడ వున్న వారందరికీ అప్పుడు అర్థమైంది. ఇన్ని నెలలుగా ఇన్ని అవాంతరాలు ఎందుకు ఏర్పడుతున్నాయో ఇప్పుడు గ్రహించారు.

వెంటనే వారిలో పెద్దలు కొందరు ఒక జట్టుగా ఏర్పడి సుమతి ఇంటికి వెళ్ళి 'అమ్మా నీ భక్తిని శంకించాం. మాకు ఇన్నాళ్ళకు జ్ఞానోదయం కలిగింది. శ్రీమన్నారాయణులవారి అనుగ్రహం వలన అసలు విషయం ఇప్పుడే తెలిసింది. రేపు మా యాత్రలో నువ్వు కూడా కలిసి రావలసింది' అని చెప్పారు. సుమతి ఆనందానికి అవధులు లేవు, శ్రీమన్నారాయణుని మనస్సులోనే శత విధాల కీర్తించింది.

మరునాడు సుమతితో కలిసి ఆ బృందం అంతా వేంకటాచల యాత్ర బయలుదేరారు. శ్రీవారి అనుగ్రహంతో వారి యాత్ర సఫలమై అద్భుతమైన



స్వామి దర్శనం లభించింది. తిరిగి స్వస్థలానికి చేరుకుని భక్తికి తారతమ్యాలు లేవని తెలుసుకుని కలకాలం సుఖంగా జీవించారు.

ఎవరి నామ స్మరణ వలన సర్వ పాపాలు నశించి, సర్వ శుభాలూ చేకూరుతాయో అతడే శ్రీమన్నారాయణుడు. అంతటి ప్రసన్నమూర్తి శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన వేంకటాద్రిపై కాలు పెడితేనే కోటి జన్మల పాపాలు పటాపంచలౌతాయి. ఓ శ్రీనివాసా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం హృషీకేశాయ నమః

హృషీకము అంటే ఇంద్రియములు, సమస్త జీవకోటియొక్క ఇంద్రియాలను సృష్టించినవాడు శ్రీమన్నారాయణుడు. అందుచేతనే ఆతడు హృషీకేశుడనబడుతున్నాడు. ఇంద్రియములను నియంత్రించేవాడు కూడా అతడే. ఇంద్రియాలన్నీ అతనిచే సృష్టింపబడి అతని ఆధీనంలోనే ఉంటాయి. అతడే పరమస్వరూపుడు. అతడే శ్రీనివాసుడు. అతడే శ్రీ వేంకటేశ్వరుడు.

నక్షత్రాలలో చంద్రుడు, వర్ణములలో బ్రాహ్మణుడు, పక్షులలో గరుత్మంతుడు, శిఖరములలో మేరువు, పర్వతములలో హిమాలయము, నదులలో గంగ, ఏనుగులలో ఐరావతము, మహర్షులలో భృగువు, సేనానులలో కుమారస్వామి, అశ్వములలో ఉచ్ఛైశ్రవము, మునులలో వ్యాసుడు, వృక్షములలో అశ్వత్థ వృక్షము, ఇంద్రియాలలో మనస్సు, ధేనువులలో కామధేనువు, ఆభరణములలో చూడామణి, పతివ్రతలలో అరుంధతి, దేవఋషులలో నారదుడు ఎలా శ్రేష్ఠమో కలియుగములో



శ్రీనివాసుని నామస్మరణకు మించిన శ్రేష్ఠము మరొకటి లేదు.

ఏ నామ కీర్తన మహిమచేత నారదుడు, తుంబురుడు, అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలు, సర్వ యక్షగణము, వారి వారి శక్తులు పొందగలుగుతున్నారో ఆ నామమే శ్రీమన్నారాయణుడు. అతడే శ్రీనివాసుడు, భక్తులకు అత్యంత సులభుడు. ఎటువంటి ఆపద కలిగినా తలచిన మరుక్షణంలోనే శరణన్నవారిని ఆదుకునే ఆప్తుడు. అత్యంత దయామయమూర్తి.

ఎవరైతే సర్వకాల సర్వావస్థలయందు తననే పరమప్రియునిగా, పరమ ఆప్తునిగా, పరమ మిత్రునిగా, పరమ గతిగా, అత్యంత హితునిగా, తల్లిగా, తండ్రిగా, దైవంగా, యజమానిగా భావిస్తారో వారికి సకల సౌభాగ్యాలు అనుగ్రహించే దయామయమూర్తి ఆ శ్రీమన్నారాయణుడే. కలియుగంలో మనందరికోనం శ్రీనివాసునిగా వేంకటాద్రిపై వెలసి నిత్య పూజలందుకుంటున్న మంగళ మనోహరమూర్తి అతడే. అతడే విశ్వేశ్వరుడు, అతడే వేంకటేశ్వరుడు, అతడే వేంకటాచలపతి, వేంకటనాథుడు అతడే, వేంకట రాముడు అతడే, వేంకట కృష్ణుడూ అతడే.

ఎవరైతే పూర్తి భారం తనమీదే మోపుతారో వారికి ఈ జీవిత భారం గడ్డిపోచకంటే తక్కువ బరువుగా అనుగ్రహించేవాడు ఆ శ్రీ వేంకటేశ్వరుడు ఒక్కడే.

పూర్వ కాలంలో త్రిలింగదేశంలో మయూరిపురి అనే పట్టణం ఉండేది. అందులో బ్రహ్మ బుద్ధి అనే చాకలి కుటుంబం నివసిస్తుండేది. బ్రహ్మబుద్ధి గంపెడు సంసారంతో, మిక్కిలి పేదరికంతో ఉండేవాడు. భార్యా భర్తలిద్దరు శ్రీనివాసుని భక్తులు. అంతటి పేదరికంలో కూడా ఎల్లప్పుడూ శ్రీనివాసునే తలుస్తూ కాలం గడిపేవాడు. కొంతకాలానికి వారికొక మగపిల్లవాడు పుట్టాడు. దురదృష్టవశాత్తు ఆ పిల్లవాడు పుట్టుకతోనే మూగతనంతో జన్మించాడు. అతనికి శ్రీకాంతుడు అనే నామకరణం

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



గావించారు. శ్రీకాంతుడు కాలక్రమేణా పెరిగి పెద్దవాడయ్యాడు. బ్రహ్మబుద్ధి దంపతులు కొడుకు మూగతనాన్ని తలుచుకుని ఎల్లప్పుడూ బాధ పడేవారు. తోటివారందరూ తనని హేళన చేయటంతో శ్రీకాంతుడికి ఎంతో బాధగా ఉండేది. బ్రహ్మబుద్ధి తన కుమారుడి మూగతనం పోగొట్టవలసిందిగా శ్రీనివాసుని ఎన్నో విధాల వేడుకున్నాడు.

ఇదిలా ఉండగా ఒకనాడు ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడు. ప్రజలందరూ ఆ సాధువు వద్దకు వెళ్ళి తమ తమ బాధలు వెళ్ళబుచ్చుకున్నారు. బ్రహ్మబుద్ధి దంపతులిద్దరూ కూడా ఆ సాధువును కలుసుకుని తమ కుమారుని మూగతనం గురించి తమ ఆవేదన వివరించారు. ఏదైనా పరిష్కారం చూపమని వేడుకున్నారు. అప్పుడు ఆ సాధువు కళ్ళు మూసుకుని ఆ దంపతులతో నాయనలారా! ఇక్కడకు పద్నాలుగు యోజనాల దూరంలో వేంకటాద్రి అనే అద్భుత కొండ కలదు. ఆ కొండపై స్వామి పుష్కరిణి అనే అద్భుత మహా మహిమాన్విత తీర్థం ఉన్నది. ఆ తీర్థంలో స్నానం చేసి చెంతన గల శ్రీ వేంకటేశ్వరుని దర్శిస్తే మీ కుమారుని మూగతనం పోతుంది. ఇదొక్కటే మార్గం. తప్పక మీ బాధ తీరగలదు. వీలైనంత త్వరలో వేంకటాద్రి యాత్ర తలపెట్టి ఆ స్వామిని దర్శించండి అని చెప్పాడు, ఇది విన్న ఆ దంపతులు ఎంతో సంతోషించి వీలున్నంత త్వరలోనే స్వామి దర్శనం చేసుకుంటామని ఆ సాధువుకు విన్నవించుకున్నారు.

ఆ తర్వాత కొంతకాలానికే వేంకటాద్రి యాత్ర సంకల్పించి కాలినడకన ఆ కుటుంబం అంతా బయలుదేరింది. తన భక్తులు ఎవరైనా సరే వేంకటాద్రికి వచ్చి తనను దర్శనం చేసుకుంటానని సంకల్పం చేస్తే వారికి కావలసిన సమస్త సదుపాయాల్ని సమకూరేలా అనుగ్రహిస్తాడు శ్రీ వేంకటేశ్వరుడు. మన సంకల్పం దృఢంగా ఉంటే చాలు, మన యాత్రకు కావలసిన సర్వం తానే చూసుకుంటాడు. శ్రీనివాసునికి తన భక్తులంటే



అలవిమాలిన ప్రేమ. తన దర్శనం కోసం వచ్చే భక్తులను చూస్తే ఆ ఆనంద నిలయయునికి అత్యంత ఆనందం.

తిరుమల యాత్ర సంకల్పించిన బ్రహ్మబుద్ధికి స్వామివారి దయవలన రెట్టింపు పని దొరికి మరింత ధనం సమకూరింది. కాలినడకన బయలుదేరిన ఆ కుటుంబం కొన్ని రోజుల తరువాత వేంకటాద్రి చేరింది. ఆ కొండ అద్భుత సహజ సౌందర్యానికి వీరందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఎక్కడ చూసినా చక్కటి సెలయేళ్ళు, అందమైన పూలమొక్కలు. అందమైన తీగలతో సుగంధ మొక్కలు, అప్పుడప్పుడు సన్నని తుంపర, పురివిప్పి ఆడుతున్న నెమళ్ళు, చెట్లపై పక్షుల కిల కిలా రావాలు... ఆహా ఈ తిరుమల సౌందర్యం వర్ణించ వీలు లేనిది కదా... సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే నివసిస్తున్న వేంకటాద్రి ఇంత అందంగా ఉండటంలో ఆశ్చర్యమేముంది...

ఇంతటి అద్భుత సౌందర్య ప్రదేశం కాబట్టే శ్రీనివాసుడు వైకుంఠం వదలి భక్తులననుగ్రహించటానికి ఈ వేంకటాచలాన్ని తన నివాసంగా ఎన్నుకున్నాడు.

తిరుమల చేరిన ఆ కుటుంబం అక్కడే ఉన్న ఒక సత్రంలో విశ్రమించారు. ఆ సాధువు చెప్పిన స్వామి పుష్కరిణి ఎక్కడ ఉన్నదో తోటి భక్తులను అడిగి తెలుసుకుని ఆ పుష్కరిణిని చేరుకున్నారు. ఎంతో అద్భుతంగా కనిపిస్తున్న ఆ పుష్కరిణికి నమస్కరించారు.

ఈ శ్రీవారి పుష్కరిణి మాహాత్మ్యము ఇంతా, అంతా అని చెప్పనలవి కానిది, ఎన్నో జన్మల పుణ్యఫలం వలన గాని ఈ పుష్కరిణిలో స్నానం చేసే భాగ్యం కలగదు. ధనుర్మాసంలో శుక్ల పక్ష ద్వాదశినాడు సూర్యోదయ సమయంలో ఈ బ్రహ్మాండంలో గల సమస్త తీర్థములు తమతమ పాప విమోచనమునకై ఈ స్వామి పుష్కరిణిలో స్నానమాచరిస్తాయి. సంవత్సరమంతా అనేకమంది పాపులు తమయందు స్నానమాచరించుటవలన కలిగెడి పాప జల నివృత్తి కొరకై ఈ తీర్థములన్ని

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



ఈ స్వామి పుష్కరిణియందు సాన్నిధ్యము చెందుచున్నవి.

ఇంతటి మహా మహిమాన్వితమైన ఈ పుష్కరిణిలో బ్రహ్మబుద్ధి కుటుంబమంతా స్నానమాచరించటానికి సిద్ధమయ్యారు. ఆ స్వామినే నమస్కరిస్తూ ఒక్కసారి నీట మునగగానే ఒక అద్భుతం జరిగింది. కుమారుడు శ్రీకాంతుడు మూగతనం మరిచిపోయినట్టుగా ఒక్కసారిగా శ్రీనివాసా! అని బిగ్గరగా అన్నాడు. ఆ మాటలకు బ్రహ్మబుద్ధి, అతని భార్య ఎంతో ఆశ్చర్యపడ్డారు, శ్రీకాంతుని మూగతనం పూర్తిగా పోయింది. ఆహా ఏమి ఈ పుష్కర మాహాత్మ్యము, ఒక్కసారి స్నానం చేయుటవలనే ఇంతటి మహాభాగ్యం అని తలచి ఆ స్వామిని మనస్సులోనే పరి పరివిధాల ప్రార్థించి శ్రీవారి ఆలయానికి వెళ్ళి ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీనివాసుని అనేక విధాలుగా కీర్తించారు. ఆ అద్భుత మనోహర మూర్తిని దర్శించిన ఆ కుటుంబం అంతులేని ఆనందానికి లోనైంది.

అక్కడే కొన్ని రోజులు గడిపి తిరిగి తమ ఊరికి పయనమై చిరకాలం సుఖ సౌభాగ్యాలతో జీవించి చివరన ముక్తిని పొందారు.

వేంకటాచల మహాత్మ్యము వర్ణించటానికి వెయ్యి నాలుకలున్న ఆ ఆదిశేషునికి కూడా సాధ్యం కాదు. శ్రీ వేంకటేశ్వరుడు అత్యంత కరుణామయుడు. ప్రతి మానవుడు జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా వేంకటాచాల యాత్రచేసి శ్రీస్వామిని దర్శించుకొనవలెను.

ఓ పుండరీకాక్ష, ఓ భక్తవత్సలా, ఓ ఆపద్బంధు, ఓ వేంకటనాథా నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*



# ఓం పద్మనాభాయ నమః

అనంతకోటి జన్మలనుంచి మూటకట్టుకున్న పాపాలన్నింటినీ కేవలం నామ స్మరణ చేతనే హరించివేసే పరమదయాకరమూర్తి శ్రీమన్నారాయణుడు. వేంకటాద్రిపై శ్రీనివాసునిగా వెలసిన శ్రీమన్నారాయణుని మనసారా కొలచినవారికి సర్వ సౌభాగ్యాలను తక్షణమే అనుగ్రహిస్తాడు. ఆర్తితో ఒక కోరిక కోరితే మనం కోరని మరో పది కోరికలు తీరుస్తాడు.

భక్తుల హృదయ పద్మములయందు ఎల్లవేళలా నివసించే పద్మనాభుడే శ్రీమన్నారాయణుడు. అతడే శ్రీ వేంకటేశ్వరుడు. జగత్కర్త అయిన బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణుని నాభినుండి ఆవిర్భవించిన పద్మములో జన్మించినాడు.

పూర్వకాలంలో ధర్మపాదుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పూర్వజన్మ పాపముల వలన సర్వం పోగొట్టుకున్నాడు. ఉన్న ఇల్లు, ఆస్తి

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అన్నీ కరిగిపోయి కట్టుబట్టలతో మిగిలాడు. ఈ కష్టాలతో మనస్సు వికలత చెందడం చేత తన పాండిత్య జ్ఞానం కూడా కోల్పోయాడు. చివరికి పిచ్చివాడై కొండలవెంట, కోనలవెంట, కీకారణ్యాలవెంట తిరుగుతూ వేంకటాద్రి చేరాడు. స్వామిని దర్శించాడు. స్వామిని మనసులోనే ప్రార్థించి ఏ కోరిక అడగాలో కూడా తెలియక నిల్చున్నాడు. మతిస్థిమితం లేకపోవడంచేత నవ్వుతూ అయోమయంగా నిల్చున్నాడు. ఇతని పరిస్థితి చూసిన అమిత దయా మయుడయిన శ్రీనివాసునికి జాలి కలిగింది. వెంటనే అతనికి సర్వ సంపదలు, సర్వ పాండిత్య జ్ఞానము అనుగ్రహించాడు. వేంకటనాథుని కరుణ అటువంటిది.

భక్తులకు ఏం కావాలో తెలుసుకుని అన్నీ అనుగ్రహించే ఆనంద నిలయుడు మన చెంత నుండగా మనకింక భయమేల.... ఓ శ్రీ వేంకటేశ్వరా నీకీర్తి చతుర్దశ భువనములయందు వ్యాపించింది. ముక్కోటి దేవతలు నీ అనుగ్రహమునకై ఎదురుచూచుచున్నారు తండ్రీ! నీవు భక్త వత్సలుడవు. నీవు కళ్యాణగుణ విశిష్టదివ్య మంగళ విగ్రహ రూపుడవు. జ్ఞాన స్వరూపుడవు. అర్చింపదగినవారలచే అర్చింపదగినవాడవు. ఓ శ్రీనివాసా! నీ నామ సంకీర్తనం వలన కలిగెడి ఆనందము, యజ్ఞము, తపస్సు, దానము, తీర్థ యాత్రలు వంటి ఏ పుణ్య కార్యముల వలన లభించెడి ఆనందముకంటె వేయిరెట్లు స్వామి! ఓ పురుషోత్తమా నీకివే మా నమస్కారములు.

శ్రీ వేంకటేశ్వరుని మనసారా కొలచినవారికి ఆ స్వామి దివ్య దర్శనం కలుగుతుంది. వేంకటాద్రిపై కనులు మూసుకుని ఒక్క సారి స్వామిని భక్తితో ధ్యానిస్తే ఆ దివ్య మంగళరూపుని విశ్వరూప దర్శనం కలుగుతుంది. ఈ విశ్వరూప దర్శనం ఎలా వుంటుంది?... ఒకసారి బ్రహ్మదేవుడు నారదునికి శ్రీమన్నారాయణుని విశ్వరూపాన్ని వివరిస్తూ ఇలా చెప్పసాగాడు. 'ఓ నారదా! శ్రీమన్నారాయణుని విశ్వరూపం వర్ణించటం ఎవరికినీ సాధ్యం కాదు. నాకు శక్తికి వీలైనంత నేను వర్ణించెదను. అయితే ఇది ఆ



స్వామి విశ్వరూప వర్ణనలో సహస్రవంతుకంటే తక్కువే అని గ్రహించుము. ఆ విరాట్ రూపుని కటి ప్రదేశము నుండి ఊర్ధ్వ దేహమే ఊర్ధ్వ లోకాలు. అధో దేహమే అధో లోకాలు. నాభియే భువర్లోకము, హృదయమే సువర్లోకము, ఆతని వక్షమే మహర్లోకము, మెడ జనలోకము, స్తనద్వయము తపో లోకము, శ్రీమన్నారాయణుని శిరస్సే సత్యలోకము. అతలము ఆతని జఘనము. వితలము తొడలు, సుతలము మోకాళ్ళు. తలాతలము పిక్కలు, మహాతలము చీలమండలము, రసాతలము పాదాగ్రము, పాతాళము పాదాలు. ముఖము వాక్కు, అగ్ని. రోమాలే ఉష్ణిక్ ఛందస్సు. అతని చర్మమే ధాత్రీ చంధస్సు, మాంసము త్రిష్టప్ ఛందస్సు. అస్థి జగతీ చంధస్సు, మక్తి పంక్తి చంధస్సు. ప్రాణము బృహతీ చంధస్సు. రసము నాలుక, వాయువు శ్వాస. సూర్యుడు కనులు. దిశలే చెవులు. స్పర్శయే దేహము, మేఘములే అతని కేశములు, రాత్రింబవళ్ళు కనురెప్పలు..... ఈవిధంగా బ్రహ్మదేవుడు నారదునికి శ్రీమన్నారాయణుని విశ్వరూపం వివరించాడు.

పవిత్ర తిరుమల కొండపై ఆ పద్మనాభుని విశ్వరూప దర్శనం కలిగిన వారికి మరుజన్మ ఉండదు. శ్రీ స్వామివారి విశ్వరూప దర్శనంలో సకల దేవతలను, సమస్త ప్రాణకోటిని, సకల ముని పుంగవులను దర్శించవచ్చు. అనేక వేల భుజములు, అనేక వేల కన్నులు, అనేక వేల ముఖములు, అనేక వేల చేతులు, ఇలా అనంతాకారాలతో ఆ స్వామి దర్శనం అద్భుతం. వేయి నాలుకలున్న ఆదిశేషునికే వర్ణించవీలు కానప్పుడు అల్పులమైన మనమెంతటివారము.

ఓ శ్రీ వేంకటేశ్వరా మాకు నీ దివ్య దర్శనమును అనుగ్రహించి, మమ్ములను కరుణించు తండ్రీ!. నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం దామోదరాయ నమః

దామములు అంటే లోకములు అని అర్థము. లోకములన్నింటిని తన ఉదరమునందు ధరించినవాడైనందున శ్రీమన్నారాయణుడు దామోదరుడని పిలవబడుతున్నాడు. సర్వ జగత్తంతా శ్రీమన్నారాయణుని యందు కలదు.

దేవ, గంధర్వ, కిన్నెర కింపురుష గణముతో కూడిన జగత్తంతా శ్రీమన్నారాయణుని ఆధీనంలోనే ఉన్నది. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, కాంతి, బలము, ఇలా అన్నీ కూడా శ్రీమన్నారాయణుని రూపాలే. యోగము, జ్ఞానము, సమస్త విద్యలు, సమస్త శాస్త్రాలు, సమస్త కళలు, ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహము వలననే లభించగలవు.

ఒకసారి ఆదిత్యాది నవగ్రహ దేవతలందరు శ్రీమన్నారాయణుని దర్శనార్థమై వైకుంఠానికి వెళ్ళారు. అయితే అక్కడ వారికి శ్రీమహావిష్ణువు



కనబడలేదు. ఇంతటి మహాభాగ్యమైన వైకుంఠాన్ని వదలి శ్రీమన్నారాయణులవారు ఎక్కడికి వెళ్ళారా అని తమలో తాము చర్చించుకోసాగారు. ఇంతలో ఇంద్రాది అష్ట దిక్పాలకులు కూడా శ్రీహరి దర్శనార్థమై అక్కడకు చేరుకున్నారు. వారు కూడా శ్రీమన్నారాయణుడు వైకుంఠంలో లేడని తెలిసి ఆశ్చర్యపోయారు. ఇంతలో అటుగా నారదమునీంద్రులవారు రావటం సంభవించింది. నారదులవారిని చూడగానే అందరూ నమస్కరించారు.

అప్పుడు ఇంద్రుడు నారద మహామునితో 'ఓ నారద మునీంద్రా! మీకివే మా నమస్కారములు. మేమందరము శ్రీమన్నారాయణుని దర్శనార్థమై ఎంతో ఆత్రుతతో వచ్చినాము. కానీ స్వామివారు ఇక్కడ వైకుంఠంలో కానరాక మిక్కిలి నిరాశకు లోనైనాము. నీవు ఆ శ్రీమన్నారాయణులవారికి అత్యంత ఆప్తుడవు కదా. నీకు ఆ స్వామివారు ఎక్కడ ఉన్నది తప్పక తెలియగలదు. దయచేసి మమ్ములను అనుగ్రహించి విష్ణుమూర్తులవారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో సెలవిస్తే ఆ స్వామిని దర్శించుకుని తరిస్తాము. ఇది మా అందరి ప్రార్థనగా భావించవలసినది' అని కోరగా అంతట నారదులవారు ఒక్కసారి కళ్ళు మూసుకుని చిరునవ్వు నవ్వారు, ఆ చిరునవ్వు అంతరార్థము ఏమై వుండునా అని అందరూ ఆశ్చర్యంతో ఎదురుచూడసాగారు.

అప్పుడు నారదులవారు 'నాయనలారా! మీ అందరి మనస్సు నేను గ్రహించినాను. ఆ స్వామిని తక్షణమే దర్శించాలన్న మీ అందరి మనో నిశ్చయమునకు చాలా సంతోషము. శ్రీమన్నారాయణులవారు ఇప్పుడు భూలోకంలో వేకంటాద్రిపై ఉన్నారు' అని నారదుడు సెలవీయగానే కుబేరుడు ఏమి ఆ వేంకటాద్రి అంత గొప్ప పర్వతమా అని నారదులవారిని ప్రశ్నించిరి. ఇంద్రుడు, వరుణుడు కూడా ఇదే విధంగా నారదులవారితో భూలోకంలో ఒక సామాన్య పర్వతంపై శ్రీమన్నారాయణుల వారు

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



నివసించుటయా అని ఆశ్చర్యంతో అడిగారు.

అప్పుడు నారద మునీంద్రుడు వారితో 'నాయనలారా! ఆ వేంకటాద్రిని సామాన్య పర్వతముగా నెంచవలదు. శ్రీమన్నారాయణుని ప్రియభక్తుడైన ఆదిశేషుడే వేంకటాద్రి. వేంకటాద్రి మాహాత్మ్యము ఇంతా, అంతా అని చెప్పనలవి కానిది. ఏ పర్వతము యొక్క నామము ఒక్కసారి తలచినంతనే సర్వపాపాలూ తొలగిపోవునో అదే వేంకటాద్రి. ఈ వేంకటాద్రికే గరుడాద్రి, శేషాద్రి, కనకాద్రి, వృషభాద్రి, అంజనాద్రి, నారాయణాద్రి, ఆదిగా అనేక నామములు కలవు. ఈ వేంకటేద్రిపై చేసిన దానము, కోటి రెట్లు ఫలము నీయగలదు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరునిగా ఈ కొండపై భక్తుల సంరక్షణార్థమై వెలసి వున్నాడు. ఈ శ్రీనివాసుని స్మరిస్తూ వేంకటాద్రిపై దానము చేసిన వారికి సర్వసౌభాగ్యాలు లభించును. వస్త్ర దానము చేసిన ఆయువృద్ధి కలుగును. సువర్ణదానము చేసినచో మోక్షము కలుగగలదు. కపిల గోవును దానము చేసినచో ఆ గోవు రోమముల సంఖ్య గల సంవత్సరముల కాలము విష్ణులోకము సిద్ధించును. భూదానము ఇచ్చినచో సర్వపాపములు తొలగి మోక్షము లభించును. భగవత్ప్రీతిగా గుఱ్ఱము, ఏనుగులు దానము చేయువాడు లోకపాలక పదవిని అనుభవించును. ఈ వేంకటాద్రిపై చేసిన అతి స్వల్ప దానమైనను వేయి రెట్లు ఫల ప్రదాయిని కాగలదు అని నారదుల వారు వేంకటాచలమును అనేక విధాలుగా వర్ణించారు.

ఈ విశేషాలన్నీ విన్న అష్టదిక్పాలకులు, నవగ్రహ దేవతలు ఎంతో సంతోషపడి వెంటనే పయనమై వేంకటాద్రి చేరి స్వామి పుష్కరిణిలో శుభ్రముగా స్నానము చేసినవారై శ్రీనివాసుని దివ్యదర్శనము చేసుకొనిరి.

ఆనంద నిలయంలో శ్రీ వేంకటేశ్వరునిగా అవతరించిన శ్రీమన్నారాయణుని గాంచిన వారి ఆనందమునకు హద్దులు లేకుండెను. ఓ పురుషోత్తమా! నీకొరకు వైకుంఠమునకు బోయి అక్కడ నిన్ను గానక



నారదుల వారి ద్వారా నీవిచ్చట యున్నావని యెరింగి నిన్ను సేవింప వచ్చితిమి. ఓ వేంకటనాథా మమ్ములను అనుగ్రహిం పవలసినది. ఓ పురుషోత్తమా నీవు భక్త సులభుడవు, దయా సముద్రుడవు. యజ్ఞ, దాన వ్రతాదులు ఎన్ని చేసినను నీ నామము ఒక్కసారి సంకీర్తన చేసిన ఫలమునకు సరితూగవు. నీ నామ స్మరణయే సకల చరాచర జీవకోటికి ముక్తి మార్గము. నీ నామ స్మరణవలన కలిగెడి ఆనందము ఎంతటి మహా మహిమాన్విత తీర్థయాత్రా దర్శనము వలన కూడా సాధ్యము కాదు. సమస్త లోకములకు నీ నామ స్మరణయే ఆధారము. అది యొక్కటియే సర్వ కోరికల సిద్ధికి ఉపాయము,

ఈ విధముగా శ్రీ వేంకటేశ్వరుని ఆ దేవతలందరు పరి పరివిధాల స్తుతించి తిరిగి వారి వారి స్వస్థానములకేగిరి.

మానవ జీవితంలో ఒక్కసారయినా వేంకటాచల యాత్ర చేసి శ్రీ స్వామివారిని దర్శించవలెను. ఎన్నో జన్మల పుణ్యఫలము చేతగానీ వేంకటాచల యాత్ర చేసి శ్రీ స్వామివారి దర్శనము చేసి తరించవలెననెడి సంకల్పము కలుగదు. ధృఢముగా సంకల్పము చేసి ఆ స్వామిని దర్శించేవారు ధన్యజీవులు. ఓ శ్రీనివాసా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం సంకర్షణాయ నమః

ప్రళయకాలంలో సర్వజీవులను తన వద్దకు ఆకర్షించుకునే శ్రీమన్నారాయణుడు సంకర్షణునిగా పిలవబడుతున్నాడు. మత్స్యావతార కాలంలో సత్యవ్రత మహారాజు తన దోసిలిలో పడిన చేప క్షణ క్షణానికి పెరిగిపోవటం చూసి అమితమైన ఆశ్చర్యం చెందాడు. అది శ్రీమన్నారాయణుడు తప్ప మరొకరు కానే కాదని గ్రహించి స్వామీ నువ్వు జగత్ప్రభువైన జనార్దనునివే తప్ప వేరొకరు కాదు. అల్పునియైన నా యందు దయ వుంచి నన్ను రక్షింపవలసింది అని వేడుకున్నాడు. అప్పుడు ఆ చేప 'అవును! నీవు గ్రహించినది నిజమే! నేనే అచ్యుతడను! నేనే శ్రీమన్నారాయణుడను! నేటి నుంచి ఏడు రోజులలో ప్రళయం సంభవించగలదు. అప్పుడు నీ వద్దకు ఒక పెద్ద ఓడ రాగలదు. దానిలో ఓషధులు, ధాన్యము వేసి సప్త ఋషులతో కలిసి నీవు కూడా ఎక్కవలసింది. వాసుకిని తాడుగా చేసి ఆ పడవకు నా కొమ్ముకు కలిపి కట్టవలసింది'



అని చెప్పి శ్రీమన్నారాయణుడు అదృశ్యమయ్యాడు. ఇదంతా సావధానముగా విన్నవాడై సత్యవ్రతుడు ప్రళయం వచ్చిన రోజున స్వామివారు సెలవిచ్చినటులనే చేసి జనార్దనునిచేత రక్షింపబడ్డాడు.

ఈ విధంగా సకల జీవులను తనవద్దకు ఆకర్షించి, రక్షించే ఆ సంకర్షణుడే శ్రీ వేంకటేశ్వరుడు. ఈ జగత్తంతా సర్వ కాలాలలోను, సర్వ ప్రదేశాలలోను ఆవరించి వున్నది ఆ శ్రీనివాసుడే. అందుకే ఎవరు ఏ పేరుతో ఎక్కడ నుంచి పిలిచినా తక్షణమే ఆదుకొంటాడు ఈ దయామయమూర్తి.

ఒకనాడు అష్ట దిక్పాలకులు, నవగ్రహదేవతలు, అశ్వనీ దేవతలు, నారద తుంబుర గణమంతా కలిసి వేంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఆ పురుషోత్తముని పరి పరివిధాల స్తుతించారు. అప్పుడు శ్రీనివాసుడు వారితో 'ఓ ఆప్తులారా ఏమిటి మీ రాకలో ఆంతర్యము? అందరూ కుశలమే కదా!' అని అన్నాడు. అప్పుడు ఇంద్రుడు శ్రీ మహావిష్ణువుతో ఓ స్వామీ నీ దయవలన అందరమూ క్షేమమే. సర్వమూ తెలిసిన నీవెరుంగనిది ఏమున్నది? కలియుగములో ఈ మానవులు ఎంతో అదృష్టవంతులు కదా. ఎంతో దుర్లభమైన నీ దర్శన భాగ్యము ఈ వేంకటాద్రిపై అతి సులభముగా లభించుచున్నది. నీ భక్తులను సేవించుటయే నిన్ను సేవించుట కదా! అంతకంటే మిక్కిలి భాగ్యమేమి కలదు? మా అందరికీ ఓ ఆలోచనలను వచ్చినది. మా ఆలోచలన మీకు విన్నవించటానికి అందరమూ వచ్చితిమి. దయచేసి విని మిమ్మలను అనుగ్రహించవలసింది. అది ఏమనగా మేమందరము ఈ వేంకటాద్రికి నీ దర్శనము కోరి వచ్చిన నీ భక్తులకు ఏవిధమునైనా సేవ చేసి నీ అనుగ్రహమును సంపా దించవలెనని మా అందరికీ ఎంతో కుతూహలముగా నున్నది. దయచేసి ఇందులకు అనుజ్ఞ నివ్వవలసినది అని ఇంద్రుడు విన్నవించాడు.

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



అప్పుడు భక్త సులభుడైన ఆ పురుషోత్తముడు 'మీ ఆలోచన నాకు చాలా సంతోషము కలిగించినది. మీ మీ అభీష్ఠాలు విన్నవించవలసినది' అన్నాడు. అప్పుడు ఇంద్రుడు 'స్వామీ! ఉన్నత పదవులను ఆశించి, ఎవరైతే ఈ వేంకటాద్రిపై కాలిడుతారో వారికి ఆ పదవులను నేను అనుగ్రహిస్తాను. నాకు ఈ విధంగా అనుజ్ఞ ఇవ్వవలిసినది' అన్నాడు, అప్పుడు శ్రీనివాసుడు అటులే అన్నాడు. కుబేరుడు స్వామివారితో స్వామీ ఓ శ్రీమన్నారాయణా! ఎవరైతే ఐశ్వర్యాన్ని ఆకాంక్షించి ఈ వేంకటాద్రికి వస్తారో వారికి నేను సకల ఐశ్వర్యాలను అనుగ్రహిస్తాను. దయచేసి నాకు ఇందులకు అనుజ్ఞ ఇవ్వవలసింది అన్నాడు. అందులకు శ్రీ వేంకటేశ్వరుడు సంతోషించి తప్పక అటులేనని అన్నాడు. తరువాత యమధర్మరాజు ఓ పురుషోత్తమా! పరంధామా! ఈ వేంకటాద్రిపై కాలిడిన భక్తులందరు నీకు అత్యంత ప్రీతి పాత్రులే కదా. వారిలో ఎవరైనా అల్పాయుష్కులు అయిన యెడల వారికి సంపూర్ణ ఆయుష్షును నేను ప్రసాదిస్తాను అన్నాడు. బుధుడు 'స్వామీ! ఎవరికైనా జ్ఞానం కావలసినచో నేను అనుగ్రహిస్తానన్నాడు. ఆదిత్యుడు 'ఓ శ్రీమన్నారాయణా! ఈ వేంకటాద్రికి వచ్చిన నీ భక్తులలో ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతున్న ఎడల వారికి సంపూర్ణ ఆరోగ్యమును నేను అనుగ్రహిస్తాను అన్నాడు. శుక్రుడు 'స్వామీ శ్రీనివాసా! నీకు కళలంటే మిక్కిలి ప్రీతి కదా, వేంకటాద్రికి చేరిన నీ భక్తులలో ఎవరైనా కళలలో ప్రావీణ్యం కావాలనే కోరికతో వచ్చినవారికి సకల కళలలో అద్భుత ప్రావీణ్యం అనుగ్రహిస్తాను అన్నాడు.

శనిగ్రహ దేవత శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూ 'స్వామీ శ్రీమన్నారాయాణా! ఈ వేంకటాద్రిపై కాలిడిన నీ భక్తులెవరైనా గ్రహ బాధలను అనుభవిస్తూ కష్టాలలో తేలియాడుతున్న వారైతే వారిని ఆ బాధలనుండి విముక్తుని చేసి ఆనందాన్ని కలుగజేస్తాను అన్నాడు. అగ్ని దేవుడు 'స్వామీ! ఆప్త జనరక్షకా నీవు నిరాకారుడవు, నిర్గుణ స్వరూపుడవు,



అనంతుడవు, ఆది మధ్యములు లేనివాడవు. ఎన్నో జన్మల పుణ్యఫలంచేతగాని, ఈ వేంకటాద్రి చేరి నిన్ను సేవించే సంకల్ప భాగ్యం కలుగదు. కాబట్టి నీ దర్శనార్థమై వేంకటాద్రికి వచ్చే నీ భక్తులకు ఎల్లప్పటికీ నా వలన ఎటువంటి ఆపదా రాకుండా కాపాడగలవాడను' అని అన్నాడు.

ఈ విధంగా అక్కడ చేరిన ఆ దేవతలందరూ తమరికి ఆయా సేవలు చేసే భాగ్యం కలిగించవలసిందిగా శ్రీనివాసుని పరి పరివిధాల ప్రార్థించారు. అప్పుడు శ్రీమన్నారాయణుడు చిరునవ్వుతో "నా భక్తుల యెడల మీ అందరికీ గల మమకారానికి అనుగ్రహానికి నాకు చాలా సంతోషము. కలియుగంలో రోజూ ఎంతో మంది భక్తులు నా దర్శనానికై ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి ఎంతో దూరం నుండి వస్తుంటారు. వారందరూ అనేక కోర్కెలు గలవారై ఉంటారు. వారందరి కోర్కెలను గ్రహించి, మీరందరూ తీర్చవలసింది" అనగానే ఆ దేవతలందరూ సంతోషించి స్వామిని పరి పరివిధాల స్తుతించి తమ తమ స్వస్థానములకు తిరిగి వెళ్ళారు. అప్పటినుండి వారందరూ తిరుమలకొండపై భక్తులు అడుగు పెట్టినప్పటినుంచి వారు ఏ కోరికలతో వచ్చారా అని గమనిస్తూ ఆ కోరికలు తీర్చి వారు కూడా శ్రీనివాసుని అనుగ్రహానికి పాత్రులు అవుతున్నారు. అందువలననే భక్తుల కోర్కెలు పవిత్ర వేంకటాద్రిపై కాలు పెట్టగానే తీరుతాయి.

ఓ శ్రీనివాసా! నీవు ఆశ్రిత జన పక్షపాతివి, నిన్ను కొలిచినవారికి ఏ భాగ్యానికీ లోటుండదు స్వామీ, ఆపద మ్రొక్కుల వాడా! అనాథ రక్షకా! దీనబంధూ! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం వాసుదేవాయ నమః

సకాల జీవకోటిని తనయందు వసింపచేయగలవాడు కాబట్టి శ్రీమన్నారా యణుడు వాసుదేవుడనబడుతున్నాడు.

సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు అయిదు అవతారాలలోఉంటాడు. వాటినే పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారాలు అని అంటారు. వైకుంఠంలో ఉండే శ్రీమన్నారాయణుడు పరావతారం. వైకుంఠంలో ఉండే పరస్వరూపము, సామాన్యులకే కాదు, దేవతలకు కూడా చూడ శక్యము కానిది. నిత్యము, అప్రమేయము అయినటువంటి ఈ పరబ్రహ్మ స్వరూపము కేవలము అనంత, గరుడ, విష్వక్సేనాదులకు, సనక సనందనాది మహా పురుషులకు మాత్రమే దర్శింపశక్యము.

రెండవది వ్యూహావతారం. పాల సముద్రంలో ఆదిశేషునిపై శయనించే శ్రీమన్నారాయణుని దివ్య రూపమే వ్యూహ స్వరూపము. ఈ స్వరూపాన్నే బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రాది దేవతలు సేవిస్తూ ఉంటారు.



సామాన్యులకు ఇది దర్శింప శక్యము కాదు. మూడవది విభవావతారం. ఈ జగత్తులో ధర్మానికి హాని జరిగినప్పుడు దుష్టులను శిక్షించి సకల ప్రజలను రక్షించడం కోసమే శ్రీమన్నారాయణుడు భూలోకంలో అవతరిస్తుంటాడు. శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణ భగవానుడు మొదలైన అవతారాలు ఈ మూడవ కోవలోనికే వస్తాయి. అవతారమెత్తిన కారణం పూర్తికాగానే అవతార పరిసమాప్తి కాబడుతుంది. ఇక సమస్త ప్రాణుల హృదయాలలో ఉన్న పరమేశ్వరుని రూపమే అంతర్యామి స్వరూపము.

ఈ నాలుగు కూడా సామాన్య భక్తులకు సేవించుకొనుటకు చాలా కష్టతరము కావున శ్రీమన్నారాయణుడు భక్తులయందు మిక్కిలి అనుగ్రహము కలవాడై దివ్య క్షేత్రాలలో దర్శనిమిచ్చేదే అర్చ్యాస్వరూపము. ఈ అర్చ్యాస్వరూపములలో నాలుగు విధములున్నవి. మొదటిది స్వయంవ్యక్తములు అనబడును, అనగా భగవంతుడే తానే స్వయముగా ఏదేని పవిత్ర ప్రదేశములో వెలయు స్వరూపము. వేంకటాద్రి వేంకటేశ్వరుడు, శ్రీమన్నారాయణుని స్వయంవ్యక్త అర్చ్యారూపమే. రెండవది బ్రహ్మ, మహేశ్వరుడు ఆదిగా గల దేవతలచే ప్రతిష్ఠితమైన దివ్య ధామములు. ఇక మూడవదైన సైద్ధములు మహామహిమాన్వితమైన మునులచే ప్రతిష్ఠింపబడిన దివ్య ప్రదేశములు. నాలుగవది మానుషములు, అనగా మానవులచే ప్రతిష్ఠింపబడినవి.

శ్రీమన్నారాయణుడే స్వయంగా శ్రీనివాసునిగా ఆవిర్భవించిన దివ్య ప్రదేశమే వేంకటాద్రి. ఈ వేంకటాద్రి విభుని దివ్య మంగళ దర్శనంతో సర్వ పాపాలూ నశిస్తాయి. సర్వ సౌభాగ్యాలూకలుగుతాయి.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే నివసించే ఈ పవిత్ర వేంకటాద్రిపై అరవై ఆరు కోట్ల పుణ్యతీర్థాలు కలవు. వీటిలోనూ వెయ్యిన్ని ఎనిమిది అతి ముఖ్యమైనవి, ఇందులోనూ సర్వ జ్ఞానప్రదములైన నూట ఎనిమిది ముఖ్యమైనవి. ఈ తీర్థములలో స్నానము చేసిన సర్వ పాపములు

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



నశించును, కనీసము ఈ తీర్థముల నామము స్మరించినా కూడా సకల పుణ్యములు కలుగును.

ఇవియే మనుతీర్థము, ఇంద్రతీర్థము, వసుతీర్థము, పదునకొండు రుద్ర తీర్థములు, ద్వాదశాదిత్య తీర్థములు, నవ ప్రజాపతి తీర్థములు, అశ్వినీతీర్థము, శుక్ర తీర్థము, వారుణ తీర్థము, జాహ్నవీ తీర్థము, కాంపేయ తీర్థము, కాణ్వ తీర్థము, ఆగ్నేయతీర్థము, నారదతీర్థము, సోమ తీర్థము, భార్గవ తీర్థము, ధర్మ తీర్థము, యజ్ఞ తీర్థము, పశు తీర్థము, గణేశ్వర తీర్థము, భౌమాశ్వ తీర్థము, పారిభద్ర తీర్థము, జగజ్జాడ్యహర తీర్థము, విశ్వ కల్లోల తీర్థము, యమ తీర్థము, బాహస్పత్య తీర్థము, కామహర్ష తీర్థము, అజామోద తీర్థము, జినేశ్వర తీర్థము, ఇష్టసిద్ధి తీర్థము, కర్మసిద్ధి తీర్థము, వట తీర్థము, ఔదుంభర తీర్థము, కార్తికేయ తీర్థము, కుబ్జ తీర్థము, దశ ప్రాచేతస తీర్థములు, గరుడ తీర్థము, శేష తీర్థము, వాసుకి తీర్థము, విష్ణువర్ధన తీర్థము, కర్మకాండ తీర్థము, పుణ్యవర్ధన తీర్థము, ఋణ విమోచన తీర్థము, పార్జన్య తీర్థము, మేఘ తీర్థము, సాంకర్షణ తీర్థము, వాసుదేవ తీర్థము, నారాయణ తీర్థము, దేవ తీర్థము, యక్ష తీర్థము, కాల తీర్థము, గోముఖ తీర్థము, ప్రాద్యుమ్న తీర్థము, అనిరుద్ధ తీర్థము, పితృ తీర్థము, ఆర్షేయ తీర్థము, వైశ్వదేవ తీర్థము, స్వధా తీర్థము, స్వాహా తీర్థము, అస్థి తీర్థము, ఆంజనేయ తీర్థము, శుద్ధోదక తీర్థము, మరియు అష్టభైరవ తీర్థములు.

ఈ తీర్థముల పేర్లు ఒక్కసారి ఆ శ్రీనివాసునే మనసులో తలుస్తూ ఎవరైతే స్మరిస్తారో వారందరికీ సర్వ పాపాలు తొలగిపోగలవు. అందునా వేంకటాద్రిపై ఉన్న సమయంలో ఈ పేర్లనీ స్మరించిన యెడల అన్నింటిలో స్నానమాచరించిన ఫలము కలుగును. వయో, శరీర, అనారోగ్య బాధల వలన గానీ, ఏ కారణములచేతనైనా గానీ, వేంకటాద్రికి వెళ్ళలేనివారు తామున్న ప్రదేశంలోనే కేవలము ఒక్కసారి ఆ స్వామివారినే తలుస్తూ ఈ



తీర్థ నామాలన్నీ చదివినా చాలు, ఈ తీర్థాలన్నిటిలోనూ స్నానం చేసిన పుణ్యం తప్పక లభిస్తుంది. అంతటి కరుణామయుడు ఆ శ్రీనివాసుడు. ఓ శ్రీనివాసా, ఓ శ్రీవేంకటేశ్వరా, ఓ ఆపద్భంధవా నీకివే మా నమస్కారములు.

*“ శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ”*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం ప్రద్యుమ్నాయ నమః

సర్వ ఐశ్వర్యాలనూ ప్రసాదించే ప్రద్యుమ్నుడే శ్రీమన్నారాయణుడు. 'ద్యుమ్నం' అంటే స్వయంగా ప్రకాశించుట అని అర్థము, అద్భుత తేజస్సుతో ప్రకాశించేవాడు కాబట్టి శ్రీమన్నారాయణుడు ప్రద్యుమ్నుడు అనబడుతున్నాడు. అత్యంత పరాక్రమవంతుడు, భక్త పరాయణుడు, భక్త సులభుడు అయిన శ్రీమన్నారాయణుడు వేంకటేశ్వరునిగా తిరుమలపై వెలసి భక్తులందరిని అనుగ్రహిస్తున్నాడు.

పూర్వకాలంలో విష్ణు శర్మ అనే సద్బ్రాహ్మణుడు ఉండేవాడు. వేంకటాద్రి మాహాత్మ్యమును విన్నవాడై యాత్రను సంకల్పించి తిరుమల పర్వతశ్రేణి పాదభాగము చేరాడు. ఆ తిరుమల కొండ అద్భుత సౌందర్యము చూసిన విష్ణుశర్మకు నోట మాటరాలేదు. ఆహా ! ఇంతటి అద్భుతమయమైన ప్రదేశము కావటంచేతనే కదా! శ్రీమన్నారాయణుడు వైకుంఠం వదిలి, ఇక్కడే స్థిరనివాసమేర్పరచుకున్నాడు! అని తలచి నెమ్మదిగా కొండ ఎక్కడం



ప్రారంభించాడు. అంతా దట్టమైన అడవి, సరైన కాలిబాట కూడా లేదు. స్వామివారిని నిరంతరం స్మరిస్తూ నడవసాగాడు. చుట్టూ కనబడుతున్న వేంకటాద్రి అద్భుత సౌందర్యానికి విష్ణుశర్మ నోట మాట రావటం లేదు. ఎటు చూసినా పచ్చని చెట్లు, చక్కని పూలమొక్కలు... సంపెంగ... జాజి, మల్లె, చేమంతి... ఒకటేమిటి? అనేక రకాల పూలమొక్కలు చక్కని సువాసనలు వెదలజల్లుతున్నాయి. చెట్లమీద పక్షుల కిల కిలా రావాలు... కోయిలల పాటు... ఒకప్రక్క ఎంతో అందమైన సెలయేళ్ళు... ఆ సెలయేళ్ళలో దాహం తీర్చుకోవడానికై వచ్చిన అద్భుతమైన ఏనుగుల మంద... ప్రక్కనే సింహాల గుంపు... ఈ ప్రదేశం దివ్య ధామం కావడంచేత జాతి వైరం మరచి అన్ని జంతువులు కలిసి మెలిసి జీవిస్తున్నాయి. భక్తులు కాలిబాటలో నడుస్తున్నప్పుడు ఒక్కొక్కసారి పక్కనే వారితో పెద్ద పులులు కూడా సంచరిస్తుండేవి, కానీ శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహంచేత క్రూర మృగాలైనప్పటికీ అవి తమ సహజ గుణం మరచిపోయి సాధు జంతువులవలె తిరుగుతుండెడివి... ఆహా ! ఈ ప్రపంచంలోని అద్భుత దృశ్యాలన్నీ ఈ వేంకటాద్రి మీద తప్ప మరెక్కడా చూడటానికి సాధ్యం కాదు కదా... అని తలచాడు విష్ణుశర్మ. దివ్య మంగళ మనోహర మూర్తియైన ఆ జగన్మోహనుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే ఈ కొండమీద వున్నప్పుడు ఈ కొండ ఇంత అద్భుతంగా ఉండడంలో ఆశ్చర్యమేమున్నది అని పరిపరి విధాల తలుస్తూ, ఆనంద పడుతూ విష్ణుశర్మ ఆనంద నిలయానికి చేరాడు.

ఆనంద నిలయంలో స్వామిని దర్శించిన విష్ణు శర్మ ఆనందానికి అవధులు లేవు, ఓ శ్రీనివాసా! జగద్బంధూ! అనాథరక్షకా! నీకిదే నా నమస్కారములు. నీవు సకల కళ్యాణ గుణాకరుడవు, పురుషోత్తముడవు, విశ్వ భావనుడవు, సర్వాంతర్యామివి, మాయందు దయ ఉంచి నన్ను అనుగ్రహించు తండ్రీ! ఓ సంకర్షణా! విశాలాక్షా! జగన్నాయకా! జగన్నాథా!

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



ఓ పుండరీకాక్షా! దయచేసి ప్రసన్నుడవు కమ్ము అని ఎన్నో విధాల స్తుతించాడు.

విష్ణు శర్మ భక్తికి మెచ్చిన శ్రీమన్నారాయణుడు ఆనంద నిలయంలో తన నిజరూప దివ్య దర్శనం అనుగ్రహించాడు. విష్ణుశర్మతో "ఓయీ భక్తా! నీ భక్తిని సంతోషించాను, ఈ వేంకటాద్రి నాకు అత్యంత ప్రియమైన ప్రదేశము. శ్రీ వేంకటేశ్వరునిగా కలియుగాంతం వరకు నేనిచ్చటనే నివసిస్తాను.

ఎవరైతే ధర్మబద్ధ జీవనం సాగిస్తూ ఉంటారో, వారి బాధ్యత నేనే వహిస్తాను, ఈ తిరుమల మహా మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి నొందుతుంది. ముందు కాలంలో ఈ ప్రదేశమంతా దివ్య క్షేత్రంగా రూపొందుతుంది. రోజూ కొన్నివేలమంది నా భక్తులు, నా దర్శనార్థం రాగలరు. కాలక్రమేణా ఈ వేంకటాద్రి అనేక రూపాంతరాలు చెందుతుంది. నా ఆనంద నిలయం చుట్టూ ఇప్పుడున్న ఈ అద్భుత రమణీయ ప్రకృతి సంపద ముందు ముందు తగ్గిపోతుంది, అనేక కట్టడాలు నిర్మించబడతాయి, అనేక మార్పులు రాగలవు. ఎన్ని మార్పులు వచ్చినా ఈ తిరుమల పవిత్రత మాత్రం ఎప్పటికీ చెక్కు చెదర జాలదు. నాకు భక్తులలో బీదలని, ధనికులని తారతమ్యం లేదు, ఎవరైతే నన్ను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ తిరుమల చేరుకుంటారో వారికి అద్భుతమైన దర్శన భాగ్యాన్ని అనుగ్రహిస్తాను, పాప కర్మలు చేసెడివారైతే ఎంతటి ధనవంతులైనా నా దర్శనం లభించదు, భక్తితో ఇచ్చిన ఎంతటి స్వల్ప కానుకనైనా సంతోషంగా స్వీకరిస్తాను. వారి కష్టాలన్నిటినీ తక్షణమే కడతేరుస్తాను అని శ్రీనివాసుడు విష్ణు శర్మతో చెప్పి అంతర్ధానమైనాడు.

అప్పుడు విష్ణుశర్మ శ్రీ స్వామి దర్శనం కలిగినందుకు తన భాగ్యానికి ఎన్నో విధాల సంతోషించి తిరిగి, తన గ్రామం చేరుకుని, కలకాలం సుఖంగా జీవించి, చివరికి ముక్తిని పొందాడు.



శ్రీనివాసుడు దయా సముద్రుడు, ఎవరైతే తనని మనస్ఫూర్తిగా, ఆర్తితో కొలుస్తారో వారికి సర్వ సౌభాగ్యాలూ, సర్వ సంపదలూ, అనుగ్రహించి, ఎల్లవేళలా తానే తోడుగా ఉంటాడు, కలియుగంలో వేంకటేశ్వరుని మించిన దైవం గానీ, వేంకటాద్రికి మించిన పుణ్యక్షేత్రంగానీ లేదు.

జాగ్రదావస్థలో చతుర్ముఖ బ్రహ్మగానూ, స్వప్నావస్థలో విష్ణువుగానూ, సుషుప్తిలో రుద్రునిగానూ, తురీయ స్థితిలో పరమాత్మగానూ ఉన్నది ఈ పరబ్రహ్మమూర్తియే. ఈ స్వామికివే మన నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం అనిరుద్ధాయ నమః

అనిరుద్ధుడంటే అడ్డగించడానికి సాధ్యం కానివాడని అర్థము. భక్తులను రక్షించడానికై రాక్షసులను సంహరించినపుడు ఎవ్వరు ఎంత అడ్డగించినా అమిత పరాక్రమంతో వారిని సంహరించే శ్రీమన్నారాయణుడే అనిరుద్ధునిగా పిలవ బడుతున్నాడు.

ఈ విశ్వమంతా వ్యాపించియున్న శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరుడు. తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం ఈ నాలుగు దిక్కులు ఆ పరబ్రహ్మ మూర్తిలోని భాగమే. భూమి, ఆకాశాలు, సముద్రాలు, పర్వతాలు అన్నీ కూడా ఆ పరబ్రహ్మ మూర్తి స్వరూపాలే. అగ్ని, సూర్యుడు, చంద్రునిలలో ఉన్నది కూడా ఆ పరబ్రహ్మమూర్తి శ్రీమన్నారాయణుడే. ఈ జగత్తును సూర్యకిరణములచేత, బ్రాహ్మణుని వేదాధ్యయనముచేత, హవిస్సులను ఆజ్యముచేత, ప్రాణమును ప్రాణావస్థానముచేత, పంచభూతములను బ్రహ్మముచేత, ధర్మమును సత్కర్మలచేత



ప్రకాశింపచేస్తున్నది ఆ శ్రీమన్నారాయణుడే. తిరుమలపై శ్రీ వేంకటేశ్వరునిగా వెలసినది అతడే. అతడే వేంకటనాథుడు, వేంకటాధీశుడు, వేంకటనాయకుడు.

పూర్వకాలంలో విశ్వకీర్తి అనే మహాముని వేంకటాద్రిపై శ్రీ స్వామివారి అనుగ్రహం కోసం వేయి సంవత్సరాలు కఠోర తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై ఏమి వరము కావాలో కోరుకోమన్నాడు. అప్పుడు ఆ మునీశ్వరుడు ఆ స్వామిని అనేక విధాలా స్తుతించి, "స్వామీ! శ్రీమన్నారాయణా! శ్రీనివాసా! ఓ జగన్నాథా! ఓ జగద్రక్షకా నీకివే నా నమస్కారములు. సామాన్యుడనైన నేను ఎంతని స్తుతించగలను? నీవు పరాత్పరుడవు. నీవే పరంధాముడవు. పంచ మహాభూతాలు, సూర్యచంద్రులు, ప్రాణము, కాలము, మృత్యువు, యముడు, భూత భవిష్యత్ వర్త మాన కాలాలు, సమస్త జీవకోటి, నీ స్వరూపమే కదా దేవా, నీవే నిత్యుడవు, సత్యమైన నిత్యుడవు నీవే. నిన్ను కొలచినవారికి సర్వం అనుగ్రహించే ఆపద్బాంధుడవు నీవే. నీవే సర్వజ్ఞుడవు, నీవే సర్వ శక్తివి, సర్వాధారుడవు, మూల విద్యవు, నీవే విద్యావేద్యుడవు, విద్యా ధారకుడవు, విద్యా తీతుడవు, శ్రీనివాసునిగా ఈ వేంకటాద్రిపై భక్తులనుగ్రహించడానికై వెలసిన శ్రీమన్నారాయణుడవు, నీవే మోక్షము, మోక్ష సాధనము కూడా నీవే. ఈ జగత్తునంతా వ్యాపించియున్న సర్వేశ్వరుడవు నీవే అని పరిపరివిధాల స్తుతించాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు విశ్వకీర్తితో' ఓ మునీంద్రా, నీవు నన్ను చక్కగా గ్రహించితివి, ఈ విశ్వమంతా నేనే వ్యాపించియున్నాను. ఇంద్రాది అష్ట దిక్పాలకులలోని శక్తి, ఆదిత్యాది నవగ్రహములందలి శక్తి నావల్లనే కారణమగుచున్నవి. వేదాలలో సామవేదము నేనే, మాసాలలో మార్గశిరము నేనే, మునులలో వ్యాసుణ్ణి నేనే, ఇంద్రియములలో మనస్సు నేనే, అశ్వములలో ఉచ్చైశ్రవమును నేనే, గజములలో ఐరావతము నేనే,

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



ఆయుధములలో వజ్రాయుధమును నేనే. ఈ సమస్త జీవకోటిని సృష్టించునది నేనే, పోషించునది నేనే, లయకారకుడను కూడా నేనే" అని ఆ శ్రీమన్నారాయణుడు చెప్పగా, అప్పుడా మునీంద్రుడు ఓ స్వామీ! పురందరీకాక్షా! పరంధామా! ఈ కృతయుగంలో కాబట్టి నేను నిన్ను ప్రసన్నం చేసుకొనడానికి, ఈవిధంగా వేయి సంవత్సరాల తపస్సు చేయగలగడం సాధ్యపడింది. ముందు రాబోయే కలియుగంలో మానవులు అల్పాయుష్కులు, ఇటువంటి ఘోర తపస్సు చేసే శక్తి వారికి ఉండదు. కలియుగంలో ప్రకృతి కూడా వారికి ఇంతటి కఠోర తపస్సుకు సహకరించదు, నూరు సంవత్సరాలు జీవించడమే మహాభాగ్యం కాగలదు, అంతటి అశక్తులైనవారు నిన్ను ఏవిధంగా ప్రసన్నం చేసుకోగలరు తండ్రీ? దయచేసి వారిని అనుగ్రహించి ఏదైనా తేలికమార్గం సెలవీయవలసినది అని అనేకవిధాల ప్రార్థించాడు.

అంతట ఆశ్రితజన పక్షపాతి, భక్తసులభుడు అయిన శ్రీమన్నారాయణుడు "నాయనా! విశ్వకీర్తీ! నీ వేదన నాకు అర్థమైనది, నీవన్నట్లుగానే ముందు రాబోయే కలియుగంలో మానవులు అల్పాయుష్కులై ఉంటారు, ఇంతటి ఘోర తపస్సు ఆచరించే శక్తి కూడా ఉండదు, కాబట్టి నన్ను ప్రసన్నం చేసుకొనడానికి తేలికమార్గం అనుగ్రహి స్తున్నాను. ఎవరైతే జీవితంలో ఒక్కసారైనా ఈ వేంకటాద్రికి వచ్చి నన్ను దర్శించుకొంటారో వారికి సర్వసౌభాగ్యాలూ అనుగ్రహిస్తాను. కేవలం ఒక్కసారైనా ఈ పవిత్ర వేంకటాద్రిపై కాలుపెట్టి పుష్కరిణిలో స్నానమాచరించి, నా అంశారూపమైన శ్రీ వరాహస్వామివారిని దర్శించి, ఆనందనిలయంలో నన్ను దర్శించినవారికి సర్వసౌభాగ్యాలు, సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయి, వారి కోరికలన్నీ తీరుతాయి. ఈ వేంకటాద్రిలోని ప్రతి అణువణువులోను నేనుంటాను. ఈ సెలయేళ్ళు అన్నీ నేనే, ఇక్కడి ప్రతి మొక్క, ప్రతి పక్షి, ప్రతి శిల అన్నీ నా రూపాలే. భక్తులలో భక్తుడనై తిరుగుతుంటాను. నా దర్శనార్థమై వచ్చేవారందరిపై



నాకు అత్యంత ప్రేమ. వారి మధ్యనే అపరిచిత భక్తునిలాగా తిరుగుతూ, వారికి కావలసిన సౌకర్యాలన్నీ పర్యవేక్షిస్తూ నా దర్శనం సులభతరం చేస్తాను, కలియుగంలో నా అనుగ్రహం పొందడానికి ఇదే అత్యంత తేలికమార్గం" అని సెలవిచ్చి శ్రీమన్నారాయణులవారు అంతర్ధానమైనారు.

అంతట విశ్వకీర్తి స్వామిని మనస్సులో అనేక విధాల ప్రార్థిస్తూ, కలియుగంలో భూలోకవాసులు ఎంతటి అదృష్టవంతులో కదా అని తలుస్తూ తన ఆశ్రమానికి తిరిగి వెళ్ళాడు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం పురుషోత్తమాయ నమః

రజోగుణ ప్రధానమైన బ్రహ్మ రూపంలో సృష్టి చేసెడివాడు, సత్వగుణమైన ప్రధానమైన విష్ణు రూపంలో రక్షించెడివాడు, తమోగుణ ప్రధానమైన ఈశ్వర రూపంలో సృష్టినిలయం చేసేవాడు పురుషోత్తముడైన ఆ పరబ్రహ్మమూర్తియే. అతడే శ్రీమన్నారాయణుడు, భక్తి శ్రద్ధలతో ఎవరైతే ఈ పురుషోత్తముని ప్రార్థిస్తారో వారికి ఏవిధమైన భయము ఉండదు. ఏ కష్టాలు వారి దరి చేరవు. ఏ ఆపదలు వారికి కలగవు. ఎవరైతే ఎల్లప్పుడు ఆ వాసుదేవుని ప్రార్థిస్తారో వారికి శాంతి, భాగ్యము, కీర్తి, ఆరోగ్యము, సర్వైశ్వర్యాలు, సర్వ భాగ్యాలు, సర్వ సంపదలు, సర్వ పదవులు లభించగలవు. అన్నిటికి మించి బ్రహ్మానందము అనుభవము కాగలదు,

ఎల్లప్పుడూ ఆ స్వామినే స్మరించేవారి చెంతకు కోపము, లోభము, అసూయ, ద్వేషము, వంటి దుర్గుణాలు దరి చేరవు. ఎల్లప్పుడు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉంటారు, శరీరమంతా దివ్య తేజస్సుతో



ఉంటుంది. ఆ శ్రీనివాసుని నామస్మరణ అంతటి మహిమ కలది. ఒక్కసారి స్మరించినంత మాత్రానే కోటి జన్మల పాపాలను హరింపచేసే దివ్య సాధనం ఆ జనార్దనుని నామం.

పూర్వకాలంలో మగధ దేశంలో బ్రహ్మ గుప్తుడు అనే వైశ్యుడుండేవాడు, అతడు, అతని భార్య సుమతి శ్రీమన్నారాయణుని భక్తులై ఎల్లప్పుడు ఆ స్వామి నామస్మరణలోనే కాలం గడుపుతుండేవారు, వ్యాపారం దినదినాభివృద్ధి చెందింది, పిల్లలందరూ పెరిగి, పెద్దవారయ్యారు, కాలక్రమంలో ఆ దంపతులకు వయస్సు మళ్ళింది, దురదృష్టవశాత్తు అనేక అనారోగ్యాలు వారిని చుట్టు ముట్టాయి. పుత్రులకు కూడా వీరి ఎడల అనురాగం తగ్గింది. వీరిని ఎల్లప్పుడూ ఈసడించుకొనేవారు. కంటిచూపు కూడా పూర్తిగా మందగించి, తమ దురదృష్ట పరిస్థితికి బాధ పడుతూ అనుగ్రహించవలసిందిగా ఎప్పుడు, ఎల్లప్పుడూ ఆ శ్రీమన్నారాయణునినే ప్రార్థిస్తుండేవారు.

ఇంతలో ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడని వారికి తెలిసింది, బ్రహ్మగుప్తుని దంపతులిద్దరూ ఆ సాధువును దర్శించి, తమ బాధను వివరించారు, "స్వామీ! మీరు మహా పురుషులు, మీరు చూడని దివ్యక్షేత్రం ఉండదు, మీకు తెలియని వ్రతం ఉండదు, మీకు తెలియని మంత్రమూ ఉండదు, దయచేసి ఈ అనారోగ్యపు బాధల నుండి మాకు విముక్తి కలిగి, కుమారులకు మంచి బుద్ధి కలిగేలా ఏదేని ఉపాయం చెప్పవలసింది అని ప్రాధేయపడ్డారు, అప్పుడా సాధువు, ఒక్క క్షణం కళ్ళు మూసుకుని "నాయనలారా! మీ బాధలన్నీ నేను గ్రహించాను, మీ బాధలన్నీ తీరే మార్గం ఒక్కటే నాకు కనిపిస్తోంది, ఇక్కడకు పన్నెండు యోజనాల దూరంలో వేంకటాచలం అనే దివ్య క్షేత్రం ఉన్నది, సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే భక్తులను అనుగ్రహించడానికై శ్రీ వేంకటేశ్వరునిగా దివ్య మంగళ రూపంతో స్వయంవ్యక్త అర్చారూపంలో వెలిసాడు. అతనిది అద్భుత రూపం, అటు

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



స్త్రీ మూర్తి పోలికలు, ఇటు పురుషమూర్తి పోలికలు కూడా అతని రూపంలోనే ఉంటాయి. అతడే సర్వ మూర్తి స్వరూపుడైన శ్రీమన్నారాయణుడు. కొందరికి శివునిగా కనిపిస్తాడు, కొందరికి సుబ్రహ్మణ్యేశ్వరుడిగా కనిపిస్తాడు, మరికొందరికి శక్తి రూపిణిగా కనిపిస్తాడు, ఇలా అనేక రూపాలలో ఎవరు ఏ రూపంతో కొలిస్తే వారికి ఆ రూపంలో దర్శనమిచ్చే శ్రీమన్నారాయణుడు అద్భుత మూర్తిగా కొలువున్న ఆలయం గల ప్రదేశమే వేంకటాద్రి.

ఈ జగత్తులోని సర్వ దేవతా స్వరూపాలు అతనివే. ఆ పరమేశ్వరుడైన శ్రీనివాసునికి సూర్యుడు, చంద్రుడు, పంచ భూతాలు, కాలము, యముడు, అనే తొమ్మిదిమంది వేగులున్నారు, వారి ద్వారా ఈ ప్రపంచంలో ఏ మూల, ఏమి జరిగినా, క్షణంలో తెలుసుకుంటాడు, అంతటి మహా పురుషుడైన శ్రీ వేంకటేశ్వరుడు గల వేంకటాద్రి అద్భుత మహిమాన్విత ప్రదేశంగా దేవతలందరి చేత కొనియాడబడుతున్నది. ఈ దేవతలందరూ ఎల్లప్పుడూ ఆ వేంకటాద్రిపైననే నివసిస్తూ శ్రీ స్వామివారిని దర్శించే భక్తుల మనోభీష్టాలను గ్రహిస్తూ సత్వరం వాటిని తీర్చి ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహానికి పాత్రులగుచున్నారు. ఈ దేవతలందరూ శ్రీనివాసుని సేవించగోరి నిత్యం తిరుమల చేరే భక్తులను ఆదరించడానికి సర్వవేళలా ఎదురు చూస్తుంటారు, ఈ భక్తుల కోర్కెలన్నీ తీర్చి తద్వారా ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహం పొందడం వీరందరికీ అత్యంత ఆనందకరం. కాబట్టి అంతటి మహా పుణ్య ప్రదేశమైన వేంకటాద్రికి వెళ్ళి స్వామిని దర్శిస్తే మీ పూర్వ జన్మ పాపాలన్నీ తొలగిపోయి మీకు సర్వ సౌభాగ్యాలూ కలుగగలవు" అని ఆ సాధువు బ్రహ్మగుప్తుని దంపతులకు చెప్పాడు. ఇది విని వారు ఎంతో ఆనంద భరితులై త్వరిత కాలంలోనే వేంకటాద్రి చేరి ఆ స్వామిని దర్శించుకున్నారు. ఆ శ్రీ వేంకటేశ్వరుని దర్శనభాగ్యంచేత వారి బాధలన్నీ తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యవంతులై సర్వ భాగ్యాలూ కలిగినవారై చిరకాలం ఆనందంగా జీవించి, చివరికి



ముక్తిని పొందారు.

భక్తసులభుడవైన ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవుండ మాకిక భయమేలనయ్యా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం అధోక్షజాయ నమః

శ్రీ వేంకటేశ్వరుడు ఎన్నటికీ వన్నె తరగని చిద్విలాస మూర్తి. తరతరాలుగా స్వామిని ఎందరో భక్తులు ఎన్నో విధాల కొలుస్తున్నారు. అందరికీ అన్నీ అనుగ్రహించే అమృతమూర్తి శ్రీనివాసుడు. అధోక్షజుడు అంటే ఎప్పటికీ తరగనివాడు అని అర్థం. పవిత్ర తిరుమలపై వేంచేసిన శ్రీనివాసుడు భక్తులకు తరగని సంపద. ఎన్ని యుగాలైనప్పటికీ, ఎప్పుడూ తన భక్తులను అనుగ్రహించే ఆప్తబంధువు ఈ వేంకటేశ్వరుడే.

ఎన్నో జన్మల పుణ్య ఫలంచేతగానీ వేంకటాద్రిపై కాలుపెట్టే భాగ్యము లభించదు, ఒకవేళ పెట్టగలిగినా , ఎంతో పుణ్యఫలం ఉంటే తప్ప శ్రీనివాసుని దర్శన భాగ్యం లభించదు, వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరుడు అత్యంత దయామయుడు, పత్రము, పుష్పము, ఫలము, చివరికి కేవలం నీరు ఈవిధంగా ఆర్తితో ఏమి సమర్పించినా, ఎంతో సంతోషంగా స్వీకరించి సర్వభాగ్యాలనూ, సర్వ ఐశ్వర్యాలను అనుగ్రహించే సర్వమంగళ గుణ



ధాముడు శ్రీ వేంకటేశ్వరుడు.

వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరుడు ఆనంద స్వరూపుడు, సచ్చిదానంద మూర్తి. నిత్యానందమూర్తి అతడే. మనలోని అన్నమయ, ప్రాణమయ, విజ్ఞానమయ కోశముల నడుమ ఆనందమయ కోశములోనున్న ఆనందమూర్తి ఈ శ్రీమన్నారాయణుడే. ఈ జగత్తు యావత్తును ఆవరించి యున్న పరమేశ్వరుడు ఈ శ్రీనివాసుడే. ఈ పరబ్రహ్మ మూర్తి జగత్తు ఆరంభించకముందు పూర్ణుడే, ఆవిర్భవించిన తరువాత పూర్ణుడే, ఈ సృష్టి మొత్తం లయం అయిన తరువాత కూడా పూర్ణుడే.

శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళ స్వరూపాన్ని ఎల్లవేళల యందు దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, సిద్ధ సాధ్య, గరుడ, నాగ గణాలు, సప్త ఋషులు, మహామునులు అనేక దివ్య రూపాలలో నిత్యం సేవిస్తుంటారు. ఇంతటి మహా పురుషులందరూ ఈ వేంకటాద్రిపై ఎల్లప్పుడూ ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహానికై నివసిస్తుండడం వలన ఈ వేంకటాద్రి ఎల్లవేళలా అత్యంత తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుంది.

వేంకటాద్రిపై ప్రతీ ప్రదేశంలోనూ శ్రీనివాసుని ఉనికిని గ్రహించవచ్చును. భక్తులు నడుస్తున్నప్పుడు ప్రక్కనే గల వృక్షం గానీ, లేత మొక్కలు గానీ, చిన్ని చిన్ని పూవులు గానీ చక్కటి అనుభూతిని కలిగిస్తున్న సెలయేళ్ళు గానీ, కొండలమీద నుంచి జారుతున్న జలధారలు గానీ, వాటిలోని ప్రతీ నీటిచుక్క గానీ, ప్రక్కనే చెట్టుపై కూ కూ అంటున్న కోయల గానీ, మరో చెట్టుపై అందంగా ఉన్న చిలుకల గుంపు గానీ... ఇలా వీటన్నిటిలో శ్రీనివాసుని అంశ ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉంటుంది, అందులకే తిరుమలపై ఉన్నంత కాలం ఏ భక్తునికీ ఆకలీ, దాహము, తెలియవు. మనస్సు ఎటువంటి దురాలోచనలకూ మళ్ళదు. అనిర్వచనీయమైన ఆనందం, భక్తులందరిలో అంతర్లీనంగా అనుభవానికి వస్తుంది, ఈ పవిత్ర వేంకటాద్రిపై ఉన్నంత కాలము ఎటువంటి

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



రాగద్వేషాలు దరిచేరవు. భక్తులందరి శరీరాలు, ఎంతో శక్తివంతమై అత్యంత ఆనందమయంగా ఉండే ప్రదేశం ఈ సృష్టిమొత్తంలో వేంకటాద్రి ఒక్కటే.

కొన్ని వేల కోట్ల సూర్యుని మించిన దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న శ్రీ వేంకటేశ్వరుడు ఇక్కడ ఎల్లవేళలా నివసిస్తున్నందువలన ఈ వేంకటాద్రి ఎల్లప్పుడూ దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటుంది.

పూర్వకాలంలో వేదుడనే కుంటివానికి కొండపై నడుస్తున్నప్పుడు గాలి వీచగా, పక్కన నున్న చెట్టుపై నుంచి కేవలం ఒక ఆకు అతనికాలుమీద పడగానే కుంటితనం మాయమైంది. సంవిధుడనే గుడ్డివానికి కొండమీద జారుతున్న సెలయేటి ధారలో ఒక నీటి చుక్క తలమీద పడగానే కనుచూపు కలిగింది, నాధుడనే కుష్ఠువ్యాధితో బాధపడుతున్న ఒక భక్తునికి కొండపై నడుస్తున్నప్పుడు ఎక్కడినుండో గాలికి ఎగిరి వచ్చిన చిన్న పుష్పం శరీరం మీద పడగానే కుష్టువ్యాధి క్షణంలో మాయమై ఎంతో అందమైన దివ్య రూపం లభించింది. శ్రీ వేంకటేశ్వరుని తేజస్సు వేంకటాద్రిపై గల ప్రతి అణువణువునా భాసిస్తున్నందువలన ఇక్కడ ఎన్నో దివ్యానుభూతులు కలుగుతాయి. సర్వ రోగాలు క్షణకాలంలో నయమయ్యే దివ్య ప్రదేశం ఈ వేంకటాద్రి.

దయామయుడైన ఆ స్వామిని ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు. ఆ శ్రీమన్నారాయణుని ప్రసన్నం చేసుకొనడానికి ఏ యజ్ఞ యాగాదులూ అవసరం లేదు, కేవలం నామస్మరణమాత్రమే చాలు. స్వామికి భక్తులంటే వల్లమాలినప్రేమ. ఆ స్వామిని మిత్రునిగా భావించినవారికి మిత్రునిగానే మసలుతాడు. తనకొరకు తపించేవారికోసం తానే తపిస్తాడు, తన దర్శనం కోసం బాధపడే భక్తుల కోసం తన దర్శనం భాగ్యం కలిగించేంతవరకు తానూ బాధ పడుతాడు, ఇలా భక్తుల మనోభావాలన్నీ తానూ అనుభవించే విచిత్ర అద్భుతమూర్తి ఈ వేంకటేశ్వరుడు. ఓ స్వామీ నీవుండగా మాకింక దిగులేలనయ్యా!



సమస్త ప్రాణకోటినీ తన గర్భమునందే ఉంచుకుని, ఎటువంటి తారతమ్యాలు లేకుండా, సర్వకాల సర్వావస్థల యందు తల్లిలాగా రక్షించే పరమ దయాళువు శ్రీ వేంకటేశ్వరుడు.

మానవులందరినీ ముఖ్యంగా రెండు విషయాలు అమితంగా బాధిస్తాయి. ఒకటి కోరుకున్నవి లభించకపోవడం, రెండవది లభించినవి వదిలి పెట్టవలసి రావడం, ఈ రెండు స్థితులూ కేవలం అజ్ఞానం వలననే కలుగుతున్నాయి. ఇటువంటి అజ్ఞానాన్ని వదిలిపెట్టడానికి కావలిసిన జ్ఞానం ప్రసాదించగలిగేది ఆ శ్రీ వేంకటేశ్వరుడు ఒక్కడే. ఎవరైతే ఆ శ్రీనివాసుని సర్వవేళలా ప్రార్థిస్తూ ఉంటారో వారు ఈ రెండు స్థితులకు అతీతంగా ఉంటారు. అతీతంగా ఉండగలిగే జ్ఞానాన్ని ఆ శ్రీనివాసుడు అనుగ్రహిస్తాడు.

వేంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుని దర్శనంతో అజ్ఞానం నశించి దివ్య జ్ఞానం కలిగి, భక్తులందరూ అద్భుత ఆనందం పొందుతారు. ఓ శ్రీనివాసా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం నారసింహాయ నమః

తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని రక్షించడానికి నారసింహుని అవతరమెత్తి హిరణ్యకశిపుని సంహరించిన శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరుడు. తన భక్తులను రక్షించడానికి ఎల్లప్పుడూ సర్వ సన్నద్ధంగా ఉండేది ఈ సృష్టిలో శ్రీమన్నారాయణుడు ఒక్కడే. అతడే నిత్యుడు, అతడే సత్యము, అతడే అంతర్యామి, ఈ సృష్టిలోని సర్వ రూపాలలో ఉన్నది ఆ పరమేశ్వరుడే.

పూర్వకాలంలో వేదనిధి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ప్రతి సంవత్సరం ఒక్కసారైనా వేంకటాద్రి యాత్ర చేసి స్వామివారిని దర్శించేవాడు, వయసు మీద పడినప్పటికి, వృద్ధాప్యంలో కూడా ఎంతో ఓపిక చేసుకుని, తప్పక తిరుమల యాత్ర చేసేవాడు. కొంతకాలానికి అతడు తొంభైయ్యవ పడిలో పడ్డాడు. ఆ సంవత్సరం కూడా వేంకటాద్రి యాత్ర సంకల్పించి కాలినడకన తన ఊరి నుండి బయలుదేరాడు. కొన్ని రోజులు నడచిన



తరువాత వేంకటాద్రి పర్వత సమీపానికి చేరుకున్నాడు. తలపై చిన్న మూటతో చేతికర్ర సహాయముతో నెమ్మదిగా కొండ ఎక్కడం ప్రారంభించాడు. కాలిబాటలో అప్పుడప్పుడు కాలికి ముళ్ళు కుచ్చుకుని బాధించసాగాయి. కాని వేధనిధి ఆ శ్రీనివాసునే స్మరిస్తూ ఉండటం వలన ఎటువంటి బాధ ఉండటం లేదు. కానీ వయోభారంచేత కొంచెం అలసటగా అనిపించి మధ్య మధ్యలో కూర్చుంటూ మళ్ళీ లేచి నడక సాగిస్తున్నాడు.

ఇంతలో ఎక్కడినుండి వచ్చాడో ఒక చిన్న బాలుడు ప్రత్యక్షమయ్యాడు, తాతా ఆ మూట నాకివ్వు, నేనే మోసుకెళ్తాను, ఎందుకంత ఆయాస పడతావు అన్నాడు, అందుకు సమాధానం చెప్పేలోపలే మూట చేతికి తీసుకుని, కొండపైకి పరిగెత్తుతూ ఆ బాలుడు మాయమయ్యాడు... అయ్యో ఇదేమిటి ఎవరీ పిల్లాడు, ఇలా ఈ మూట పట్టుకుని వెళ్ళిపోయాడేమిటి... నాకున్న ఉత్తరీయాలు రెండు దాంట్లోనే ఉన్నాయి కదా... ఈ పిల్లవాడు ఆ మూటను ఎక్కడయినా పడేయగలడు, మళ్ళీ కనిపిస్తాడా అంటూ వేదనిధి పరిపరి విధాల చింతించాడు. అలా ఆలోచిస్తూ నెమ్మదిగా సాయంత్రానికి కొండపైకి చేరాడు... ఎదురుగా ఆ బాలుడు... చేతిలోని తన మూట... అమ్మయ్యా! నా మూట నాకు దక్కింది అనుకున్నాడు... ఆ బాలుడుని నాయనా నీ పేరేమిటి అన్నాడు... అందుకు ఆ బాలుడు చిరునవ్వు నవ్వి... శ్రీనివాసుడు అని చెప్పి క్షణంలో పరిగెడుతూ మాయమయ్యాడు... జరిగినదంతా వేదనిధికి అర్ధమయ్యింది... తనను అనుగ్రహించడానికి వచ్చిన వేంకటేశ్వరుడే ఈ బాలుడు... అయ్యో ముందుగా గ్రహించలేకపోతినే అని తలుస్తూ స్వామిని పరిపరివిధాల స్తుతిస్తూ ఆనంద నిలయం వైపుకు నడవసాగాడు.

ఆకాలంలో ఆనంద నిలయం సమీప ప్రదేశమంతా సంపెంగ చెట్లతో నిండి ఉండేది. మరోప్రక్క చక్కని జాజిచెట్లు ఉండేవి... పక్కనే పెద్ద చింత చెట్టు... అద్భుతమైన పూలమొక్కలు... వీటన్నిటిని చూసి ఆనంద

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



పడుతూ... వేదనిధి ఆనంద నిలయంలో అడుగు పెట్టాడు... శ్రీ స్వామివారి మూర్తిని చూసిన వేదనిధికి అంతులేని ఆనందం కలిగింది... స్వామిని అనేక విధాలుగా కీర్తించాడు... కొండమీదనే కొన్నిరోజులు ఆనందంగా గడిపి తిరిగి తన ఊరు చేరుకున్నాడు... కలకాలం సుఖంగా జీవించి చివరకు ఆ స్వామిలోనే ఐక్యమయ్యాడు.

ఆ స్వామి అంతటి భక్త పరాయణుడు, ఎల్లప్పుడూ భక్తుల హృదయాలలోనే నివసిస్తూ వారి యోగక్షేమాలు కనిపెడుతుంటాడు. ప్రత్యుపకారము ఆశించని సర్వ జనహితుడు శ్రీమన్నారాయణుడే అతడే జగత్కారకుడు, జగత్తు మొత్తానికి ఆధారం కూడా అతడే.

ఆత్మ స్వరూపుడైన శ్రీ వేంకటేశ్వరుడు, శరణుకోరి తనను ఆశ్రయించిన భక్తులను కనికరించి, ఆదరించి వారిపై కృపాకటాక్షధారలు కురిపిస్తాడు.

పూర్వ కాలంలో ఈ వేంకటాచల పర్వతంపై వృషభాసురుడు అనే రాక్షసుడు నివసించేవాడు. ఎంతో మనోహరమైన, అతి పవిత్రమైన ఈ ప్రదేశంలో తపస్సు చేసుకొనడానికి వచ్చిన మునిగణాన్ని అనేక విధాలుగా బాధిస్తూండేవాడు. ఇది తెలిసిన శ్రీమన్నారాయణుడు వారందరిని రక్షింపతలచి ఒకనాడు ఈ వేంకటాచలంపై వేటకు వచ్చాడు... సామాన్య వేటగానివలె కనిపిస్తున్న ఆ స్వామిని చూసి వృషభుడు, వచ్చినది సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని గ్రహింపక ఎన్నో దుర్భాషలాడి స్వామితోనే యుద్ధానికి పూనుకున్నాడు. ఆ యుద్ధం అతి భీకరంగా జరిగింది. వృషభుడు తనకు తెలిసిన మాయ విద్యలన్నీ ప్రదర్శించాడు, కానీ ఆ పురుషోత్తముని ఎదుట ఇవేమీ నిలువలేదు. చివరికి శ్రీమన్నారాయణుడు సహస్రకోటి సూర్య తేజోమయమైన తన చక్రాయుధాన్ని ఆ వృషభునిపై ప్రయోగించాడు. అనంతమైన ఆ శక్తిని ఎదుర్కోవడం ఆ వృషభునికి సాధ్యం కాలేదు, వచ్చినది సాక్షాత్తూ రాక్షసాంతకుడగు శ్రీమన్నారాయణునిగా గ్రహించాడు, ఒక్కసారి



బిగ్గరగా అరచి స్వామీ! పరంధామా! పురుషోత్తమా! వచ్చినది నీవని గ్రహించలేకపోతిని, నీ పరాక్రమం ముందు నేనెంతటి వాడను, నీవే ఈ విశ్వానికి ఈశ్వరుడవు, నీవే సమస్త కళ్యాణ గుణ మూర్తివి, ఈ విశ్వములోని శక్తి అంతయు నీదే కదా స్వామీ, ఎంతో ఘోర తపస్సుకు కూడా సాధ్యపడని నీ దర్శనం నాకు కలిగింది, ఇది నా పూర్వజన్మ సుకృతం తప్ప మరొకటి కాదు, ఇక నా వద్ద బలము లేదు, నీ చక్రాయుధం నన్ను సంహరించక మానదు, తండ్రీ! ఆర్త జనపరాయణా! నీవు భక్తులపాలిటి కామధేనువు కదా! నా యందు దయవుంచి నా చిన్న కోరిక తీర్చవలసింది. నా మరణానంతరం ఈ కొండ వృషభాచలం అనే నామంతో ప్రసిద్ధం అయ్యేలా నన్ను అనుగ్రహించవలసింది. ఇంతకుమించి నాకు వేరేమి కోరికలు లేవు, అని వేడుకున్నాడు.

అందుకు శ్రీమన్నారాయణుడు 'ఓ వృషభాసురా! అటులనే అగుగాక! నీవు కోరినట్లుగానే ఈ వేంకటాద్రి వృషభాద్రి అనే నామంతో కూడా ప్రసిద్ధం కాగలదు. అని సెలవిచ్చాడు, అంతట సుదర్శన చక్రాయుధంచే సంహరించబడిన వృషభాసురుడు స్వామిలో ఐక్యమొందాడు. అప్పటినుండి అతనికి కోరిక మేరకు ఈ పవిత్ర వేంకటాద్రి వృషభాద్రి అనే నామంతో కూడా పిలవబడుతున్నది.

నిరాకారుడు, నిష్కళంకుడు, నిరంజనుడు, నిత్యానందుడు, నిత్య ప్రకాశుడు, నిత్య సత్యుడు, అయినటువంటి ఆ శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన ఈ వేంకటాద్రి మహామహిమాన్వితమైనది. ఓ స్వామీ! ఇంతటి దయామయ పరబ్రహ్మ మూర్తివి నీవు మాకు ఇంత అందుబాటులో ఉండగా మాకు ఇంక వేరేమి కావాలి తండ్రీ! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం అచ్యుతాయ నమః

మానవులందరూ అనేక కర్మల ద్వారా పాప పుణ్యాలను కూడ గట్టుకుని మరల, మరలా జన్మలెత్తుతారు, మళ్ళీ కర్మలను చేస్తూ ఇలా ఈ జన్మ జన్మల కర్మబంధం నుండి విడివడలేరు. కర్మను చేయడం ద్వారా ముక్తి కలగదు. ముక్తి కేవలం జ్ఞానం ద్వారానే లభిస్తుంది, అంతటి జ్ఞానం శ్రీమన్నారాయణుని సేవించుట ద్వారానే లభ్యమవుతుంది.

నచ్యుతః అచ్యుతః అని చెప్పబడింది. తనను శరణు పొందిన వారిని విడవకుండా రక్షించేవాడు అచ్యుతుడు, ఈ అచ్యుతుడే శ్రీ వేంకటేశ్వరుడు. భక్తులయందు ఏ తారతమ్యం లేకుండా తనకు వేడినదే తడవుగా వెనువెంటనే రక్షించే ఆపద్భాంధవుడు శ్రీనివాసుడు.

శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు రకరకాల తీరులలో ఉంటారు. కొందరు ఐశ్వర్యాన్ని కోరి వస్తారు. కొందరు వారి వారి ఉద్యోగాలలో పై మెట్టు కోసం వస్తారు, మరికొందరు వారు



బాధపడుతున్న అనారోగ్యం నుండి విముక్తి కోరి వస్తారు, కొందరు ఉన్నత చదువులను ఆశించి వస్తారు, మరికొందరు సద్బుద్ధి ప్రసాదించమని వస్తారు, కేవలం కాలక్షేపానికి వచ్చేవారు కూడా కొందరుంటారు. ఇలా రకరకాలైన భక్తులు నిత్యం స్వామివారి దర్శనార్థమై వేంకటాద్రి చేరుకుంటారు. ఎటువంటి కోరికలు కోరి వచ్చినా ఈ వేంకటాద్రిపై కాలు పెట్టడమే ఎన్నో జన్మల పుణ్యఫలం కాబట్టి వచ్చిన వారందరూ శ్రీవారికి ఆప్తులే. తెలిసి అడిగినా, తెలియక అడిగినా, ఏం కావాలో తెలియక ఏమీ కోరకపోయినా, భక్తుల అవసరాలన్నీ ఆ శ్రీనివాసునికి తెలిసినట్లు ఈ విశ్వంలో మరెవ్వరకీ తెలియదు. అందుకే భక్తులు సర్వ వేళలా సంతోషంగా ఉండేలా సర్వం అనుగ్రహించే అమృతమూర్తి ఈ ఆనందనిలయుడు.

సకల కారణములకు కారణమైనటువంటి వాడును, సర్వ గుణ సంపన్నుడును, సకల ఐశ్వర్యములు గలవాడును, తమ సర్వ దేవతల చేత సర్వదా ధ్యానింప బడుచున్నవాడును అయిన శ్రీ వేంకటేశ్వరుడు వెలసిన ఈ వేంకటాద్రి ఎంతో పుణ్యప్రదమై భాసిల్లుతున్నది.

వేంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుడు, సాక్షాత్తూ ప్రణవస్వరూపుడైన శ్రీమన్నారాయణుడే. ఓంకారము మహా మహిమాన్వితమైనది. దేనియందు కాలత్రయము, దేవతాత్రయము, లోకత్రయము, వేదత్రయము స్థితములై వున్నవో అట్టి మహాజ్యోతి స్వరూపమే ఓంకారము. ఎవరైతే వేంకటాద్రిపై ఓంకారాన్ని ధ్యానం చేస్తారో వారికి సహస్ర అశ్వమేధయాగాలకంటే కూడా ఎక్కువ ఫలం లభిస్తుంది. ఆ శ్రీమన్నారాయణుని స్వరూపమైన ఓంకారము, ఒక్క సారి ఉచ్చరించిన మాత్రమే సర్వరోగాలు నశించి, సర్వ ఐశ్వర్యాలు లభించగలవు. వేంకటాద్రి వేంకటేశ్వరుడే ఓంకార స్వరూపుడు.

తిరుమలలో కళ్ళు మూసుకుని ప్రశాంతంగా ధ్యానిస్తే ఓంకారం మనసులో ప్రతిధ్వనిస్తుంది. శ్రీ వేంకటేశ్వరుని తక్షణం ప్రసన్నం

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



చేసుకొనడానికి ఓంకారాన్ని మించిన అమృత శబ్దం మరొకటి లేదు. సృష్టిలోని అన్ని మంత్రములూ ఓంకారం నుండి ఉద్భవించినవే. ఈ ఓంకారమే శ్రీమన్నారాయణుని సూక్ష్మాష్టాక్షర మంత్రము. ఇదే అష్టాత్మకమై అష్ట విధములగుచున్నది. అకారము ప్రథమాక్షరము. ఉకారము ద్వితీయాక్షరము. మకారము తృతీయాక్షరము, బిందువు తురీయాక్షరము, నాదము పంచమాక్షరము, కళ ఆరవ అక్షరము, కళాతీతము సప్తమాక్షరము, తత్పరము అష్టమాక్షరము అగుచున్నది. జనన, మరణ దుఃఖములకు హేతువైన సంసార సాగర బంధములనుండి తరింపచేసే అద్భుత మంత్రము ఈ ఓంకారమే.

మానవులు సంపాదించినవలసినవిగా చెప్పేటటువంటి ధర్మ, అర్ధ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థములలోను చివరిదైన మోక్షము మాత్రమే శాశ్వతము, మిగిలినవేవి శాశ్వతములు కావు. ఈ మోక్షము కేవలము భగవదనుగ్రహముతోడనే లభించును. కావున మానవులందరు శ్రీ వేంకటేశ్వరుని శరణు వేడి ముక్తిని సాధ్యము కావించుకొనవలెను.

శ్రీ వేంకటేశ్వరుడు పురుషోత్తముడు, అతడు సర్వ స్వతంత్రుడు, అతని వలననే సృష్టి, స్థితి, లయములు, నియమ నియంత్రణలు, జ్ఞానము, విముక్తి, ఆనందము, మానవులకు లభించును. అజ్ఞానులకు జ్ఞానమును, జ్ఞానులకు విముక్తిని, విముక్తులకు శాశ్వత ఆనందమును ప్రసాదించేది ఆ పురుషోత్తముడొక్కడే.

ఎవరియందుండి ఈ సర్వసృష్టి ఉద్భవించుచున్నదో ఎవరు మొక్కలు, వృక్షము, జంతువులు, పక్షులు, మొదలగు చేతన, అచేతనులలో ప్రవేశించి వాటి కార్యములను నియంత్రించునో, తనకంటే ఉత్తముడు, ఉన్నతుడు లేనివాడెవడో, ఎవరిని మహాయోగులు సైతము సంపూర్ణముగా తెలుసుకొనలేరో, ఎవరి అనుగ్రహమునకై సర్వ దేవతాగణము వేయి కన్నులతో నిత్యము నిరీక్షించుచున్నదో, ఎవరి శక్తి సర్వ శక్తులయందు



నిమిళితమై ఉన్నదో ఎవని తేజస్సుచే జగమంతయూ ప్రకాశించుచున్నదో ఆది మధ్యాంతము లేనివాడెవ్వడో, అనంత రూపములు, అనంత గుణములతో భాసిల్లేవాడెవడో అతడే పురుషోత్తముడు, అతడే శ్రీ వేంకటేశ్వరుడు. నిత్య జ్ఞాన స్వరూపుడైన పరబ్రహ్మమూర్తి అతడే.

శ్రీమన్నారాయణుని రూపము అప్రాకృతము. జ్ఞానానంద పూర్ణమైన ఆ దివ్యమంగళ రూపము అనంతము. వేంకటాద్రిపై వేంకటేశ్వరుడు, ఆనంద నిలయంలో ఉన్నట్లు కనిపిస్తున్నా నిజానికి, వేంకటాద్రి మొత్తము, ఈ జగత్తు మొత్తము, తానే వ్యాపించి యున్నాడు.

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవు దివ్య మంగళ స్వరూపుడవు, నీవు భక్తుల పాలిటి కామధేనువు, ఆశ్రిత జన రక్షకుడవు, సర్వ మంగళ గుణాకరుడవు నీవే. ఓ శ్రీనివాసా ! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం జనార్ధనాయ నమః

సర్వకాల సర్వావస్థలయందును తన భక్తులను కష్టాలనుండి తప్పించి రక్షించే అమృతమూర్తి శ్రీనివాసుడు, అతడే జనార్దనుడు, అంటే ఏ జనులైతే తన భక్తులను బాధ పెడుతున్నారో, కష్టాల పాలు చేస్తున్నారో వారిని అంతమొందించేవాడు, వారిని శిక్షించేవాడు, వారిని సంహరించేవాడు జనార్దనుడు. నారసింహావతారంలో హిరణ్యకశిపుని సంహరించాడు, శ్రీకృష్ణావతారంలో అనేకమంది రాక్షసులను సంహరించి తన భక్తులను రక్షించిన శ్రీమన్నారాయణుడే జనార్దనుడు ఇతడే తిరుమలేశుడు.

వేంకటాద్రి వేంకటేశ్వరుడు తన భక్తులను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడతాడు. ఈ బ్రహ్మాండంలో వారు ఎక్కడ, ఏ రూపంలో వున్నా తక్షణం ఆదుకునే అమృతమూర్తి అతడే.

ఈ వేంకటాద్రి అనేక విచిత్ర మహిమలు కలది. స్వామిని సేవించగోరి నిత్యం వచ్చే భక్తులందరికి ఈ మహిమలన్నీ అనుభవైకమే. ఈ పవిత్ర తిరుమలపై ప్రకృతి కూడా ఎంతో విభిన్నంగాను, విచిత్రంగాను



ఉంటుంది, ఇంతలోనే వర్షం... అంతలోనే ఎండ... కాసేపు తీవ్రమైన చలిగాలి... ఈ వేంకటాద్రిపై పగలు రేయిలా అనిపిస్తుంది... రేయి పగలులాగా అనిపిస్తుంది, ఒక్కొక్కసారి పగలు, రేయి తెలియక కాల నిర్ణయమే తెలియదు, ఈ అద్భుత కొండపై ఒక్కొక్కసారి సూర్యుడు చల్లదనాన్ని ఇస్తాడు, చంద్రుడు వెచ్చదనం కలిగిస్తాడు, అన్ని ఋతువులు ఏకకాలంలోనే ఉండే అద్భుత ప్రదేశం ఇదియే. కొన్ని చెట్లకు ఆకులు రాలుతుంటాయి, మరికొన్నింటికి పూలు పుష్పిస్తుంటాయి, మరికొన్ని పూర్తిగా ఫలములతో నిండి ఉంటాయి, సూర్యుడు తీక్షణంగా ఉన్నప్పటికి ఎంతో ఆహ్లాదరకంగా ఉంటాడు, కేవలం ఎడారులలో మాత్రమే పెరిగే మొక్కలు, సముద్ర గర్భంలో కనపడే మొక్కలు, ఈ కొండపై కనిపిస్తాయి... ఈ అద్భుతాలన్నీ శ్రీమన్నారాయణుని మహిమలు తప్ప మరొకటి కావు.

పరబ్రహ్మమూర్తియైన శ్రీమన్నారాయణుడు సచ్చిదానంద స్వరూపుడు, బ్రహ్మానందమునకు మించినది మరొక్కటి లేదు. ఈ బ్రహ్మానంద స్వరూపము శ్రీనివాసుడే మానుషానందానికి నూరు రెట్లు మానుష గంధర్వానందము, దీనికి నూరు రెట్లు దేవ గంధర్వానందము, దీనికి నూరు రెట్లు చిరలోక పితరానందము, దీనికి నూరురెట్లు అజానజ దేవానందము, దీనికి నూరు రెట్లు కర్మ దేవానందము, ఇంతకు నూరు రెట్లు అయినది ఇంద్రానందము, ఇంద్రానందమునకు నూరు రెట్లు బృహస్పతి ఆనందము, దీనికి నూరురెట్లు ప్రజాపతి ఆనందము, ప్రజాపతి ఆనందానికి నూరు రెట్లు అయినదే బ్రహ్మానందము, ఇదే పరబ్రహ్మ స్వరూపము. ఇదే శ్రీమన్నారాయణుడు. శ్రీ వేంకటేశ్వరుడు. ఏ పరబ్రహ్మ మూర్తిని స్మరించినంతమాత్రముననే సర్వబాధలూ నశించి, సర్వ శుభములు కలుగుతాయో అట్టి మంగళ ప్రదుడే శ్రీ వేంకటేశ్వరుడు. అంతటి మంగళ రూపుడే ఈ శ్రీనివాసుడు.

ఆనంద నిలయంలోని స్వామి దర్శనం కోసం సర్వప్రాణికోటి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూసే దివ్యప్రదేశం వేంకటాద్రి. శరీరమంతా

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



కన్నులున్న ఇంద్రుడు ఈ వేంకటాద్రి మహిమను సహస్ర వంతు కూడా దర్శించలేకపోయాడు, వేయి నాలుకలున్న ఆదిశేషునికి కూడా ఈ వేంకటాచల మహిమను సహస్ర వంతు వర్ణించకూడా సాధ్యం కాలేదు, మహాజ్ఞానులైన సప్త ఋషులు కూడా ఈ పర్వత రాజ మహిమను సంపూర్ణంగా అర్థం చేసుకొనలేకపోయాడు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీనివాసునిగా వెలసి స్థిరనివాసం ఏర్పరచుకున్న ఈ వేంకటాద్రి మహిమ అనంతమైనది. వేంకటాద్రిపై చేసే ఏ పుణ్య కార్యమైనా కోటిరెట్లు అధిక ఫలమీయగలదు. ఈ కొండపై ఉన్నప్పుడు ఒక్కసారి శ్రీమన్నారాయణుని స్మరిస్తే కోటి సార్లు జపించిన పుణ్య ఫలం కలుగుతుంది. ఇక్కడ చేసే ఏ దానమైనా కోటిరెట్ల ఫలం ఈయగలదు, ఈ కొండపై ఏ పుణ్యతీర్థంలో స్నానం చేసినా, ఈ విశ్వంలోని ముక్కోటి తీర్థాలలో స్నానం చేసిన పుణ్యఫలం లభిస్తుంది.

ప్రతీ మానవుడు, జీవితంలో ఒక్కసారైనా వేంకటాద్రి యాత్ర సంకల్పించి శ్రీవారిని దర్శించుకుని ధన్యం కావలెను.

శ్రీనివాసుని అనుగ్రహంతో వెనుక జన్మలలోని సంచిత కర్మలన్నీ పూర్తిగ దహించబడతాయి. వచ్చే జన్మలలో అనుభవానికి వచ్చే ఆగామి కర్మఫలాన్ని మనకు ఏ మాత్రం అంటకుండా దూది పింజలకంటే తేలికగా ఉండేలా అనుగ్రహిస్తాడు శ్రీనివాసుడు. ప్రస్తుతం అనుభవిస్తున్న ఘోర ప్రారబ్ధకర్మ ఫలాలను సహితం దివ్య సుఖ ప్రారబ్ధంగా మార్చేది ఆ శ్రీనివాసుడొక్కడే. ఓ శ్రీమన్నారాయణా! శ్రీ వేంకటేశ్వరా నీకివే మా నమస్కారములు. మమ్ములను సదా రక్షించు తండ్రీ! నీవు తప్ప మాకు అన్యథా శరణం నాస్తి. నీవే మా కల్పతరువు, నీవే మా ఆప్తుడవు, ఓ జగన్నాయకా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*



# ఓం ఉపేంద్రాయ నమః

మానవులు చేసిన కర్మలను బట్టి వారికి ఉత్తమగతులు, ఉత్తర జన్మలు ఇచ్చే శ్రీమన్నారాయణుడే ఉపేంద్రుడు, పుణ్యకర్మలు చేసిన వారికి ఉత్తమమైన జన్మ లభిస్తుంది, పాపకర్మలు చేసినవారు మరుజన్మలో పశువులు, పక్షులుగా జన్మిస్తారు. హీనాతిహీనమైన కర్మలు చేసినవారు, మరుజన్మలో క్రిమి కీటకాదులుగా జన్మిస్తారు ఈవిధంగా జీవుల కర్మలననుసరించి వారి వారికి ఉత్తర జన్మలను ఇచ్చేవాడు శ్రీమన్నారాయణుడే, అతడే శ్రీ వేంకటేశ్వరుడు.

ఎవడు భూమిపైన, భూమిలోపల ఉంటాడో తనలో ఉన్నప్పటికీ ఎవనినీ భూమి ఎరుగదో, ఎవని శరీరమే ఈ భూమియో, లోపల ఉంటూనే ఈ భూమిని నియంత్రి స్తున్నవాడు ఎవడో అతడే అంతర్యామి.

ఎవరైతే ఎల్లవేళలా ఆ శ్రీనివాసునే మనస్సులో ప్రార్థిస్తూ, అర్చిస్తూ ఉంటారో వారికి సామీప్య, సారూప్య, సాయుజ్యాలు లభ్యమవుతాయి.

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



సాయుజ్య స్థితిని చేరినవారికి జన్మరాహిత్యం కలుగుతుంది. ఇక ఉత్తర జన్మలు ఉండవు.

ఈ బ్రహ్మాండములో అన్నిటికంటే ముందుగా ఉన్నది తిరుమలయే. శ్రీమన్నారాయణుడు ఈ సృష్టిలో ముందుగా సృష్టించిన ప్రదేశం ఈ వేంకటాద్రియే. ఇక్కడినుండే సృష్టిమొత్తం ఆవిర్భవించింది. సృష్టిమొత్తం ముందుగా నీటిలోనే ఉండేది. ఆ తరువాత కాలంలో ఆ నీరే సప్త సముద్రాలుగా విడిపోయింది. సృష్టి ప్రారంభంలో తిరుమలయే ముందుగా ఉన్నదనడానికి నిదర్శనంగా వేంకటాద్రిపై ఏర్పడిన సహజ శిలాతోరణం కనిపిస్తుంది. శ్రీవారి ఆలయానికి సమీపంలోనే గల ఈ సహజ శిలా తోరణం అతి ప్రాచీనమైనది.

ప్రళయకాలంలో నీటిలో మునిగివున్న వేదాలను పైకి తీసుకువచ్చిన శ్వేత వరాహమూర్తి వున్నది ఈ తిరుమలపైననే. శ్రీమన్నారాయణుని దివ్య రూపమైన వరాహ స్వామిని ముందుగా దర్శించి, తరువాతనే శ్రీనివాసుని దర్శించడం నేటికీ వస్తున్న సాంప్రదాయం.

శుక్రవార అభిషేక సమయంలో స్వామివారి దివ్యరూపాన్ని కనులారా దర్శించవచ్చును. స్వామివారి నేత్రాలు సమదృష్టితో వుంటాయి. పెదవులపై చిరునవ్వు, సొగసైన నాసిక, భుజాలపైకి అద్భుతంగా జాలువారే శిరోజాలు, సిగలో నెలవంక, నునుపైన చక్కని చుబుకం, విశాల వక్షస్థలం. వక్షస్థలంలో కుడివైపున శ్రీమహాలక్ష్మి సుఖాసీనురాలై మూలమూర్తిలోనే భాగంగా దర్శనమిస్తుంది. యజ్ఞోపవీతం, నాలుగు వరుసల హారాలు స్వామి మూలమూర్తిలో దర్శించవచ్చు. వీపుమీద చాలా కాలం బాణాల పొదిని ధరించడం వలన ఏర్పడిన చారలు, భుజాలకు నాగాభరణాలు, క్రింద కుడిచేయి వరద ముద్ర, ఎడమచేయి కటిపై ఆలవోకగా ఆనించి వున్న అద్భుతమూర్తి శ్రీ వేంకటేశ్వరుడు, పై రెండు చేతులలో శంఖ చక్రాలు ధరించిన పరబ్రహ్మమూర్తి... ఆహా! ఎంతటి దివ్యమంగళ మనోహరరూపునివయ్యా శ్రీవేంకటేశ్వరా! అతి పురాతన కాలంలో



వేంకటాద్రిపై అంతా గిరిజనులే ఉండేవారు. శ్రీ స్వామిని వారందరూ తమలో ఒకరిగా చూసుకునేవారు. ఆ కాలంలో స్వామి స్వర్శామూర్తి. ఆ గిరిజనులలో కొందరు స్వామితో కబుర్లు చెప్పేవారు, మరికొందరు స్వచ్ఛమైన తేనె తాగమని ఇచ్చేవారు, మరికొందరు స్వామితో ఆడుకొనేవారు, కొందరు పిల్లలు స్వామి విగ్రహానికి అనుకుని కూర్చునేవారు. ఆ అరణ్యంలో దొరికే రక రకాల పళ్ళు తినమని ఆ స్వామి ముందుంచేవారు, మరునాడు వచ్చినపుడు ఆ ఫలాలన్నీ మాయమవడంతో ఆ స్వామి తాము సమర్పించినవన్నీ తీసుకున్నాడనే సంతోషంతో మరలా రెట్టింపు ఉత్సాహంతో మరిన్ని అద్భుతమైన, మధురమైన ఫలాలు తెచ్చేవారు. తమ కష్టసుఖాలన్నీ స్వామికి వెళ్ళబుచ్చుకునేవారు, ఏ వేద విద్యలూ తెలియను అమాయక భక్తులు వారు, ఏ ఆర్ష విజ్ఞానము లేనప్పటికీ, స్వచ్ఛమైన మనస్కులు. శ్రీమన్నారాయణునికి వారి సేవలన్నీ ఎంతో ఆనందం కలిగించేవి. ఆ రోజుల్లో స్వామికి ఇప్పటి ఆలయం లేదు, కేవలం ఆకాశమే పైకప్పు, అదే గొడుగు పట్టినట్లుగా అనిపించేది.

తర తరాలుగా ఆ మహనీయమూర్తి, తనను నమ్ముకున్న వారిని ఆదరిస్తున్నాడు, బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తున్నాడు, కొండలరాయుని మనసారా కొలచినవారికి కొండంత అండ.

ఏ పేరుతో పిలిచినా పలికే తిరుమలరాయుడు భక్తులపాలిటి కొంగు బంగారం. హిరణ్యగర్భుడు, పద్మగర్భుడు, శ్రీగర్భుడు, విశ్వమూర్తి, విశ్వపతి, విశ్వాత్మకుడు, శ్రీధరుడు, శ్రీకరుడు, శ్రీనివాసుడు, ఈశుడు, పరమేశ్వరుడు ఇలా ఏ నామంతో పిలచినా పలికే పరబ్రహ్మ మూర్తి ఆ వేంకటేశ్వరుడు. ఓ శ్రీనివాసా! ఓ శ్రీమన్నారాయణా! ఓ వేంకటాచల చలపతీ! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం హరయే నమః

భక్తుల దుఃఖములను హరించేవాడు కాబట్టి శ్రీమన్నారాయణుడు 'హరి' అని పిలవబడుతున్నాడు. తన భక్తుల సర్వపాపాలను హరించే ఈ శ్రీహరియే శ్రీ వేంకటేశ్వరుడు.

పూర్వకాలంలో ఒకసారి నారదమునీంద్రులవారు ఆకాశ మార్గాన నారాయణ నామం జపిస్తూ మార్గ మధ్యంలో ఎంతో రమణీయంగా ఉన్న వేంకటాద్రిని చూసి ముచ్చటపడి శ్రీనివాసుని దర్శించాలని తలచాడు. వేంకటాద్రి చేరి, ఆ అద్భుత రమణీయ ప్రకృతి సంపద చూసిన నారదుల వారి ఆనందానికి అవధి లేదు. అప్పుడు నారదుల వారు ఈ విధంగా తలచారు, ఆహా ఎంతటి అద్భుత ప్రదేశము ఈ వేంకటాద్రి. ఎన్ని సార్లు వచ్చినప్పటికీ, వచ్చిన ప్రతిసారి మునుపటి కంటే కూడా ఎక్కువ శోభను సంతరించుకుంటున్నది ఈ వేంకటాద్రి, ఇంతటి అద్భుత ప్రదేశము ముల్లోకముల యందు లేదు కదా, ఈ మానవులు ఎంతటి అదృష్టవంతులో



కదా! దేవతలు కూడా నోచని దివ్య సంపద వీరి చెంతనే ఉన్నది, ఎంతో దూర లోకాలలో ఉన్న దేవతలు కూడా స్వామి దర్శనార్థమై ఈ భువికి రావలసిందే కదా!

ఈ మానవులు చేసుకున్న పుణ్యఫలం కొద్దీ ప్రకృతి మొత్తం భీతిల్లేటంతటి తపస్సు చేస్తే కానీ, దర్శన భాగ్యం అనుగ్రహించని శ్రీమన్నారాయణుడు ఈ మానవులకు కేవలం నామస్మరణ చేతనే అతి చేరువలో వారికి తన దర్శన భాగ్యం అనుగ్రహిస్తున్నాడు.

ఈ కొండపైనున్నవన్నీ శిలలని ఈ మానవులు భ్రమిస్తున్నారేమో! ఘనీభవించిన అమృత ధారలే అవి. శ్రీమన్నారాయణుడు శ్రీ వేంకటేశ్వరునిగా ఈ కొండపై వెలసినపుడు దేవతలందరూ అమృతవర్షం కురిపించారు. పూల వృష్టి కురిపించారు. ఆనాటి అమృతధారలే కొండపై ఏరులుగా పారి, కాలక్రమాణ ఘనీభవించి, ఇలా శిలలుగా మారాయి. ఇదంతా అమృత ఐశ్వర్యాలు తప్ప మరొకటి కాదు. అందువలననే ఈ తిరుమల వేంకటాద్రిగా పిలబడుతున్నది. ఆనాడు దేవతలు కురిపించిన పుష్ప వృష్టి ఫలితంగా ఈ తిరుమల గిరులన్నీ అద్భుత పుష్ప సంపదతో విరాజిల్లుతున్నాయి. దేవలోకంలో మాత్రమే లభ్యమయ్యే పూలమొక్కల జాతులన్నీ భూలోకంలో కేవలం ఈ వేంకటాద్రిమీదనే చూడవచ్చును. శ్రీ స్వామివారిని పూలతో అభిషేకించడానికే ఆ సమయంలో కుబేరులవారు, ఇంద్రుడు, యముడు, అగ్ని, వాయువు ఆదిగా గల అష్ట దిక్పాలకులు, నవగ్రహాది దేవతలు, చతుర్ముఖ బ్రహ్మ, రుద్రుడు, ఇలా దేవతలందరూ వారి వారి స్వస్థలాలలో పెంచుకుంటున్న పూలమొక్కల నుండి పూలను తెచ్చి శ్రీమన్నారాయణుడు ఇక్కడ వెలసినపుడు పూల వర్షం కురిపించారు, అందువలననే ఇప్పటికీ ఈ వేంకటాద్రిపై అద్భుత పుష్పాలన్నీ భక్తులకు కనిపిస్తాయి. ఆ పుష్పాలనుండి వచ్చే దివ్య సుగంధ పరిమళాల వలన వేంకటాద్రిపై ఉన్నపుడు భక్తులందరి శరీరములు దివ్య అనుభూతులకు

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



లోనవుతాయి. వాటి అద్భుత మాహాత్మ్యమువలన సర్వరోగాలు నశిస్తాయి... ఈవిధంగా నారదుల వారు వేంకటాద్రి దివ్య వైభవాన్ని తలుస్తూ శ్రీమన్నారాయణుని వద్దకు చేరుకున్నారు. దివ్య మంగళ రూపంలో వున్న శ్రీనివాసుని అనేక విధాల స్తుతించారు, 'ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! నీవు ఆశ్రిత వత్సలుడవు, భక్త సులభుడవు, నీవే అంతర్యామివి, నీ అనుగ్రహానికై సమస్త ప్రాణికోటి ఎదురు చూస్తున్నది కేవలం నీ దర్శన భాగ్యం కోసమే ఎంతో తహతహలాడుచున్నది. నీకివే నా నమస్కారములు' అని వేయినోళ్ళ కీర్తించాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు నారదులవారితో "ఓ మునోత్తమా, నీ రాక నాకు మహా సంతోష దాయకము, నీవు నాకు అత్యంత ఆప్తుడవు, ఈ వేంకటాద్రి నాకు అత్యంత ప్రియమైనది, నీవు వచ్చిన ఈ వేళా విశేషము మిక్కిలి ప్రాధాన్యత కలది. నీకు ఇప్పుడు ఒక అద్భుత రహస్యం విశదిస్తాను, వినవలసినది అని శ్రీనివాసుడు ఈవిధంగా చెప్పసాగాడు, "ఓ మునిశ్రేష్ఠా! ముందు కాలంలో ఈ వేంకటాద్రి భూమండలంపై దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది, రోజూ అనేకమంది భక్తులు నా దర్శనార్థం వేంకటాచలం చేరుకుంటారు, కాలం గడుస్తున్న కొద్దీ వీరి సంఖ్య చాలా ఎక్కువ కాగలదు, చివరికి కొంతకాలానికి తిరుమల చేరుకున్న ప్రతి ఒక్క భక్తునికీ నా దర్శనం లభించటం కష్టతరం కాగలదు. కొంతమంది భక్తులు నా దర్శనం జరగకుండానే వెనుతిరగవలసి వచ్చును. ఇందులకు వారేమీ చింతించవలసిన అవసరం లేదు. ఇందుకు ఒక ఉపాయము కలదు, ఈ వేంకటాద్రిపై ప్రతి చెట్టు, పుట్టలోను నా అంశ, నా తేజస్సు ఎల్లప్పుడూ వెలుగొందుతూ ఉంటుంది. ఈ వేంకటాద్రి మొత్తము నా రూపమే ఆవరించి ఉంటుంది. ఎటువంటి పరిస్థితులలోనైనా నా దర్శనం లభించని భక్తులు ఈ ప్రదేశంలో ఎక్కడ వున్నా, ఏ వృక్షానికి నమస్కరించినా, నాకే నమస్కరించినట్లు కాగలదు. కనులు మూసుకుని ధ్యానిస్తే నేను వారికి



దర్శనమిస్తాను, వారు ఎటువంటి నిరాశకు లోనవకుండా తిరుమలలో ప్రతి ప్రదేశములోనూ నన్ను దర్శించవచ్చును అని సెలవిచ్చాడు.

ఇది విన్న నారదులవారు ఎంతో సంతోషించి, స్వామివారి భక్తజన సులభతకు ఎంతో ఆనందపడి స్వామి వారిని పరిపరి విధాల స్తుతించి, సెలవు తీసుకుని, తిరిగి తన సంచారం కొనసాగించాడు, ఓ శ్రీనివాసా! ఓ శ్రీ వేంకటేశ్వరా! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



# ఓం శ్రీకృష్ణాయ నమః

ఆనందనిలయంలో శ్రీనివాసుడు ప్రతిరోజు ఉదయం 'కౌసల్యా సుప్రజా రామా అంటూ అర్చకస్వాములచే అద్భుతంగా కీర్తించబడే సుప్రభాతంతో మేల్కొంటాడు, శ్రీమన్నారాయణుని చిరునవ్వుతో జగత్తంతా మేల్కొంటుంది, ఆ చిరునవ్వే జగత్తు అంతటికీ రక్షా కవచం. ఆ చిరునవ్వే భక్త జన కోటికి దివ్యానుగ్రహం, ధనుర్మాసంలో మాత్రం సుప్రభాతం బదులుగా, ఆ నెలరోజులపాటు, ఆండాళ్ రచించిన "తిరుప్పావై" పఠనం జరగుతుంది. ఆండాళ్ రచించిన ఈ ముప్పది పాశురాల తిరుప్పావై స్వామికి అత్యంత ప్రీతికరమైనది.

అలనాటి శ్రీకృష్ణుడే ఈ శ్రీ వేంకటేశ్వరుడు. ధనుర్మాసం ముప్పై రోజులు శ్రీ స్వామివారిని శ్రీకృష్ణునిగానే భావించి, పూజలు జరుపబడతాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు శ్రీకృష్ణుడు కాబట్టే గోవిందుడని భక్తులందరిచే పిలవబడుచున్నాడు. ప్రతీ రోహిణీ నక్షత్రం నాడు తిరుమలలో శ్రీకృష్ణుని



రూపంలో శ్రీ స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. ఏటా కన్నుల పండుగగా జరిగే బ్రహ్మోత్సవాలలో కూడా శ్రీ స్వామివారిని శ్రీకృష్ణమూర్తిగా అలంకరించి ఊరేగిస్తారు. ధనుర్మాసం అంతా శ్రీ స్వామివారి వక్షస్థలంలో ఉండే బంగారు "అలమేలు మంగ" ను ఆండాళ్ గానే భావించి అలంకరిస్తారు. ధనుర్మాసంలో స్వామి అద్భుత రూపంతో భక్తులను ఆనందపరవశులను చేస్తారు.

పూర్వకాలంలో కొందరు మునీశ్వరులు, అత్యంత తపోనిష్ఠా గరిష్ఠుడైన ఒక బ్రాహ్మణోత్తముని వద్దకు వెళ్ళి ఓ బ్రాహ్మణోత్తమా ఈ విశ్వంలో గొప్పవాడైన దేవుడెవరు? ఎవరికి మృత్యువు భయపడుతుంది? ఎవరిని తెలుసుకున్నందులన సర్వ విషయాలు తెలుస్తాయి? అని అడిగారు.

అప్పుడా బ్రాహ్మణోత్తముడు "నాయనలారా! చక్కని ప్రశ్న వేశారు, శ్రీకృష్ణుడు పరదేవత. అతని పేరు వింటేనే మృత్యుదేవత కూడా భయపడుతుంది, అతనిని తెలుసుకుంటే సర్వమూ తెలుసుకున్నట్లే, అతడే శ్రీమన్నారాయణుడు, అతడే వాసుదేవుడు, సచ్చిదానంద స్వరూపుడు, విశ్వరూపుడు, కమలనేత్రుడు, కమలనాభుడు, అతడే సృష్టిస్థితిలయకారకుడు. సకల ప్రాణులకు ఆధారభూతుడు అతడే. ఈ విశ్వమే అతని శరీరము, అతడే అంతర్యామి, అనేక రూపాలు ధరించినవాడు అతడే. సర్వవ్యాపకుడైన పరబ్రహ్మమూర్తి అతడే అని ఆ బ్రాహ్మణోత్తముడు శ్రీకృష్ణ స్వరూపం గురించి ఆ మునులకు వివరించాడు.

ద్వాపర యుగంలోని శ్రీకృష్ణుడే నేటి కలియుగంలోని శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీనివాసుడు, ఆపద మ్రొక్కులవాడు, అనాథ రక్షకుడు. అతనిని మనసారా కొలచినవారికి ఎటువంటి బాధలు దరిచేరవు. అకాల మృత్యు భయం వుండదు. ఎటువంటి ఆర్థిక, ఆరోగ్య బాధలు పట్టి పీడించవు, శ్రీనివాసుడు అత్యంత దయామయుడు, ప్రతిరోజు కేవలం ఒక్కసారైనా ఆ స్వామిని మనస్సున తలిస్తే చాలు, సర్వ సౌభాగ్యాలూ అనుగ్రహిస్తాడు. ఆ

courtesy-www.vdesignhome.se

telugusaahityam-telugubooks



స్వామిని నమ్ముకున్నవారికి ఈ సంసార సాగరం మోకాటి లోతే.

ఆ తిరుమలేశుని అనుగ్రహం సంపాదించడం ప్రపంచంలోని అన్నిటికంటే అతి తేలిక. ఏ యజ్ఞాలూ, యాగాలూ అవసరం లేదు, ఏ పదవులూ ఉండనక్కర లేదు, ధనవంతులూ కానక్కరలేదు, కావలసినదల్లా నిష్కళంక భక్తి. గోవిందా అని ఒక్కసారి పిలిస్తే వెంటనే వచ్చి మనల్ని ఆదుకునే అమృతమూర్తి ఆ శ్రీనివాసుడు.

మానవ జన్మ ఎత్తినందుకు గాను ఒక్కసారైనా తిరుమల యాత్ర సంకల్పించి ఆ స్వామిని దర్శనం చేసుకుని జన్మ ధన్యం చేసుకొనవలెను. ఓ శ్రీనివాసా, ఓ శ్రీ వేంకటేశ్వరా, మాకు నీ దర్శన భాగ్యాన్ని అనుగ్రహించు తండ్రీ, నీకివే మా నమస్కారములు.

ఎల్లవేళలయందూ నీయందే మా మనస్సు లగ్నం అగునటుల అనుగ్రహించు తండ్రీ! నీకివే మా శతకోటి ప్రణామములు. ఓ అమృతమూర్తీ! నీకివే మా నమస్కారములు.

*" శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్*
*శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "*

**శ్రీ లక్ష్మీ, శ్రీ పద్మావతీ సమేత శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !!!**



courtesy-www.vdesignhome.se





'VISWAPATHI' (T V R K Murthy, M.Tech)
Phone : 040-65885750 & 9849443752
E-mail : viswapathi@yahoo.com, website : www.shridesigns.net